PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 353 | విజయవాడ, శుక్రవారం 26 జులై 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 26 July 2024 | Rs

కార్పొరేట్లకు రాయితీలు... సామాన్యులకు భారాలు

- ప్రజావ్యతిరేక బడ్జెట్‌పై నిరసనలు
- అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు

• లోపలి పేజీలో..•

క్రమంగా పెరుగుతున్న గోదావరి

- భద్రాచలం వద్ద 48.60 అడుగులకు నీటి మట్టం
- రెండో ప్రమాద హెచ్చరిక
- భయం గుప్పెట్లో విలీన మండలాలు

6




అల్లూరి జిల్లా విఆర్.పురం మండలం ఒడ్డుగూడెంలో వరద నీరు



ప్రారంభోత్సవ వేడుకలకు ముస్తాబైన పారిస్‌లోని సీన్ నది

నేటి నుంచి విశ్వ క్రీడలు



- ఫ్లాగ్ బేరర్‌గా శరత్ కమల్
- పారిస్ ఒలింపిక్స్ ప్రారంభోత్సవ వేడుకలు రాత్రి 11.00గం॥ల నుంచి
- అగ్రస్థానంపై చైనా గురి

పారిస్: యావత్ ప్రపంచం ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న విశ్వ క్రీడల పండుగ వచ్చేసింది. ఫ్రాన్స్ రాజధాని పారిస్ వేదికగా 33వ ఒలింపిక్ క్రీడలు శుక్రవారం నుంచి జరగనున్నాయి. భారత కాలమానం ప్రకారం రాత్రి 11గంటలకు జరిగే ప్రారంభోత్సవ వేడుకలకు పారిస్‌లోని సీన్ నది సిద్ధమైంది. అథ్లెట్లు ఒలింపిక్స్ విలేజ్‌కు చేరుకోవడానికి పడవలు, బల్లకట్టు వంటివి ఉపయోగిస్తున్నారు. వేసవి క్రీడల చరిత్రలో తొలిసారి ప్రారంభోత్సవ వేడుకలు స్టేడియం బయట జరగడం ఇదే తొలిసారి. ఐఒసి అధ్యక్షులు థామస్ బాచ్ ఒలింపిక్ విలేజ్‌ను సందర్శించి అక్కడ ఏర్పాట్లను పర్యవేక్షించారు. క్రీడల ప్రారంభోత్సవానికి మూడురోజుల ముందునుంచే పారిస్‌కు అథ్లెట్ల తాకిడి మొదలైంది. ప్రారంభోత్సవాలు జరిగే సీన్ నదిని సుందరంగా ముస్తాబు చేశారు. ప్రారంభోత్సవాల్లో ఫ్రెంచ్ సంస్కృతీ సాంప్రదాయాలతో పాటు కనులు మిరుమిట్లు గొలిపే లేజర్ షోలను ప్రదర్శించనున్నారు. క్రీడా పోటీలకోసం పారిస్ చుట్టుప్రక్క గ్రామాల్లోనూ సిద్ధం చేశారు. అలాగే పారిస్‌లోని ఈఫిల్ టవర్‌ను 5 రింగులతో సుందర్శంగా తీర్చిదిద్దారు. పోటీలు ముమ్మరమయ్యే సమయానికి 14,500మంది అథ్లెట్లు రావొచ్చని నిర్వాహకులు తెలిపారు. క్రీడాకారుల వసతికోసం 40 హౌసింగ్ బ్లాక్‌లను ప్రత్యేకంగా నిర్మించారు. క్రీడలను తిలకించడానికి ఇప్పటివరకు 3 లక్షల టిక్కెట్లు హాట్‌కేకుల్లా అమ్ముడుపోయాయి. 32 క్రీడాంశాలకు గాను 43 ఈవెంట్‌లు జరగనుండగా... 329 స్వర్ణ పతకాలు అందజేయనున్నారు. భారత్ నుంచి 117 మంది అథ్లెట్లు పతకాలకోసం పోటీపడుతున్నారు. టేబుల్ టెన్నిస్ ఆటగాడు శరత్ కమల్ తివర్ణ పతాకాన్ని చేబూని అథ్లెట్ల బృందం ముందు నడవనున్నాడు.

ఐదేళ్ల చీకటి పాలన

- 'శాంతి భద్రతల'పై శ్వేతపత్రంలో సిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో చీకటి పాలన కొనసాగిందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో శాంతిభద్రతలపై శాసనసభలో ఆయన శ్వేతపత్రం విడుదల చేశారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత పాలకులు అరాచకాలు, అక్రమాలతో పెద్దఎత్తున సంపద పోగుచేసుకున్నారని చెప్పారు. ఐదేళ్ల కాలంలో 250 మంది ఎస్‌సి, ఎస్‌టిలు, 2,027 మంది మహిళలు హత్యకు గురయ్యారని, ప్రతిపక్షపార్టీల మీద మొత్తం మూడు వేలమందికి పైగా కేసులు నమోదు చేసి 2,560 మందిని అరెస్ట్ చేసి వేధించారన్నారు. వైసిపి పాలనలో ప్రజలు మానసికంగా, శారీరకంగా వేదన అనుభవించారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పెట్టిన రాజకీయ ప్రేరేపిత కేసులపై సమీక్షిస్తామని, అక్రమ కేసులు పెట్టిన అధికారులను విడిచిపెట్టేది లేదని ప్రకటించారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్‌పై మరింత లోతుగా చర్చించేందుకు ఒక రోజంతా చర్చించేలా సమావేశాన్ని జరపాలని ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ కోరగా సిఎం చంద్రబాబునాయుడు సానుకూలంగా సానుకూలంగా స్పందించారు.

నాపై 17 కేసులు పెట్టారు

రైతుల కోసం బాబ్లీ ప్రాజెక్టుకు వెళ్లినపుడు వున్న కేసు మినహా తన రాజకీయ జీవితంలో ఎన్నడూ పోలీస్ కేసులేదని గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో 17 కేసులను పెట్టారన్నారు. అలాగే జెసి ప్రభాకరరెడ్డిపై 66 కేసులు, చింతమనేని ప్రభాకర్‌పై 48 కేసులు, పులివర్తి నానిపై 31 కేసులు, దేవినేని ఉమాపై 27, బి రామచంద్రయాదవ్‌పై 27 కేసులు, స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, పి. నారాయణ, నిమ్మల రామానాయుడు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, నారా లోకేష్‌తో పాటు సొంత చెల్లి వైఎస్ షర్మిలపై కేసుపెట్టారని అన్నారు. కేసులు పెట్టడమే కాదు నాయకుల కుటుంబసభ్యులను వేదించారని అన్నారు.

గంజాయికి అడ్డాగా రాష్ట్రాన్ని మార్చారు

గత ప్రభుత్వ హయంలో దేశంలో ఎక్కడ గంజాయిని సీజ్ చేసినా దాని మూలాలు రాష్ట్రంలో కనిపించేవన్నారు. కల్తీ మద్యం, గంజాయికి యువతను బానిస చేశారని విమర్శించారు. తాడేపల్లిలోని జగన్‌మోహన్‌రెడ్డి ఇంటికి సమీపంలో గంజాయిబ్యాచ్ ఓ యువతిని కాబోయే భర్త ఎదుట గ్యాంగ్ రేప్ చేస్తే చర్యలు లేవన్నారు.

మహిళలపై అసభ్య పోస్టులు పెడితే కఠిన చర్యలు


సామాజిక మాధ్యమాల కట్టడికి ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తామని తెలిపారు. మహిళలపై అసభ్య పోస్టులు పెడితే వదిలిపెట్టనని హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో సోషల్‌మీడియాలో మహిళల పట్ల వికృతంగా వ్యవహరించారన్నారు. చివరకు న్యాయవ్యవస్థను బ్లాక్ చేసేలా జడ్జీలకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్ట్‌లు పెట్టారన్నారు. అమరావతి రాజదానిలో మహిళా రైతులను వేదించి కేసులు పెట్టారన్నారు.

పోలీస్ వ్యవస్థ నిర్వీర్యం

వైసిపి ప్రభుత్వ రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పోలీసులు ఆయుధంగా మారారని మిగతా 7లో

ఉద్యోగులపై పెట్టిన కేసులను ఎత్తివేస్తాం

రాష్ట్రంలో సిపిఎస్ రద్దుకోసం, వారి సమ స్యల పరిష్కారం కోసం పోరాడిన 4000 మంది ఉద్యోగులపై పెట్టిన కేసులన్నింటినీ ఎత్తివేస్తామని అన్నారు. కోవిడ్ సమయంలో మాస్ అడిగిన డాక్టర్ సుధాకర్‌ను పిచ్చివాడని ముద్రవేసి చంపారన్నారు. మాజీ జడ్జి రామకృష్ణను వేదించారన్నారు.. సీనియర్ ఐపిఎస్ అధికారి ఎబి వెంకటేశ్వరరావును ఐదేళ్ల పాటు పోస్టింగ్ ఇవ్వకుండా కేసులతో వేదించారని అన్నారు. టిఎడిఎలు అడిగిన ఉద్యోగులను సస్పెండ్ చేశారన్నారు. ఉపాధ్యాయులను వైన్స్‌షాప్‌ల వద్ద కాపలా పెట్టడమే కాదు వారితో మురుగుదొడ్లు కడిగించారని అన్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, నాయకులు ఎంఎ గఫూర్, వైవి, సిహెచ్ బాబూరావు, ప్రభాకరరెడ్డి, చిత్రంలో టిడిపి నేత జనార్ధన్‌రెడ్డి కూడా ఉన్నారు

ప్రజా సమస్యలు పరిష్కరించండి

- ముఖ్యమంత్రికి సిపిఎం విజ్ఞప్తి
- సచివాలయంలో చంద్రబాబును కలిసిన నేతలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును సిపిఎం నేతలు కోరారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు, సిహెచ్ బాబూరావు, కె ప్రభాకర్‌రెడ్డి రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును గురువారం కలిశారు. సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం వి శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న ఆశలను, తక్షణం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ముఖ్యమంత్రికి వినతిపత్రం అందించామని చెప్పారు. పోలవరం రెండు దశల్లోనూ నిర్వాసితులకు పూర్తిస్థాయి పునరావాసం కల్పించాలని, పాత పరిహారం కాకుండా, కొత్తగా 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ పరిహారం అందించాలని కోరామని వివరించారు. చదువుకున్న యువత కోసం ప్రత్యేక డిఎస్‌సికి సంబంధించిన జిఓ 3ను పునరుద్ధరించాలని కోరామన్నారు. ఈ మేరకు అరకు ఎన్నికల సభలో ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేసినట్లు తెలిపారు. అమరావతి రాజధాని నిర్మాణాన్ని వచ్చే ఐదేళ్లలో ప్రణాళిక బద్ధంగా పూర్తిచేసి తక్షణ పరిపాలన సౌలభ్యంగా ఉండేలా చేపట్టాలని, మరోసారి రాజధాని వివాదం కాకుండా చట్టబద్ధ చర్యలు తీసుకోవాలని కోరామని చెప్పారు. ప్రత్యేక హోదా సాధనకు, విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు కృషి చేయాలని కోరినట్లు వివరించారు. రాష్ట్రంలో మతోన్మాదం పెచ్చరిల్లకుండా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. చిన్న ఉద్యోగులపై గత ప్రభుత్వం అనేక కేసులు నమోదు చేసిందని, వీటిని ఎత్తివేయాలని, చెత్తపన్ను రద్దుకు ఆదేశాలివ్వాలని కోరామని తెలిపారు. అంగన్‌వాడీ, విఒఎ, ఆశా వర్కర్లపై రాజకీయ కక్షసాధింపులు జరుగుతున్నాయని, వీరిని తొలగించొద్దని కోరామని చెప్పారు. కొత్తగా ప్రారంభించిన మెడికల్ కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్స్ కోటాలో కాకుండా కన్వీనర్ కోటాలోనే పూర్తిస్థాయి సీట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. ప్రైవేట్ కళాశాలలు పేదలకు ఉచిత సీట్లు కేటాయించవని, ప్రభుత్వ కళాశాలల్లో కూడా కేటాయించకపోతే వారికి న్యాయం జరగదన్నారు. ఈ అంశాన్ని కూడా పరిశీలిస్తామని చెప్పారని వెల్లడించారు. సమస్యలు చాలా ఉన్నాయని, తక్షణం ఎదుర్కొంటున్న సమస్యలను సిఎం దృష్టికి తీసుకొచ్చామని అన్నారు. పోలవరం నిర్వాసితుల పునరావాసంపై దృష్టిపెడతామని, జిఓ మూడు పునరుద్ధరణ చేసేందుకు సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసి చర్యలు తీసుకుంటామంటూ సిఎం సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఉద్యోగులపై కక్షసాధింపు చర్యలు తమ ప్రభుత్వంలో ఉండవని, వారికి ఉద్యోగభద్రత కల్పిస్తామని చంద్రబాబు చెప్పారని తెలిపారు. కొంత సమయం ఇస్తే పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని చెప్పారు. ప్రజలు పెట్టుకున్న ఆశలను నెరవేరుస్తామని, తాము తెలియజేసిన సమస్యలపై సానుకూలంగా పరిష్కరిస్తారని ఆశిస్తున్నామని అన్నారు. సమస్యలు పరిష్కారం కాకపోతే ప్రభుత్వం నుంచి వచ్చే స్పందన బట్టి ఏం చేయాలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

ముఖ్యమంత్రికి సిపిఎం సమర్పించిన వినతిపత్రం పూర్తి వివరాలు 2

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

- మండలిలో పిడిఎఫ్ వాయిదా తీర్మానం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వరరావు, స్వతంత్ర ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ శాసనమండలిలో వాయిదా తీర్మానం అందజేశారు. శాసనమండలి గురువారం ప్రారంభం కాగానే ఈ అంశంపై చర్చించాలని ఛైర్మన్ కె మోషేనురాజుకు అందజేశారు. ఈ వాయిదా తీర్మానాన్ని తిరస్కరించినట్లు ఛైర్మన్ ప్రకటించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ.. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసేందుకు గత ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. ఈ చట్టం ప్రకారం 10,117 మందిని రెగ్యులరైజ్ చేసేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వం చేసిందన్నారు. ఆచరణలో మాత్రమే మూడు వేల మంది మాత్రమే రెగ్యులరైజ్ అయ్యారని, మిగిలిన వారిని ప్రభుత్వం చేయలేదన్నారు. మిగిలిన వారిని కూడా రెగ్యులరైజ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

పోలవరానికి కొత్త డయాఫ్రమ్ వాల్

- కేబినెట్ గ్రీన్‌సిగ్నల్
- 29న ఓటాన్ అకౌంట్ ఆర్డినెన్స్!

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



పోలవరం ప్రాజెక్టు

పోలవరం ప్రాజెక్టుకు కొత్త డయాఫ్రమ్‌వాల్ నిర్మించాలని రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయించింది. సచివాలయంలోని బ్లాక్‌వన్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన గురువారం అత్యవసర కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఈనెల 27న ఢిల్లీలో జరిగే నీతిఆయోగ్ సమావేశంలో నూతన డయాఫ్రమ్‌వాల్ నిర్మాణానికి అనుకూలంగా ప్రతిపాదించాలని నిర్ణయించారు. పస్తుతం ఉన్న డయాఫ్రమ్ వాల్‌కు తీవ్ర నష్టం వాటిల్లిన నేపథ్యంలో మరమ్మతులు చేసినా గ్యారెంటీ ఇవ్వలేమని సమాంతరంగా మరో డయాఫ్రమ్ వాల్ నిర్మించాలని విదేశీ నిపుణుల కమిటీ తేల్చిచెప్పిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో మంత్రివర్గ సమావేశ తీర్మాన కాపీని నీతి అయోగ్ ఆమోదం కోసం పంపాలని తాజాగా నిర్ణయించారు. దీంతోపాటు పోలవరం ఎత్తు తగ్గించకుండా 45.06 అడుగులు నిర్మించాలని, నూతన డయాప్రమ్ వాల్ నిర్మాణాన్ని వీలైనంత త్వరగా చేపట్టాలని కూడా మంత్రివర్గ సమావేశం తీర్మానించినట్లు సమాచారం. మంత్రుల పేషీల్లో ఎంత మంది సిబ్బందిని నియమించుకోవాలన్న అంశం కూడా ఈ సమావేశంలో చర్చకు వచ్చినట్లు తెలిసింది. ఎన్ని పోస్టులు మంజూరు చేయాలి? వారి జీత భత్యాల గురించి కూడా మంత్రి వర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. పోస్టుల మంజూరుపై ఒకటి రెండు రోజుల్లో జీఓ విడుదల చేయని పక్షంలో పేషీల్లో పనిచేసే ఉద్యోగులకు ఆగస్టులో జీతాలు వచ్చే పరిస్థితి ఉండదని మంత్రులు సిఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. దీంతో పాటు నామినేటెడ్ పోస్టులను కూడా ఆగస్టు మొదటి వారంలో భర్తీ చేసేందుకు కసరత్తును ముమ్మరం చేయాలని కూడా నిర్ణయించినట్లు తెలిసింది. అసెంబ్లీ సమావేశాలు ఈనెల 26తో ముగియనుండటంతో 27న గవర్నర్ సమావేశాలను ప్రోరోగ్ చేయనున్నారు. ఈనెల 29న ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌పై ఆర్డినెన్స్ తీసుకురావాలని కూడా మంత్రి వర్గంలో నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.


మాజీ సిఎం జగన్ ఢిల్లీ దీక్షపై ఆరా!

అధికారులు బయటకు వెళ్లిన తర్వాత మాజీ సిఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఢిల్లీలో చేపట్టిన ఒక రోజు దీక్ష గురించి మంత్రులతో చంద్రబాబు చర్చించినట్లు తెలిసింది. జగన్ దీక్షకు ఇండియా ఫోరమ్ లోని పార్టీలు మద్దతు ఇవ్వడంపై కూడా ఆరా తీసినట్లు సమాచారం.

అమరావతి మాస్టర్ ప్లాను పునరుద్ధరణ..

భూసేకరణకు సన్నాహాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రాజధాని మాస్టర్‌ప్లాను పునరుద్ధరణ దిశగా సిఆర్‌డిఏ అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా పూలింగులో ఇవ్వగా మిగిలిన భూమిని రైతుల నుండి సేకరణ పద్ధతిలో తీసుకునేందుకు సిద్ధమైంది. ఎవరైనా రైతులు ముందుకొచ్చి పూలింగు పద్ధతిలో భూములిస్తే తీసుకోవాలనీ నిర్ణయించింది. దీనికి సంబంధించి అంతర్గత ప్రక్రియను మొదలుపెట్టింది. రాజధాని అమరావతి పరిధిలో పూలింగు ప్రక్రియ ముగిసే నాటికి 4,800 ఎకరాల భూమిని రైతులు ప్రభుత్వానికి ఇవ్వలేదు. దీనిపై అప్పటి ప్రభుత్వం 2015 చివర్లో భూసేకరణ నోటిఫికేషన్ ఇచ్చింది. అనంతరం కొంతమంది రైతులు భూములు పూలింగు పద్ధతిలో సిఆర్‌డిఏకు ఇచ్చేశారు. 2016 చివరి నాటికి 2,200 ఎకరాలు మాత్రమే పెండింగ్‌లో ఉంది. పూలింగుకు ఇవ్వని భూమిని యజమానులు ఎక్కువ భాగం అమ్మగా కొనుగోలు చేసిన వారు పూలింగుకు ఇచ్చేశారు. 2018 చివరి నాటికి మొత్తంగా 1,900 ఎకరాలు ఇవ్వాల్సి ఉంది. అప్పటి ప్రభుత్వం నయానో భయానో రైతులతో మాట్లాడి ఇంకొంత భూమిని సమీకరణ ప్రక్రియలో తీసుకుంది. సుమారు 1,320 ఎకరాల వరకూ భూమి సేకరణ ప్రక్రియ కిందకు వచ్చింది. 2019 ఎన్నికల సమయంలో పూలింగుకు ఇవ్వని వారి భూములను తిరిగి వారికే ఇచ్చేస్తామని, సేకరణ నోటిఫికేషన్ రద్దు చేస్తామని వైసిపి నాయకులు ప్రకటించారు. 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు రాజధానులను ప్రకటన చేసింది. అనంతరం అమరావతి పరిధిలో పనులు నిలిచిపోయాయి. అప్పటికి పెనుమాకలో సుమారు 625 ఎకరాలు, మందడంలో 111 ఎకరాలు, వెంకటపాలెంలో 66 ఎకరాలు, ఉండవల్లిలో 120 ఎకరాలు పెండింగ్‌లో ఉంది. వీటితోపాటు వెలగపూడి, మల్కాపురం, రాయపూడి, ఉద్దండ్రాయునిపాలెం, లింగాయపాలెం పరిధిలో సుమారు 320 ఎకరాల వరకూ పెండింగ్‌లో ఉంది. అప్పటి వరకూ మిగిలిపోయిన భూములను సేకరణ నోటిఫికేషన్ నుండి బయటపడేస్తామని ఇచ్చిన హామీ మేరకు పెనుమాక, ఉండవల్లి పరిధిలో భూములతోపాటు ఇతర గ్రామాల్లోనూ సేకరణ నోటిఫికేషన్లు రద్దు చేస్తూ గుంటూరు మిగతా 7లో

జనం చెవిలో 'కమలం' పూలు!

గిరిపుత్ర

ఈ నెల 23న ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో మేలు జరిగినట్టు కమల నాథులు, అంతకుమించి కొన్ని పత్రికలూ ఊదరగొడుతున్నాయి. అమరావతి నిర్మాణానికి పదిహేను వేల కోట్ల రూపాయలు మల్టీలేటరల్ ఆర్థిక సంస్థల నుండి రుణం సమకూర్చుతామని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. అంతేగాక అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రపంచబ్యాంకు వంటి వాటితో ఇప్పిస్తామని వివరించారు కూడా! అయినా, ఆ సొమ్ము కేంద్ర ప్రభుత్వం గ్రాంటుగా ఇవ్వనుందని కొండంత అబద్ధాన్ని ఈ రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపి పురందేశ్వరి, అనకాపల్లి ఎంపి సిఎం రమేష్ పార్లమెంటు లాబీల్లో మీడియాతో చెప్పారు. ఆ వీడియోను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయడం జనం చెవుల్లో కమలం పూలు పెట్టడమే! పోలవరం గురించి కూడా దాదాపు అలాంటి హైప్ సృష్టిస్తున్నారు. మొత్తంగా వీరి మాటలు 'మా ఊరి మిరియాలు తాటి కాయలంత' అన్న చందంగా ఉన్నాయి.

నిజం ఏమిటి?

ఆర్థికమంత్రి బడ్జెట్ ప్రసంగం 7వ పేజి, 33వ పేరాలో అమరావతి గురించి 'మల్టీలేటరల్ అభివృద్ధి సంస్థల ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.15,000 కోట్లు ఏర్పాటు (ఎరేంజ్) చేస్తామని' పేర్కొన్నారు. అమరావతి నిర్మాణానికి ఆ మేరకు అప్పు ఇప్పిస్తామని హామీనిచ్చారన్నమాట. చట్టంలో 'షల్ ప్రొవైడ్' అని స్పష్టంగా పేర్కొన్నారంటే అది కేంద్రం తప్పనిసరి బాధ్యత. కానీ బడ్జెట్ ప్రసంగంలో 'ఫెసిలిటేట్' అనీ 'ఎరేంజ్' అనీ పదాలను వాడారంటేనే ఇందులో తిరకాసును అర్థం చేసుకోవచ్చు. ఏదైనా రాష్ట్ర ప్రభుత్వం విదేశీ ఆర్థిక సంస్థ నుండి లేదా ఇంకేదైనా సంస్థ నుండి రుణం తీసుకోవాలంటే దానికి కేంద్ర ప్రభుత్వం గ్యారంటీగా నిలవాలి. మన రాజ్యాంగం ప్రకారం భారతదేశం సార్వభౌమాధికారం గలిగినదేతప్ప ఏ ఒక్క రాష్ట్రానికీ అటువంటి అవకాశం లేదు. కనుక రాష్ట్ర ప్రభుత్వం అప్పు తీసుకోవాలంటే కేంద్రం సమ్మతి తప్పనిసరి. (రిజర్వ్ బ్యాంక్ నుండి తీసుకోవాలన్నా ప్రతి త్రైమాసికానికీ రాష్ట్ర ప్రభుత్వానికిగల క్రెడిట్ లిమిట్‌కు లోబడి మాత్రమే మంజూరు చేస్తుంది. తప్పనిసరి పరిస్థితుల్లో ఏదో ఒక నెలలో తీసుకుంటే ఆ తరువాతి నెలల్లో పరిమితికి కోత పెడతారు) కాబట్టి అమరావతి నిర్మాణానికి కేంద్రం పూచీగా వుంటూ అప్పు ఇప్పించడమే ఇక్కడ ఈ రాష్ట్రానికి కల్పించే 'మహా భాగ్యం'! దాన్ని కొందరు చిలువలు పలువలు చేయగా పురందేశ్వరి, సిఎం రమేష్ ఏకంగా అది గ్రాంటు అని వైరల్ చేయడం మరింత దారుణం.

చట్టం ఏం చెబుతోంది..?

'కొత్తగా ఏర్పడిన రాష్ట్ర రాజధానిలో రాజ్‌భవన్, హైకోర్టు, సచివాలయం, శాసనసభ, మండలి మరియు అవసరమయ్యే ఇతర మౌలికవసతులను కేంద్ర ప్రభుత్వం సమకూర్చుతుంది. (షల్ ప్రొవైడ్)' అని రాష్ట్ర పునర్నిర్మాణ చట్టం సెక్షన్ 94(3) పేర్కొంది. అంటే, రాజధాని నిర్మాణ ఖర్చు కేంద్రం భరించాలి. కానీ ఈ చట్టవిహిత బాధ్యతను మోడీ సర్కారు విస్మరిస్తుంటే దాన్ని ప్రశ్నించకుండా అమరావతి నిర్మాణానికి అప్పుగానైనా నిధులు లభిస్తున్నాయన్న రీతిలో కొందరు బల్లలు చరచడం ఈ రాష్ట్రానికి అన్యాయం చేయడమే అవుతుంది. అంతేగాక పునర్విభజన చట్టం సెక్షన్ 90(4)ప్రకారం కేంద్ర ప్రభుత్వం 'పోలవరం'ను జాతీయ ప్రాజెక్టుగా చేపడుతుంది. కనుక పునరావాసంతో సహా యావత్ ఖర్చులనూ కేంద్రమే భరించాలి. కానీ ఇప్పటికీ కేంద్ర పాలకులు ఇరిగేషన్ కాంపోనెంట్ అంటూ నొక్కుతూ పునరావాస పునర్నిర్మాణ ఖర్చు ఎగ్గొట్టాలని చూస్తుంటే రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు మీనమేషాలు లెక్కించడం తగని పని.

ఎప్పుడూ మభ్యపుచ్చే మాటలే!

ఏ రోటికాడ ఆ పాట పాడటం బిజెపి నేతలకు వెన్నతో పెట్టిన విద్య! విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు అని సాధించుకున్న స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటీకరించాలన్న మోడీ సర్కారు నిర్ణయంలో మాయమాటలు చెబుతూనే ఉన్నారు. విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కుతోసహా ఆంధ్రప్రదేశ్‌కు విభజన చట్టం హామీల విషయంలో వారిది ఇదేదారి. ఇప్పుడు కేంద్రంలో అధికారాన్ని నిలుపుకోవడానికి టిడిపి మద్దతు తీసుకుంటున్న కమలం పార్టీ ఈ రాష్ట్రానికి ఇవ్వని నిధులను ఇస్తున్నట్టూ, అప్పును గ్రాంటుగా మసి పూసి మారేడు కాయ చేయాలని యత్నించడం దారుణం. బిజెపి నేతల మోసాలను తెలుగుదేశం పార్టీ నాయకులు, అనుయాయులూ ఇప్పటికైనా అర్థం చేసుకుంటారా! ఆ మాయలోనే కొట్టుకుపోతారా!!

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించండి

ముఖ్యమంత్రికి సమర్పించిన వినతిపత్రంలో సిపిఎం

ప్రత్యేక హోదా.. విశాఖఉక్కు పరిరక్షణకై విజ్ఞప్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధనకు, విశాఖస్టీల్ ప్లాంట్ పరిరక్షణకు కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును సిపిఎం కోరింది. ఆ పార్టీ రాష్ట్రకార్యదర్శి వి శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్, రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు, సిహెచ్ బాబూరావు, కె ప్రభాకర్ రెడ్డి సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి వినతిపత్రం సమర్పించారు. వీటితో పాటు రాష్ట్ర ప్రజానీకం ఎదుర్కుంటున్న వివిధ సమస్యలను వివరించి, వాటిని పరిష్కరించాలని కోరారు. అంతకుముందు అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించినందుకు సిఎంకు శుభాకాంక్షలు తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు 16,347 టీచర్ పోస్టుల భర్తీకి, ల్యాండ్‌టైటిలింగ్ చట్టం రద్దుకు, పింఛన్ రూ.4వేల పెంపు, అన్నక్యాంటీన్ల పునరుద్ధరణ, నైపుణ్య గణనపై తొలి సంతకాలు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ముఖ్యమంత్రికి అందచేసిన వినతిపత్రంలోని అంశాలు :

పోలవరం నిర్వాసితులపై ...

'పోలవరం నిర్వాసితులకు భూసేకరణ చట్టం-2023, రాజ్యాంగం 5వ షెడ్యూలు నిబంధనల ప్రకారం భూమికి భూమితో పాటు నష్టపరిహారం, పునరావాస ప్యాకేజీని తాజాపరిచి అమలు చేయాలి. ప్రస్తుతం 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరికి ఆర్అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి. షెడ్యూల్ ప్రాంతంలో వారికి నాణ్యమైన కాలనీలు నిర్మించి నివాసయోగ్యమైన సౌకర్యాలను కల్పించాలి. గత ఎన్నికల్లో వాగ్దానం చేసినట్లుగా ఏజెన్సీ ప్రాంత నిరుద్యోగ యువతకు లాభం చేసే జివో 3ను పునరుద్ధరించి, ప్రత్యేక డిఎస్సి నిర్వహించాలి. వందలాదిగా ఉన్న భాషా వాలంటీర్లను రెగ్యులరైజ్ చేసి జీతాలు పెంచాలి. అటవీ సంరక్షణ చట్టం ప్రకారం పోడు భూములకు పట్టాలివ్వాలి.'

విశాఖ ఉక్కుపై

'విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఉపసంహరించుకునేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలి. సొంత గనులు కేటాయించి పెట్టుబడి సమకూర్చాలి. కేంద్రంపై ఒత్తిడి చేస్తూనే రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ఉన్న గనులను విశాఖ ఉక్కుకు కేటాయించాలి. రుణ సౌకర్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం సహాయం చేయాలి. ప్రైవేటీకరణ జరగకుండా లాభాల బాటలో నడిపేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి విశాఖ ఉక్కును కాపాడాలి.'

రాజధాని నిర్మాణంపై

'అమరావతి రాజధాని నిర్మాణాన్ని వచ్చే ఐదేళ్లలో ప్రణాళిక బద్ధంగా పూర్తి చేయాలి. తక్షణ పరిపాలన సౌలభ్యంగా ఉండే విధంగా రాజధాని నిర్మాణంచేపట్టాలి. మరోసారి రాజధాని వివాదం కాకుండా చట్టబద్ధ చర్యలు తీసుకోవాలి.'

అక్రమ కేసులు ఉపసంహరించాలి

'వివిధ ప్రజా సమస్యలపై ఆందోళన చేస్తున్న ఉద్యమకారులపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలి. శాంతియుతంగా చేసే ఆందోళనలను నిర్బంధంగా అణిచివేసే పద్ధతులకు స్వస్తి చెప్పి ఆయా తరగతుల, రంగాలతో చర్చలు జరిపి సామరస్యంగా సమస్యలు పరిష్కరించాలి. పోలవరం, స్మార్ట్ మీటర్లు, మద్యం, ఇసుక, భూదందాలు తదితర అంశాల్లో జరిగిన అవినీతిపై విచారణ జరిపించి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి. మూడు కొత్త క్రిమినల్ చట్టాల అమలును నిలిపివేసి, వీటిని రద్దు చేయాలని కేంద్రాన్ని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేయాలి.'

మతోన్మాదం అరికట్టాలి

'రాష్ట్రంలో మతోన్మాదం పెచ్చురిల్లే ప్రమాదం పెరిగింది. రాజ్యాంగ మూల స్తంభాలైన లౌకిక తత్వం, ఫెడరలిజం, ప్రజాస్వామిక వ్యవస్థలను, పద్ధతులను గౌరవించి తూచా తప్పకుండా అమలు జరిపేందుకు ప్రభుత్వం కృషి చేయాలి. గతంలో ప్రతిపక్షంలో ఉండగా ప్రజాస్వామ్య హక్కుల కోసం మీరు పోరాటాన్ని ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నాం. ఈ అంశాల సాధన కోసం మీరు చేసే పోరాటానికి మా పార్టీ మద్దతు ఉంటుంది'.

వేతనాల సలహా బోర్డు పునరుద్ధరించాలి

'వివిధ షెడ్యూల్డ్ రంగాలలో ఉన్న అసంఘటిత కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలుగా ప్రకటించి , కనీస వేతనాల సలహా బోర్డును పునరుద్ధరించాలి. కార్మిక చట్టాలను పగడ్బందీగా అమలు చేసి పరిశ్రమలలో ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలు తీసుకోవాలి. భవన నిర్మాణ కార్మికులు సహా అన్ని రకాల సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేయాలి. ఎన్నికలకు ముందు జరిగిన అంగన్‌వాడీ, ఆశా, మున్సిపల్ తదితర రంగాల ఒప్పందాలను గౌరవించి ఆయా సంఘాలతో చర్చించి వేతనాలను పెంచాలి. వత్తి దారులకు సబ్సిడీతో కార్పొరేషన్ రుణాలు అందించి వత్తిని ఆధునికరించే పరికరాలను చౌకగా అందించాలి.'

భూ సేకరణ-2013 చట్టం అమలు చేయాలి

'భూసేకరణలో 2013 చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలి. గతంలో చేసిన సవరణలను ఉపసంహరించుకోవాలని, గ్రామ సభలు నిర్వహించకుండా ఆదివాసీలు, రైతుల భూములను బలవంతంగా తీసుకోవద్దు. జివో 596ను రద్దు చేసి 9/77 ప్రకారం అసైన్డ్ భూములను అసలు లబ్ధిదారులైన పేదలకు కేటాయించాలి. రాష్ట్రంలో ప్రభుత్వ, నిరుపయోగంగా ఉన్న మిగులు భూములను పంచాలని, పరిశ్రమలు పెట్టకుండా ఖాళీగా ఉన్న భూములను వెనక్కి తీసుకొని పేదలకు ఇవ్వాలి. గత ప్రభుత్వం అసంపూర్ణంగా వదిలేసిన ఇళ్ల కాలనీల నిర్మాణాన్ని పూర్తి చేయాలి. టిట్కో లబ్ధిదారులకు ఇళ్ళు కేటాయించాలి.

సిపిఎస్ రద్దు చేయాలి

'కాంట్రీబ్యూటరీ పెన్షన్ స్కిం(సిపిఎస్) రద్దుచేయాలి. ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎన్నికల్లో మీకు సంపూర్ణ మద్దతునిచ్చారని, వారి ఆశలకు అనుగుణంగా ఒపిఎస్ పునరుద్ధరించాలి. అత్యంత పేదలు, బలహీనవర్గాలకు చెందిన చిరుద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి. రాజకీయ కారణాలతో తొలగింపులు/ వేధింపులు తక్షణం ఆపాలి.'

ఎస్సి,ఎస్టి పథకాలను పునరుద్ధరించాలి

' ఎస్సీ, ఎస్టీ పథకాలను పునరుద్ధరించాలి. రాష్ట్ర, జిల్లా ఎస్సీ మానిటరింగ్ కమిటీలను ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశపరచాలి. దళితులపై దాడులు, మహిళలపై అత్యాచారాలు జరగకుండా నివారించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలి. ట్రైబల్ అడ్వైజరీ కమిటీ (టిఎసి)ని చురుగ్గా పనిచేయించాలి. మహిళలపై అత్యాచారాల నిరోధానికి, అలాంటి కేసుల్లో సత్వర న్యాయం జరిగేందుకు నిర్భయ చట్టం కచ్చితంగా అమలు జరపాలి. దశలవారీ మద్య నిషేధాన్ని అమలు చేసి గంజాయిని పూర్తిగా నిర్మూలించాలి.'

జివో 117, 107,108లు రద్దు చేయాలి

'గత ప్రభుత్వం నూతన విద్యా విధానం పేరుతో విద్యారంగాన్ని అస్తవ్యస్తం చేసిన 117వ జీవోను రద్దు చేయాలి. మెడికల్ కాలేజీలలో కౌన్సిలింగ్ సీట్ల సంఖ్యను పెంచాలి. కొత్త ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సెల్ఫ్ ఫైనాన్సింగ్ మరియు ఎన్ఆర్ఐ సీట్లకు అవకాశం కల్పిస్తున్న జిఓ107,108లను రద్దు చేయాలి.'

పన్నులు రద్దు చేయాలి

'చెత్తపన్ను రద్దు ఆదేశాలు ఇవ్వాలి. ఆస్తి విలువ ఆధారిత ఇంటిపన్ను విధానం రద్దు చేయాలి. టిడిపి ప్రణాళికలో హామీ ఇచ్చిన విధంగా విద్యుత్ ఛార్జీలు పెరగకుండా చర్యలు తీసుకోవాలి. ట్రూఅప్‌ఛార్జీలు రద్దు చేయాలని కోరారు.

ఉపాధి హామీ పథకంలో కూలీలకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలి. పంప్డ్ స్టోరేజీ హైడల్ ప్రాజెక్టు, సెకీ ఒప్పందాలను రద్దు చేయాలి. స్థానిక సంస్థలకు న్యాయంగా రావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలి. ధ్వంసమైన గ్రామీణ రోడ్లను బాగు చేయాలి. పట్టణాలలో డ్రైనేజీ, మంచినీటి సౌకర్యం కల్పించాలి. దోమలను నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలి. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకొని కషి చేయాలి. కొత్త ప్రభుత్వంపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, వీటికి అనుగుణంగా ప్రభుత్వం పని చేయాలి. ఎన్నికల క్యాంపెయిన్‌లోనూ, ప్రణాళికలోనూ 'సూపర్ 6'తో సహా కొన్ని వాగ్దానాలు అమలు జరిపేందుకు కాల పరిమితితో కూడిన షెడ్యూలును ప్రకటించాలి. దీర్ఘ కాలిక ప్రణాళికలతో పాటు రాష్ట్ర అభివద్ధి కోసం ఈ ఐదు సంవత్సరాలలో అమలు చేయగలిగిన కార్యాచరణ ప్రణాళికను ప్రకటించాలి.'

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు

'కౌలు రైతుల సంక్షేమానికి గుర్తింపు కార్డులు ఇవ్వాలి. 2019 కౌలుదారి చట్ట సవరణ రద్దుచేసి భూ యజమాని సంతకం లేకుండా కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలి. 2011 చట్టాన్ని పునరుద్ధరించాలి. కౌలు రైతులకే నేరుగా సొంతపూచికత్తుపై పంట రుణాలు ఇవ్వాలి. నష్టపోయిన సందర్భాల్లో పరిహారం వారికే ఇవ్వాలి. వ్యవసాయ అభివద్ధి కోసం ధరల స్థిరీకరణ నిధికి 5 వేల కోట్లు కేటాయించాలి. ఉచిత పంటల బీమా అమలు చేయాలి. సహకార వ్యవస్థను పటిష్ట పరిచి పాల సేకరణలో అమూల్ జోక్యాన్ని నిలిపివేసి సహకార సంఘాల ద్వారా చేయాలి.' సహకార చక్కెర ఫ్యాక్టరీలను తిరిగి తెరిపించాలి.'

నిర్వాసితులపై దృష్టి సారిస్తాం: సిఎం హామీ

పోలవరం నిర్వాసితుల పునరావాసంపై దృష్టిపెడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సిపిఎం బృందానికి హామీ ఇచ్చారు. చిరు ఉద్యోగులు, కార్మికులపై కక్షసాధింపులకు పాల్పడబోమని, జివో 3రద్దు చేసేందుకు న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని, చెత్తపన్ను రద్దుకు ఆదేశాలు ఇస్తామని చెప్పారు. ఇతర సమస్యల పరిష్కారానికి చేసిన సూచనలపై కూడా సిఎం సానుకూలంగా స్పందించారు.

హోదా, విభజన అంశాలు సాధించాలి

'రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రానికి చాలా అన్యాయం జరిగింది. దీనిని సరిదిద్దేందుకు గత కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక హోదా ఇస్తామని పార్లమెంట్‌లో ప్రకటించింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం కూడా హోదా ఇస్తామని వాగ్దానం చేసినా ఇంతవరకు ఆచరణ లోకి రాలేదు. ఈ హామీకి విరుద్ధంగా పార్లమెంటులో ప్రత్యేక హోదా ఇవ్వలేమని పదే పదే కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వంలో కూడా మీరు భాగస్వామిగా ఉన్నారు. అందువల్ల హోదాను పట్టు పట్టి సాధించాలనివిజ్ఞప్తి చేస్తున్నాం. రాష్ట్ర అభివద్ధికి ఇది ఎంతో కీలకమైన అంశం. విభజన సందర్భంగా ప్రకటించిన అనేక పథకాలు ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. కడప ఉక్కు ఫ్యాక్టరీ, పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్మాణంలో ముఖ్యభాగమైన నిర్వాసితుల పునరావాసానికి నిధులు, రాజధాని నిర్మాణం, వెనకబడిన ప్రాంతాల అభివద్ధి, విశాఖ రైల్వే జోన్, కేంద్ర విద్యా సంస్థలు ఇంతవరకు పూర్తి కాలేదు. వెనుకబడిన ప్రాంతాలలో పరిశ్రమల స్థాపన, ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేయటానికి ప్రాధాన్యత ఇవ్వాలి. వెనకబడిన ప్రాంతాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీని అమలు చేయాలి. అవసరమైన నిధులు కేటాయించలేదు. ఈ బడ్జెట్‌లో న్యాయం జరుగుతుందనుకుంటే నిరాశ మిగిలింది. రాష్ట్రప్రభుత్వం తరపున శ్రద్ధ తీసుకొని అన్ని పక్షాలను కూడగట్టి కేంద్రం నుండి సత్వర న్యాయం జరిగేటట్లు చూడాలి. అంతర్రాష్ట్ర సమస్యలు ప్రత్యేకించి తెలంగాణతో ఉన్న సమస్యలు నీటి వాటాలు, ఆస్తి పంపిణీ, ఉద్యోగుల విభజన తదితర అంశాలపై రెండు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య మీరు శ్రద్ధ తీసుకుని ప్రారంభించిన చర్చలను ఆహ్వానిస్తున్నాము. వీటిని కొనసాగించి త్వరగా పరిష్కారం చేసుకోవడం అవసరం'

స్టీల్ ప్లాంట్‌కు నిధులు కేటాయించకపోవడం అన్యాయం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)



రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 1260వ రోజుకు చేరాయి. దీక్షలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షను గుర్తెరిగి విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటీకరణ చేయబోనని ప్రకటించకపోవడం దారుణమన్నారు. తాజా కేంద్ర బడ్జెట్‌లో ఉక్కును ఆదుకునేందుకు నిధులు ప్రకటించకపోవడం దుర్మార్గమన్నారు. కేంద్రం తీరుతో కార్మికులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. తక్షణమే ప్రయివేటీకరణ చర్యలను ఉపసంహరించుకుని ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని కోరారు. దీక్షల్లో నాయకులు కె.రాజబాబు, మసేన్‌రావు, డొక్కా నర్సింగరావు, నరేష్ కుమార్, జి.జయ, తాండ్ర కనకరాజు, గుమ్మడి నరేంద్ర కుమార్ పాల్గొన్నారు. సిపిఐ నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, కార్మిక సంఘాల నాయకులు దాసరి శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు.

డిసెంబరు నెలాఖరుకు టిడ్కో ఇళ్లు పంపిణీ

- మున్సిపల్‌శాఖ మంత్రి పి నారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

లబ్ధిదారులకు 3,13,832 టిడ్కో ఇళ్లను పూర్తి చేసి, డిసెంబరు నెలాఖరుకు అప్పగించాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని మున్సిపల్‌శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. టిడ్కో గృహాలపై గురువారం శాసనసభలో టిడిపి ఎమ్మెల్యేలు పివిజిఆర్ నాయుడు, వెలగపూడి రామకృష్ణ, తెనాలి శ్రావణ్‌కుమార్, కొలికిపూడి శ్రీనివాసరావు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. రాష్ట్రంలో 2014-19 మధ్య కాలంలో పేదల కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మాణాలు చేపట్టామన్నారు. ప్రతి మహిళా ఆనందంతో ఉండే ఇళ్లు కట్టాలని, ఎంత ఖర్చయినా ఫరవాలేదని సిఎం చెప్పారన్నారు. అమరావతి రాజధాని కోసం దేశ, విదేశాలకు వెళ్లినప్పుడు అక్కడ పేదలకు ఇళ్లు ఎలా ఉన్నాయో అధ్యయనం చేసి ఇక్కడ కట్టించినట్లు మంత్రి నారాయణ శాసనసభలో వెల్లడించారు. ఇందులో భాగంగా టిడ్కో ద్వారా మొత్తం 7 లక్షల 14 వందల 81 ఇళ్లను నిర్మించేందుకు కేంద్రం నుంచి అనుమతి తీసుకున్నట్లు తెలిపారు. వీటిలో 5 లక్షల ఇళ్లకు గానూ 3 లక్షల 13 వేల 832 ఇళ్లకు టెండర్లు పిలవగా, 77,371 ఇళ్లు పూర్తయినట్లు పేర్కొన్నారు. మరో 89,671 ఇళ్లు (75 శాతం) పూర్తి చేసినట్లు, 49,329 ఇళ్లు 50 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. 2019 చివరిలోపే 2,16,370 ఇళ్లు పూర్తి చేసినట్లు మంత్రి నారాయణ పేర్కొన్నారు. 19-24 మధ్య అధికారంలోకి వచ్చిన వైసిపి 25 శాతం కూడా పూర్తి చేయలేదని, ఈ కారణంతో 52,192 ఇళ్లను జాబితా నుంచి తొలగించినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 104 మున్సిపాలిటీల్లో 2,61,640 ఇళ్లు ప్రారంభించినట్లు చెప్పారు. వీటితోపాటు విశాఖపట్నం, పద్మనాభనగర్‌లో 864 ఇళ్లకు టెండర్లు పిలిచి పూర్తి చేశామన్నారు. కొన్నిచోట్ల ఇళ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ మౌలిక వసతుల కల్పన పూర్తికాకపోవడంతో లబ్ధిదారులకు ఇళ్లు అందించలేదన్నారు.

కంపెనీలకు భారీ నజరానా

- మండలి వేదికపై మరోసారి బహిర్గతమైన కేంద్ర పంటల బీమా బాగోతం
- ప్రభుత్వాలు చెల్లించాల్సిన ప్రీమియం రూ.2,503 కోట్లు
- కంపెనీలు రైతులకు చెల్లించేది రూ.1,251 కోట్లు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

విపత్తుల వలన పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకంటూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పంటల బీమా పథకాలు బాధిత రైతాంగానికి కలిగించే ప్రయోజనాలేమోకానీ, ఇన్సూరెన్స్ కంపెనీలకు మాత్రం మంచి లాభదాయకంగా ఉన్నాయని గురువారం శాసన మండలి వేదిక ద్వారా మరోసారి రుజువైంది. గత వైసిపి ప్రభుత్వ హయాంలో రెండు సీజన్లకు ఇప్పటి వరకు బీమా క్లెయిములు పరిష్కారం కాలేదు. ఆ రెండు సీజన్లకూ రైతులకు కంపెనీలు చెల్లించాల్సిన బీమా సొమ్ము రూ.1,393.61 కోట్లు కాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి కంపెనీలకు చెల్లించాల్సిన ప్రీమియం వాటా రూ.2,503.80 కోట్లు. రైతులకు కంపెనీలు చెల్లించాల్సినదానికంటే రెట్టింపు అమౌంట్ ప్రభుత్వాలు కంపెనీలకు ప్రీమియంగా చెల్లించాలి. ఇన్సూరెన్స్ కంపెనీలు ఏకంగా రూ.1,200 కోట్ల వరకు అప్పనంగా లాభాలు పోగేసుకుంటున్నాయి.

వైసిపి ప్రభుత్వం వచ్చాక, అప్పటి వరకు అమల్లో ఉన్న కేంద్రం బీమా పథకాలు ఫసల్ బీమా, వాతావరణ ఆధారిత బీమాలను పక్కనపెట్టి స్వంతంగా ఇన్సూరెన్స్ అమలు చేసింది. తదుపరి కేంద్రం ఒత్తిళ్లతో కేంద్ర పథకాల్లో 2022 ఖరీఫ్ నుంచి చేరింది. కేంద్ర పథకాల్లో చేరాక 2022 ఖరీఫ్‌కు సంబంధించి ఫసల్ బీమా క్లెయిములే రైతులకు అందాయి. 2022-23 రబీ, 2023 ఖరీఫ్ క్లెయిములు ఇంకా సెటిల్ చేయలేదు. 2023-24 రబీ క్లెయిములు ఇంకా అంచనాల స్థాయిలోనే ఉన్నాయి.

కాగా గురువారం శాసన మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం ఇచ్చిన సమాధానాన్ని పరిశీలిస్తే కంపెనీల బాగోతం అర్థమవుతుంది. క్లెయిముల లెక్కలు పూర్తయిన 2022-23 రబీకి గాను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన ప్రీమియం వాటా 464.80 కోట్లు. కేంద్రం అంతే మొత్తంలో కంపెనీలకు చెల్లించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ సీజన్‌కు చెల్లించాల్సిన మొత్తం ప్రీమియం 929.60 కోట్లు. సదరు ప్రీమియాన్ని ప్రభుత్వాలు కంపెనీలకు చెల్లించలేదు. ప్రభుత్వాలు ఆ చెల్లింపులు పూర్తి చేస్తే కంపెనీలు 105.80 కోట్లు రైతులకు సెటిల్ చేస్తాయి. అలాగే 2023 ఖరీఫ్‌నకు ఫసల్ బీమా ప్రీమియంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వాటా రూ.1,574.20 కోట్లు. ఆ నిధులు చెల్లించాక బీమా కంపెనీలు రైతులకు 1,287 కోట్లు చెల్లిస్తాయి. ఇదిలా ఉండగా కేంద్ర పథకాల వైపే టిడిపి కూటమి ప్రభుత్వం చూపు ఉంది. కేంద్ర పథకాలే అయితే కంపెనీలే లాభాలు పోగేసుకుంటాయి. ప్రభుత్వ సొమ్ము కంపెనీల జేబుల్లోకి చేరతాయి. రైతులకు పెద్దగా ప్రయోజనం ఉండదు.

ఐసెట్ అడ్మిషన్ల షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఐసెట్ అడ్మిషన్ల షెడ్యూల్‌కు సంబంధించిన నోటిఫికేషన్‌ను ప్రభుత్వం గురువారం విడుదల చేసింది. వెబ్ కౌన్సెలింగ్‌కు ఈ నెల 26 నుంచి ఆగస్టు ఒకటిలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నోటిఫికేషన్‌లో పేర్కొంది. సర్టిఫికెట్ల పరిశీలన జులై 27 నుంచి ఆగస్టు 3 వరకు ఉంటుంది. స్పెషల్ కేటగిరి అభ్యర్థులు వికలాంగులు, సిఏపి, ఎన్‌సిసి, స్పోర్ట్స్, గేమ్స్, ఆంగ్లో ఇండియన్‌లకు చెందిన అభ్యర్థులకు వచ్చేనెల 2వ వరకు రిజిస్ట్రేషన్ అవకాశం ఉంది. ఆగస్టు 8 నుంచి 7వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లకు అనుమతి ఉంటుంది.

ఆగస్టు 8న వెబ్ ఆప్షన్‌న్లు మార్చుకునేందుకు అవకాశం ఉంది. కళాశాలలో సీట్ల కేటాయింపునకు ఆగస్టు 10న మొదటి దశ కౌన్సెలింగ్ ప్రారంభమవుతుంది. అభ్యర్థులు 12వ తేదీ నుంచి 16 వరకు కళాశాలల్లో రిపోర్టింగు చేయాలి. క్లాసులు 12న ప్రారంభమవుతాయి. కళాశాలలో సీట్ల ఖాళీల వివరాలను వచ్చేనెల 17న తెలియజేయాలని ఏపి ఐసెట్ కన్వీనరు పి ఉమామహేశ్వరి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

- ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనరు హరికిరణ్

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

వర్షాకాలంలో సీజనల్, అంటువ్యాధులు ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనరు సి హరికిరణ్ పేర్కొన్నారు. మంగళగిరిలోని వైద్యారోగ్యశాఖ ప్రధాన కార్యాలయంలో సంబంధిత అధికారులతో గురువారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా హరికిరణ్ మాట్లాడుతూ.. వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు, అప్రమత్తం చేసేందుకు మొబైల్ ఫోన్‌లకు మెసేజ్‌లు పంపాలన్నారు. ప్రసార సాధనాల్లోనూ పెద్ద ప్రచారం చేయాలన్నారు.

మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, ప్రబలే అవకాశం ఉన్న ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డయేరియా విషయంలో 24 గంటలూ పర్యవేక్షణ ఉండాలన్నారు. ఈ సమీక్షలో డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రాం ఎడి సుబ్రహ్మణ్వేశ్వరి, జెడి మల్లేశ్వరి, ఎన్‌విబిడిసి ప్రోగ్రాం డిడి రామనాథరావు, స్టేట్ కన్సల్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసుల ఎత్తివేతపై త్వరలో నిర్ణయం

- నిర్బంధం తొలగింపుపై హోంమంత్రి సమాధానం దాటవేత

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 2019-24 మధ్య కాలంలో నమోదైన అక్రమ కేసులను ఎత్తివేసే అంశంపై ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకుంటుందని హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. 2019-24 మధ్యలో ఉత్పన్నమైన శాంతిభద్రతల అంశంపై శాసనమండలిలో ఆమె ఒక ప్రకటన చేశారు. పిడిఎఫ్ సభ్యులు ఐ వెంకటేశ్వరరావు అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానం ఇస్తూ.. ఉపాధ్యాయులు చేపట్టిన ర్యాలీ సందర్భంగా నమోదైన కేసులను ఎత్తివేసే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. అలాగే పలు ఉద్యమాల్లో జరిగిన నిర్బంధం, అక్రమ కేసులపై కూడా పరిశీలన, అధ్యయనం జరుగుతోందని, త్వరలో ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుంటుందని ఆమె తెలిపారు. 2019 నుంచి 2024 వరకు వైసిపి ప్రభుత్వం టిడిపి, జనసేన, బిజెపి తదితర పార్టీల నాయకులపై అనేక అక్రమ కేసులు బనాయించిందన్నారు. వీటిని రద్దు చేయడానికి ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. ఈ సందర్భంగా పిడిఎఫ్ సభ్యులు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై పోరాడుతున్న అనేక మందిని గత ప్రభుత్వం అక్రమంగా నిర్బంధించిందని, జిఓ ఒకటి ద్వారా ఉద్యమాలను ఉక్కుపాదంతో అణచివేసిందని అన్నారు. వామపక్షాలు, ప్రజా సంఘాలు ర్యాలీలపై నిర్బంధం అమలు చేసిందన్నారు. ఈ అంశాలను హోంమంత్రి తన ప్రకటనలో ప్రస్తావించలేదన్నారు. అలాగే ఉద్యమాలను అణచి వేసి ముందస్తు అరెస్టుల పేరుతో వేధించిందన్నారు. రాష్ట్ర, జిల్లా మండల స్థాయి ఆందోళన చేస్తున్న వారిపై నిర్బంధాన్ని ప్రయోగించిందన్నారు. గత ప్రభుత్వం ప్రజా ఉద్యమాలపై అమలు చేసిన నిర్బంధం తొలగిస్తారా లేదా అన్న ప్రశ్నకు మంత్రి సమాధానం దాటవేశారు. జిఓ నెంబరు ఒకటిని తాము వ్యతిరేకించామని మంత్రి అనిత పేర్కొన్నారు. రౌడీయిజాన్ని అణచివేస్తామన్నారు. గత ప్రభుత్వ హయంలో నిలిచిపోయిన గ్రే హౌండ్స్, ఆక్టోపస్ విభాగాల వ్యవస్థలను ఏర్పాటు చేస్తామన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ వంటి నాయకులను ప్రజల్లోకి వెళ్లకుండా వైసిపి ప్రభుత్వం అడ్డుకుందన్నారు. ఇవిఎంను పగలగొట్టిన మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని జగన్ జైలులో పరామర్శించి వచ్చారని, వినుకొండలో వైసిపి రౌడీషీటర్ చేతిలో హత్యకు గురైన వైసిపి కార్యకర్త రషీద్ కుటుంబాన్ని కూడా జగన్ ఇటీవల పరామర్శించి వచ్చారని తెలిపారు. ఇందుకు తాము ఎటువంటి అభ్యంతరమూ చెప్పలేదన్నారు. చంద్రబాబు నాయుడు పుంగనూరు, పల్నాడు జిల్లాల పర్యటనను జగన్ ప్రభుత్వం అడ్డుకుందన్నారు.

వైసిపి ప్రభుత్వ హయాంలో ఐపిఎస్ అధికారి ఎబి వెంకటేశ్వరరావును ఐదేళ్లపాటు సస్పెండ్ చేసి తీవ్రంగా వేధించిందన్నారు. మాస్క్ అడిగిన డాక్టర్ సుధాకర్‌ను, ఎన్‌జిఒ నాయకుడు సూర్యనారాయణను, సొంత చెల్లి షర్మిలను కూడా జగన్ ప్రభుత్వం వేధించిందన్నారు. సోషల్ మీడియాలో పోస్టింగులు పెట్టిన అనేక మందిని వేధించారని గుర్తు చేశారన్నారు. వైసిపి నాయకులు చెప్పిందే చట్టంగా అప్పట్లో పాలన నడిచిందన్నారు. ఇప్పుడు తాము చట్టబద్ధమైన పాలన అందిస్తామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తామని, మహిళలకు, బాలికలకు, వృద్ధులకు రక్షణ కల్పిస్తామని అన్నారు.

రెవిన్యూ రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలి

- ఆర్ పి సిసోడియా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

తమ పరిధిలోని రెవెన్యూ రికార్డులను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ) ఆర్ పి.సిసోడియా సూచించారు. అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లు శ్రీధర్ చామకూరి, సుమిత్ కుమార్, డాక్టర్ వెంకటేశ్వర్‌లతో కలిసి గురువారం మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ అంశాలపై మూడు జిల్లాల ఆర్‌డిఒలు, తహశీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిసోడియా మాట్లాడుతూ.. రెవెన్యూ అధికారులు తమ పరిధిలోని ప్రతి సబ్జెక్టుపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజాస్వామ్యంలో రెవెన్యూ శాఖ అత్యంత కీలకమైందన్నారు. 20ఏళ్ల అనుభవం పూర్తి కాకముందే డి.పట్టా ఇవ్వకూడదని, ఇలాంటి కేసులు ఏమైనా ఉన్నట్లయితే సర్వే చేయించాలన్నారు. ప్రతి చిన్న విషయాన్ని జాగ్రత్తగా పరిశీలించి సమస్యను పరిష్కరించాలని సూచించారు. అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ..రెవెన్యూ శాఖ అత్యంత కీలకమైందన్నారు. ఈ సందర్భంగా గతంలో జరిగిన ఇనాం భూముల రిజిస్ట్రేషన్లు, 22(ఎ) భూ సమస్యలు, 2020-23 సంవత్సరంలో జరిగిన పట్టా భూముల వివరాలు, వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములకు కన్వర్షన్ చేయుట, చుక్కల భూముల సమస్యలు, అసైన్‌మెంట్ భూముల వివరాలు, తదితర అంశాలపై డివిజన్ల వారీగా ఆర్‌డిఒలు, తహశీల్దార్‌లతో చర్చించారు. కార్యక్రమంలో అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, జిల్లాల ఆర్‌డిఒలు, తహశీల్దారులు, ఆర్‌ఐలు, సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై వినతుల స్వీకరణ

భూ సమస్యలకు సంబంధించిన అర్జీలను ప్రజల నుంచి సిసోడియా, అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌లు స్వీకరించారు. గత మూడేళ్ల కాలంలో భూ సమస్యలపై ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులు, భూములు కోల్పోయిన వారు, మరే ఇతర కారణాల వల్ల భూ వివాదాల్లో ఇబ్బందులు పడుతున్న వారు తమ అర్జీలను సమర్పించాల్సిందిగా రెవెన్యూ శాఖ కోరింది. ఈ మేరకు వందల మంది బాధితులు మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయానికి పోటెత్తారు. తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ సిసోడియా ఆదేశాలు జారీ చేశారు. వైసిపి బాధితులే ఎక్కువ అర్జీలు ఇచ్చినట్లు సమాచారం.

ఘటనపై సమీక్షించిన సిఐడి చీఫ్

ఫైల్స్ దగ్ధం కేసులో దర్యాప్తు వేగవంతంగా జరుగుతోందని ఎపి సిఐడి చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ తెలిపారు. మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయ్యాన్ని ఆయన పరిశీలించారు. కేసు పురోగతిపై సమీక్షించారు.

హౌసింగ్ ఎమ్‌డిగా రాజబాబు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎమ్‌డిగా పి రాజబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. స్కిల్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ ఎమ్‌డిగా పనిచేస్తున్న రాజబాబును ప్రభుత్వం హౌసింగ్ కార్పొరేషన్‌కు బదిలీ చేసిన సంగతి తెలిసిందే. బాధ్యతలు స్వీకరించిన అనంతరం గృహ నిర్మాణ సంస్థ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్‌ను కలిశారు. అనంతరం అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.

సిపిఎం సీనియర్ నాయకులు నాగిరెడ్డి మృతి

- రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు సంతాపం



నాగిరెడ్డి (ఫైల్)

ప్రజాశక్తి - కొల్లిపర(గుంటూరు జిల్లా)

సిపిఎం సీనియర్ నాయకులు గుదిబండి నాగిరెడ్డి (86) మృతి చెందారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం రాత్రి గుంటూరు జిల్లా కొల్లిపరలోని స్వగృహంలో కన్నుమూశారు. ముగ్గురు కుమారులున్నారు. శుక్రవారం కొల్లిపరలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.నాగిరెడ్డి భూస్వామ్య కుటుంబంలో జన్మించినప్పటికీ పేదల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారు. 1978లో జనతాపార్టీ మద్దతుతో సిపిఎం అభ్యర్థిగా దుగ్గిరాల నియోజకవర్గం నుంచి పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోయారు. 1987లో రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన వ్యవసాయ కార్మికుల కూలీ పెంపు ఉద్యమాన్ని కొల్లిపరలో నిర్వహించారు. ఆయన మృతి పట్ల సిపిఎం రాష్ట్ర కమిటీ తరపున కార్యదర్శి వి. శ్రీనివాసరావు సంతాపం తెలిపారు. వ్యవసాయ కార్మికులు, పేదల పక్షాన నిలిచిన మంచి నాయకుడు నాగిరెడ్డి అని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ముందస్తు బెయిల్ ఇవ్వండి

- హైకోర్టులో వాసుదేవరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి

గుడివాడ పోలీసులు ఈ నెల 5న పెట్టిన కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ మాజీ ఎమ్‌డి డి వాసుదేవరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. కౌంటర్ దాఖలు చేయాలని జస్టిస్ టి మల్లికార్జునరావు గురువారం ఆదేశించారు. ఎపిఎస్‌బిసిఎల్ లిక్కర్ గోడౌన్ లీజు గడువు ముగియక ముందే తమను బెదిరించి బలవంతంగా ఖాళీ చేయించారంటూ దుగ్గిరాల ప్రభాకర్ అనే వ్యక్తి చేసిన ఫిర్యాదు ఆధారంగా గుడివాడ పోలీసులు వాసుదేవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని ఇతరులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని రెడ్డి వేసిన పిటిషన్‌పై విచారణ వచ్చే వారానికి వాయిదా పడింది.

జగన్ వల్లే రాష్ట్రం అధోగతి

- టిడిపి ఎంపిలు అప్పలనాయుడు, లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన వల్లే రాష్ట్రం అధోగతి పాలైందని టిడిపి ఎంపిలు అప్పలనాయుడు, లక్ష్మీనారాయణ విమర్శించారు. గురువారం నాడిక్కడ టిడిపి ఎంపిలు మీడియాతో మాట్లాడారు. గత ఐదేళ్ల పాలనలో టిడిపి కార్యకర్తలను వేధించి, కేసులు పెట్టి హింసించారని అన్నారు. రఘురామ కృష్ణరాజు సొంత నియోజకవర్గానికి వెళ్లలేకపోతే ఎందుకు జగన్‌ను అఖిలేష్ యాదవ్, మారెన్ ప్రశ్నించలేకపోయారని విమర్శించారు. చంద్రబాబుకు అఖిలేష్ యాదవ్, మారెన్ మద్దతు తెలపాలన్నారు. బడ్జెట్‌లో కేంద్రం అమరావతికి రూ.15 వేల కోట్లు ప్రకటిస్తే ప్రతిపక్ష నేత కనీసం స్పందించలేదని విమర్శించారు. ఢిల్లీలో ఆందోళన చేయడం బాధాకరమని అన్నారు. పెట్టుబడులు పెట్టేందుకు అనేక మంది ముందుకు వస్తుంటే, జగన్ వాటిని అడ్డుకునేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

సిఎం ప్రకటన హర్షణీయం

- ఎపిసిపిఎస్ఇఎ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉద్యోగులు, ఉపాధ్యాయులపై గత ప్రభుత్వం అక్రమంగా బనాయించిన కేసులు రద్దు చేయడం గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించడంపై ఎపి కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఎపిసిపిఎస్ఇఎ) హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు అసోసియేషన్ నేతలు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2019-22 మధ్య మధ్య రాజ్యాంగబద్ధ హక్కుల సాధన కోసం ప్రభుత్వ తీరును ప్రశ్నించిన ఉద్యోగ, ఉపాధ్యాయులపై గత ప్రభుత్వం కుట్రపూరితంగా నాలుగు వేల కేసులను నమోదు చేసిందని తెలిపారు. ఎపిసిపిఎస్ఇఎ నాయకులు, కార్యకర్తలపై 1,600 అక్రమ కేసులు పెట్టారని గుర్తు చేశారు. వీటి నుంచి విముక్తి కల్పించాలని తమ అసోసియేషన్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, హోంమంత్రి వంగలపూడి అనితకు గతంలో విన్నవించిందని, ప్రభుత్వం త్వరలో కేసుల రద్దుపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రకటన విడుదల చేసిన వారిలో ఎపిసిపిఎస్ఇఎ ప్రెసిడెంట్ కోరుకొండ సతీష్, జనరల్ సెక్రటరీ చింతగుంట్ల మరియదాసు, ఫైనాన్స్ సెక్రటరీ బత్తిన ప్రసాద్, అసోసియేట్ ప్రెసిడెంట్ గుత్తా ప్రేమనాథ్‌రెడ్డి, అడిషనల్ జనరల్ సెక్రటరీ గురన శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

రాష్ట్ర అప్పు పది లక్షల కోట్లు

- నేడు సభలో ఆర్థిక శ్వేతపత్రం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర అప్పు దాదాపుగా పది లక్షల కోట్ల రూపాయలకు చేరింది. ఆర్థికశాఖ అధికారులు రూపొందించిన శ్వేతపత్రంలో ఈ విషయాన్ని పొందుపరిచారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం శాసనసభలో శ్వేతపత్రాన్ని ప్రవేశపెట్టనున్నారు. శ్వేతపత్రంలోని వివరాల మేరకు రాష్ట్ర అప్పు 9,82,498 రూపాయలు ఉన్నట్లు తేలింది .ప్రధానంగా భారీగా అప్పులు చేసినా, వాటిని ఎక్కడ ఖర్చు చేసారన్నది ఇందులో ప్రశ్నించనున్నట్లు తెలిసింది. ప్రస్తుతం 9,82,498 కోట్లు అప్పుగా ఉన్నట్లు తేల్చారు. 2019 మార్చి నాటికి 3.75 లక్షల కోట్ల వరకు రుణం ఉండగా, ఇప్పుడు ఆ రుణం 9.82 లక్షల కోట్లు దాటిపోయిందని శ్వేతపత్రంలో పేర్కొన్నట్లు తెలిసింది. ఇందులో కార్పొరేషన్ల ద్వారా చేసిన అప్పులే 2.48 లక్షల కోట్లు ఉన్నట్లు తేల్చారు. 2014 నుంచి 2019 మధ్య కాలంలో జరిగిన అభివృద్ధి, ఆ తరువాత 2019 నుంచి 2024 మధ్యలో నెలకొన్న సంక్షోభం వంటివి శ్వేతపత్రంలో ప్రస్తావించనున్నారు. పలు రంగాలకు చెల్లించాల్సిన బకాయిలు 1.20 లక్షల కోట్లు ఉన్నాయని కూడా అందులో పేర్కొన్నారు. అయితే ఈ నివేదికలో పలు ప్రభుత్వ పథకాల కోసం రిజర్వ్‌బ్యాంకు, జైకా, ఆసియన్ డెవలప్‌మెంట్



బ్యాంకు, హడ్కో, నబార్డ్ వంటి సంస్థల నుంచి తీసుకున్న రుణాలు ఎంత అన్నది పేర్కొనలేదని, ఇది కూడా కలుపుకొంటే మొత్తం రుణం 13 నుంచి 14 లక్షల కోట్ల వరకు చేరుకుంటుందని అధికారులు అంటున్నారు.

సంపద సృష్టిలో నిర్లక్ష్యంపైనా

ఆదాయాన్ని సృష్టించే పథకాలు, నిర్మాణాలపైనా గత ప్రభుత్వం వహించిన నిర్లక్ష్యాన్ని శ్వేతపత్రంలో వివరించనున్నారు. ప్రధానంగా పెట్టుబడి వ్యయం కింద వచ్చే రోడ్లు, నీటిపారుదల, విద్యుత్, పారిశ్రామిక రంగం, ఇతర మౌళికాభివృద్ధి కార్యక్రమాలపై కనిపించిన నిర్లక్ష్యాన్ని ఈ నివేదికలో విశ్లేషించినట్లు తెలిసింది. నీటిపారుదల పథకాలు, అమరావతి రాజధాని నిర్మాణం పూర్తయితే ఎంతో ఆదాయం వచ్చేదని ఆర్థికశాఖ తాజాగా విశ్లేషించింది.

జిడిపి అంచనాలపై

రెండు ప్రభుత్వాల హయాంలో జిడిపి వృద్ధి ఎలా ఉందన్నదానిపైనా శ్వేతపత్రంలో పొందుపరిచినట్లు తెలిసింది. జాతీయ వృద్ధి, రాష్ట్రంలో రెండు ప్రభుత్వాల్లో నెలకొన్న రాష్ట్ర వృద్ధిని క్రోడీకరించి నివేదికలో ప్రస్తావించినట్లు తెలిసింది. పేదలకు అందించిన సంక్షేమ కార్యక్రమాల వివరాలను కూడా పేర్కొన్నారు. కాగా పలు రంగాలకు చెల్లింపుల లేకపోవడం వల్ల న్యాయస్థానాల్లో పెరుగుతున్న కేసులు, న్యాయస్థానాలు తీర్పులు ఇచ్చినా వాటిని గత ప్రభుత్వం ఉల్లంఘించడం ద్వారా దాఖలైన ఇతర కేసుల వివరాలు కూడా శ్వేతపత్రంలో పొందుపరిచినట్లు సమాచారం.

నేడు ఢిల్లీకి చంద్రబాబు

ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రాన్ని ప్రకటించిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు సాయంత్రం ఢిల్లీకి వెళ్లనున్నారు. అక్కడ జరిగే నీతీఅయోగ్ సమావేశంలో పాల్గొనడంతోపాటు రాష్ట్రానికి రావాల్సిన నిధులపై పలువురు మంత్రులతో భేటీ కానున్నారు. ఇందులో భాగంగానే ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పియూష్‌కుమార్, ఇతర అధికారులు ఇప్పటికే ఢిల్లీకి చేరుకున్నారు.



పోర్టు కార్మికుల దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న జగ్గునాయుడు

పోర్టుల ప్రయివేటీకరణ ఆపాలని దీక్ష

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

పోర్టుల ప్రయివేటీకరణ ఆపాలని, కార్మికులకు షరతులు లేని వేతన ఒప్పందం చేయాలని, నాన్ పర్మినెంట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ విశాఖలోని పోర్టు సి హార్స్ జంక్షన్ వద్ద కార్మికులు తలపెట్టిన రెండు రోజుల దీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. దీక్షల్లో కూర్చున్న వారికి విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చైర్మన్ ఎం.జగ్గునాయుడు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, పోర్టు యూనియన్ గౌరవ అధ్యక్షులు విఎస్.పద్మనాభరాజు దండలు వేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మేజర్ పోర్టులను ల్యాండ్ లార్డ్ పోర్టులుగా మార్చడానికి, మరింతగా దేశ, విదేశీ ప్రయివేట్ కంపెనీలను ఆకర్షించడానికి షిప్పింగ్ మినిస్ట్రీ మోడల్ కన్సెషన్ అగ్రిమెంట్‌లో చాలా మార్పులు చేసిందన్నారు. 2030 నాటికి 80 శాతం మేజర్ పోర్టులను ల్యాండ్‌లార్డ్ పోర్టులుగా మార్చే లక్ష్యాన్ని పెట్టుకున్నారని, అందులో విశాఖ పోర్టు కూడా ఉందని వివరించారు. ఇప్పటికే జెఎన్‌పిటిని వంద శాతం ల్యాండ్‌లార్డ్ పోర్టుగా మార్చేశారన్నారు. పోర్టు సెక్టార్‌ను పూర్తిగా ప్రయివేటుకు అప్పజెప్పడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రపన్నుతోందని విమర్శించారు. విశాఖ పోర్టులో ఐదు బెర్తులను ఇప్పటికే ప్రయివేటు వారికి ఇచ్చారని, మిగిలిన వాటినీ అప్పగించేందుకు సన్నాహాలు చేస్తున్నారని తెలిపారు. 2017లో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పోర్టు పూల్ కళాసీలను పర్మినెంట్ చేయాలని, ఖాళీ పోస్టుల్లో వారిని భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. సిహెచ్‌డి క్యాజువల్ కార్మికులను పర్మినెంట్ చేసి, అగ్రిమెంట్ ప్రకారం వేతనం పెంచాలన్నారు. ఎపి హైకోర్టు తీర్పును అనుసరించి పోర్టు యాజమాన్యం సిహెచ్‌డి ఆఫీస్ సైడ్ క్యాజువల్స్‌ను తక్షణం రెగ్యులర్ చేయాలని, సిహెచ్‌డి షోర్ లేబర్‌కు చట్ట ప్రకారం అన్ని హక్కులు కల్పించాలని అన్నారు. అన్ని రకాల స్టీవ్ డోర్ కార్మికులకు చట్ట ప్రకారం న్యాయం చేయాలని కోరారు. పోర్టులోని కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వాటర్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) జాతీయ కార్యదర్శి బి.జగన్, యూనియన్ నాయకులు సాంబమూర్తి, కె.సత్యనారాయణ, విడిఎల్‌బి యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జక్కాన సత్యనారాయణ, బి.లక్ష్మణరావు, నాయకులు రామలింగేశ్వరరావు, త్రినాథరావు పాల్గొన్నారు.



చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న సాహితీవేత్తలు, కవులు

యువతరానికి 'అడిగోపుల' రచనలు, ఆశయాలు స్ఫూర్తి

- సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

నేటి యువతరానికి అడిగోపుల వెంకటరత్నం రచనలు, ఆశయాలు స్ఫూర్తినిస్తాయని సాహితీవేత్తలు, కవులు తెలిపారు. మంచి సుగుణాలు గల వ్యక్తి, ఆయన నిబద్ధతకు నిలువెత్తు సంతకమని కొనియాడారు. తిరుపతి జిల్లా యశోద నగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ప్రముఖ కవి, సాహితీవేత్త అడిగోపుల వెంకటరత్నం సంస్మరణ సభను గురువారం తిరుపతి సాహితీ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆ కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగర్జున అధ్యక్షతన జరిగిన సభలో వెంకటరత్నం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ అడిగోపులు మంచి విద్యావేత్త, సాహితీవేత్త, ఉన్నత వ్యక్తిత్వం కలవారని కొనియాడారు. సభ్యత, సంస్కారం, నిరాడంబరత్వం వంటి అనేక మంచి సుగుణాలు కలవారని కొనియాడారు. తన చివరి రచన అయిన నిలువెత్తు సంతకం చేసి నిష్క్రమించడం బాధాకరమన్నారు. ఆయన సాహిత్యంలో బుద్ధుడి బోధనలు, అంబేద్కర్ ఆశయాలు, మార్క్స్ సిద్ధాంతాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తాయన్నారు. వెంకటరత్నం ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో డాక్టర్ వి ఆర్ రాసాని, మల్లేశ్వరరావు, రమేష్ బాబు, యువ శ్రీ మురళి, ఓ వెంకటరమణ, భూమన, సాకం నాగరాజు, అడిగోపుల శ్రీకాంత్, అమరేంద్ర, గంగాధర్ రావు, దామోదరం పాల్గొన్నారు.

రాత్రిపూట విధుల్లోంచి మినహాయించాలి

- ఎపి విఆర్‌ఎల సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విఆర్‌ఎలకు అదనపు పనిభారం పెరిగేలా రాత్రిపూట విధులు వేస్తూ సిసిఎల్‌ఎ విడుదల చేసిన ఉత్తర్వులను తక్షణం ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం డిమాండ్ చేసింది. మండల కార్యాలయాల్లో వాచ్‌మెన్, అటెండర్ ఖాళీలను భర్తీ చేయకుండా విఆర్‌ఎల జాబ్ చార్ట్‌కు విరుద్ధంగా రాత్రుళ్లు వేయడం తగదని పేర్కొంది. ఈ మేరకు గురువారం ఎపి విఆర్‌ఎల సంఘం రాష్ట్ర అధ్యక్షులు టి అంజి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంటు షేక్ బందగీ సాహెబ్ ఒక ప్రకటన విడుదల చేశారు. సిసిఎల్‌ఎ కార్యాలయం నుంచి ఈ నెల 21న అత్యవసర సర్క్యులర్ పేరుతో విఆర్‌ఎలను రాత్రుళ్లు విధులకు పురమాయిస్తూ అత్యవసరం పేరిట సర్క్యులర్ విడుదల చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో విఆర్‌ఎల సంఘం.. చాలా కాలం నుండి అర్హులైన విఆర్‌ఎలకు వాచ్‌మెన్‌లుగా, అటెండర్‌లుగా, రికార్డు అసిస్టెంట్, విఆర్‌ఒ పోస్టులకు ఉద్యోగోన్నతులను కల్పించాలని దశాబ్దాలుగా కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు ఇలా విఆర్‌ఎలు రాత్రుళ్ల విధుల్లో ఉండాలని ఆదేశించడం సరైంది కాదన్నారు. దీనికి సంబంధించిన సర్క్యులర్‌ను తక్షణం ఉపసంహరించుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని తెలిపారు.

పొగాకు అదనపు పంటపై పెనాల్టీ రద్దు




పొగాకు బోర్డు ఛైర్మన్ యశ్వంత్‌కుమార్

ప్రజాశక్తి-గుంటూరు

2023 డిసెంబర్‌లో సంభవించిన మిచౌంగ్ తుపాను వల్ల దెబ్బతిన్న పొగాకు రైతులను ఆదుకునేందుకు అదనపు పంటకు విధించే పెనాల్టీని రద్దు చేస్తున్నట్లు పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ తెలిపారు. బోర్డులో నమోదు అయిన రైతులకు మాత్రమే ఈ వెసులుబాటు వర్తిస్తుందని, అనధికారిక రైతులకు వర్తించదని స్పష్టం చేశారు. గుంటూరులోని పొగాకు బోర్డు కేంద్ర కార్యాలయంలో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎ.శ్రీధర్‌బాబుతో కలిసి ఆయన గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ ఏడాది 142 మిలియన్ కిలోల పొగాకు పంటకు అనుమతి ఇవ్వగా.. అంతర్జాతీయ మార్కెట్‌లో ఉన్న డిమాండ్ దృష్ట్యా దాదాపు 205 మిలియన్ కిలోలు పండించారన్నారు. మిచౌంగ్ తుపాను వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవటానికి నిర్దేశించిన పంట కంటే అదనంగా పండించిన పంటపై టుబాకో బోర్డు విధించే పెనాల్టీని పూర్తిగా రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని, అందుకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ సానుకూలంగా స్పందిస్తూ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. అందుకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదల చేశారని చెప్పారు. దీని వల్ల సుమారు 34,089 రైతులకు రూ.111.65 కోట్లు రైతులకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు.

కెనరా బ్యాంక్‌కు రూ.3,905 కోట్ల లాభాలు

బెంగళూరు : ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు సాధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 10.5 శాతం వృద్ధితో రూ.3,905 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. నికర వడ్డీ ఆదాయాలతో పాటు వడ్డీయేతర ఆదాయాలు, రికవరీలు పెరగడంతో మెరుగైన ఫలితాలు నమోదు చేసినట్లు ఆ బ్యాంక్ తెలిపింది. 2023-24 ఇదే క్యూ4లో రూ.3,539 కోట్ల లాభాలు ఆర్జించింది. ఇదే సమయంలో రూ.8,666 కోట్లుగా ఉన్న బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) గడిచిన క్యూ4లో 5.77 శాతం పెరిగి రూ.9,166 కోట్లకు చేరింది. వడ్డీయేతర ఆదాయం ఏకంగా 10.38 శాతం వృద్ధితో రూ.5,319 కోట్లుగా నమోదయ్యాయి. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 5.15 శాతం నుంచి 4.14 శాతానికి తగ్గాయి. 2023 జూన్ ముగింపు నాటికి 1.57 శాతంగా ఉన్న నికర నిరర్థక ఆస్తులు.. 2024 జూన్ నాటికి 1.24 శాతానికి పరిమితమయ్యాయి.



టెక్ మహీంద్రా లాభాల్లో 23% వృద్ధి

ముంబయి : దేశంలోనే ఐదో అతిపెద్ద ఐటి సేవల కంపెనీ టెక్ మహీంద్రా 2024-25 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 23 శాతం వృద్ధితో రూ.851.5 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.692.5 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.13,159 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన క్యూ1లో 1.2 శాతం పెరిగి రూ.13,006 కోట్లకు చేరింది. గడిచిన త్రైమాసికంలో నికరంగా 2,165 ఉద్యోగులను చేర్చుకోవడంతో మొత్తం సిబ్బంది సంఖ్య 1,47,620కి చేరిందని ఆ సంస్థ తెలిపింది.


సంపాదకీయం

యుద్ధ నేరస్తుడా వెనక్కిపో!

యుద్ధ నేరస్తుడా వెనక్కిపో! నినాదాలు అగ్ర రాజ్యంలో మిన్నంటుతున్నాయి. ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు పాలస్తీనాలో రక్తపుటేర్లు పారిస్తుండటంపై సర్వత్రా ఆగ్రహం పెల్లుబుకుతోంది. 'నాట్ ఇన్ మై నేమ్' అన్న సందేశంతో కూడిన ఎరుపు టీషర్టులు ధరించిన యూదు నిరసనకారులు 'జ్యూయిష్ వాయిస్ ఫర్ పీస్' పేరిట అమెరికాలోని కేపిటల్స్ హిల్ ఎదుట భారీ ఎత్తున సాగుతున్న ఆందోళన రక్తపిపాసి నెతన్యాహుకి చెంపపెట్టు లాంటిది. యూదులకు సొంత దేశం అంటూ ఇజ్రాయిల్ గాజాలో సాగిస్తున్న మారణకాండతో తమకు సంబంధం లేదని తేల్చిచెబుతున్నారు. ఇజ్రాయిలీలు చెల్లిస్తున్న పన్నులను వృథా చేయొద్దంటూ మండిపడుతున్నారు. పెప్పర్ స్ప్రే ప్రయోగించినా, అరెస్టులు చేసినా తగ్గేది లేదంటూ హెచ్చరిస్తున్నారు. అమెరికన్ కాంగ్రెస్‌లో గతంలో ఎన్నడూ లేనివిధంగా స్వతంత్ర సెనెటర్ బెర్నీ శాండర్స్‌సహా 50 మందికి పైగా డెమొక్రాట్ సెనెటర్లు నెతన్యాహు ప్రసంగాన్ని బహిష్కరించారు. పాలస్తీనా, అమెరికా మూలాలున్న మిచిగాన్‌కు చెందిన డెమొక్రటిక్ సెనెటర్ రషీదా త్లైబ్ హౌస్ ఛాంబర్‌లోనే 'యుద్ధ నేరస్తుడు' అంటూ ప్లకార్డు ప్రదర్శించారు. యుద్ధ లక్ష్యాలు సాధించే వరకూ యుద్ధం కొనసాగుతుందని ఇజ్రాయిల్ ప్రధాని హూంకరించారు. దాదాపు 40 వేల మందిని, అందులోనూ అత్యధికంగా చిన్నారులను, మహిళలను బలి తీసుకున్నాడు. దాదాపు 90 వేల మందిని తీవ్ర గాయాలపాలు చేశాడు. గాజాలో నివసిస్తున్న దాదాపు 23 లక్షల మందిని నిర్వాసితులుగా మార్చేశాడు. అత్యంత పాశవికంగా పాఠశాలలు, ఆసుపత్రులు, శరణార్థి శిబిరాలపై దాడులకు ఒడిగడుతూ...రోజుకు సగటున 250 మందిని పొట్టన పెట్టుకుంటున్నారు. ప్రపంచ దేశాల నుంచి వస్తున్న సహాయాన్ని సైతం గత కొన్ని వారాలుగా సరిహద్దుల్లో నిలిపివేసి, చిన్నారులను సైతం ఆకలితో మాడ్చి చంపుతున్నాడు. ప్రాణాంతకమైన గాయాలతో, గుండె జబ్బులతో, ఆకలితో ఉన్న చిన్నారులకు మందులు, తగిన ఆహారం సైతం అందకుండా క్రూరంగా వ్యవహరిస్తున్నారు. ఈ దారుణ పరిస్థితుల్లో పలువురు చిన్నారులు పోలియోకు గురవుతున్నారు. ఈ నరమేధాన్ని ఇజ్రాయిలీలు సైతం ఈసడించుకుంటున్నారు.

ఇంతమందిని పొట్టన పెట్టుకున్న నెతన్యాహూ... యుద్ధ లక్ష్యాలుగా ప్రకటించిన వాటిలో దేనినైనా సాధించాడా? అంటే అదీ లేదు. హమాస్‌ను అంతం చేస్తానన్నాడు. అది అయ్యే పని కాదని సాక్షాత్తు ఇజ్రాయిల్ రక్షణ రంగ అధికార ప్రతినిధి డేనియల్ అఘారినే ఇటీవల స్వయంగా అంగీకరించాల్సి వచ్చింది. స్వతంత్ర పాలస్తీనా కాంక్ష, హమాస్ లక్ష్యాలపై ఆరాధనా భావం గాజాలోని అత్యధికుల్లో నేటికీ సజీవంగానే ఉంది. నేటికీ అక్కడి పాలన హమాస్ చేతుల్లోనే ఉంది. ఇక రెండో లక్ష్యమైన బందీలుగా ఉన్న 240 మందిని విడిపిస్తామని. నేటికీ అత్యధికులు హమాస్ చెరలోనే ఉన్నారు. ఇక మూడో లక్ష్యం హమాస్‌కు సహకరిస్తున్న వారి అంతు చూస్తామని. లెబనాన్ నుంచి హిజ్బుల్లా దాడులు నేటికీ కొనసాగుతుండటంతో ఇజ్రాయిల్ ఉత్తర సరిహద్దుల నుంచి దాదాపు 60 వేల మంది వలస పోయారు. నేటికీ దాడులు జరుగుతుండటంతో వారు అక్కడికి రాలేని పరిస్థితిలో ఉన్నారు. అంతర్జాతీయంగానూ ఇజ్రాయిల్, దానితో అంటకాగుతున్న అమెరికా రోజురోజుకూ ఏకాకిగా మారుతున్నాయి. ఐక్యరాజ్య సమితి, అంతర్జాతీయ న్యాయస్థానం, అంతర్జాతీయ నేర విచారణ న్యాయస్థానం (ఐసిసి) ఇజ్రాయిల్ తక్షణమే కాల్పుల విరమణ పాటించాలని డిమాండ్ చేస్తున్నాయి. యుద్ధనేరస్తులుగా నెతన్యాహు, రక్షణమంత్రి గాలంట్‌లను, ముగ్గురు హమాస్ నాయకులను విచారించాలని ఐసిసితో ప్రాసిక్యూషన్ వాదనలు వినిపించింది. ఆగని ఘోరాలపై పశ్చిమ దేశాల వైఖరిలోనూ మార్పు కనిపిస్తోంది. నార్వే, ఐర్లాండ్, స్పెయిన్ పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించాలని నిర్ణయించాయి. ఇజ్రాయిల్‌కు ఆయుధ సరఫరా అనుమతించకూడదని బెల్జియం, స్పెయిన్ నిర్ణయించాయి. యుఎఇ, సౌదీ అరేబియా తదితర దేశాలతో సంబంధాలు పెట్టుకునేందుకు ఇజ్రాయిల్ చేసిన ఎత్తులు చిత్తయ్యాయి. 1967 సరిహద్దులతో తూర్పు జెరూసలేం రాజధానిగా స్వతంత్ర పాలస్తీనా ఏర్పడితేనే ఇజ్రాయిల్‌తో సంబంధాలు పెట్టుకుంటామని అరబ్ దేశాలు తేల్చిచెబుతున్నాయి. దక్షిణాఫ్రికా, మరికొన్ని వర్తమాన దేశాలు పాలస్తీనాకు న్యాయం చేయాలంటూ పోరాడుతున్నాయి. వాటితో ఇండియా కూడా గొంతు కలపాలి. నెతన్యాహు ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని దురాక్రమణపూరిత దాడులను విరమించాలి.

మంచి మాట



మతాన్ని, రాజకీయాన్ని దేనికదిగా వేరువేరుగా వుంచాలి. మతాన్ని రాజకీయాల్లోకి, పబ్లిక్ లోకి తీసుకురాకూడదు. దాన్ని వ్యక్తి ప్రయివేటు వ్యవహారంగానే చూడాలి.

- గాంధీజీ

విశ్లేషణ

చిరుద్యోగులపై బ్రహ్మాస్త్రమా!

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. కొత్తగా వచ్చిన ఏ ప్రభుత్వమైనా కొత్త ఒక వింత, పాత ఒక రోత అన్నట్లుగా ప్రచారం చేసుకుంటున్నాయి. తెలుగుదేశం నాయకత్వంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం కూడా ఇదే పద్ధతిని శ్వేతపత్రాల రూపంలో చెప్పుకుంటున్నది. అంతవరకే అయితే అభ్యంతరం లేదు. అలా కాకుండా గత ప్రభుత్వంలో నియమితులయ్యారన్న సాకుతో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, డ్వాక్రా సంఘాల లీడర్లు, మధ్యాహ్న భోజన ఏజెన్సీలు, అంగన్‌వాడీ కార్మికులు, ఆశా కార్యకర్తలు, మంచినీటి పథకం కార్మికులు, మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు...ఇలా అనేక రంగాల చిరుద్యోగులను తొలగించడం తీవ్ర అభ్యంతరకరం. రోజువారీ వేతనం మీద ఆధారపడి అస్తు బిస్తుగా బతుకుతున్న చిరుద్యోగులు ఈ మాత్రం ఉపాధి కూడా పోతే జీవించడమే కష్టమవుతుంది. ఇలాంటి చర్యలను ప్రజలు హర్షించరు. గతంలో ఆ పార్టీ చేసింది కదా అని సమర్థించుకోవడం విజ్ఞత కాదు. ఆ పార్టీ వదిలిన చెప్పుల్లో కాళ్ళు పెట్టి కొత్త గమ్యానికి చేరలేరని కొత్త పాలకులు గుర్తించాలి.

పార్టీలకు అధికారం శాశ్వతం కాదు, కానీ ప్రజలకు వివిధ సేవలు అందించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం మాత్రం శాశ్వతం. ఏ పార్టీ అధికారంలో వున్నా ఈ యంత్రాంగం ద్వారానే ప్రజాపాలన అందించాలి. రాష్ట్రంలో సుమారు నాలుగు లక్షల మంది కార్మికులు వివిధ ప్రభుత్వ పథకాల అమలులో భాగంగా పనిచేస్తున్నారు. అంగన్వాడీ సెంటర్లలో లక్ష మందికి పైగా, మధ్యాహ్న భోజన ఏజెన్సీల కింద 80 వేల మంది, ఆశా కార్మికులుగా 45 వేల మంది, ఆర్పీలుగా మరో 28 వేల మంది విధులు నిర్వహి స్తున్నారు. వీరిలో అత్యధికమంది మహిళలు, పేదలు. ఈ కార్మికుల ద్వారా అమలవుతున్న పథకాలన్నీ పేదరిక నిర్మూలన, తల్లుల, పిల్లల ఆరోగ్యం, పొదుపు సంఘాల ద్వారా ఆర్థిక నిర్వహణ లాంటి కీలకమైన లక్ష్యాలతో అమలవుతున్నాయి. ఈ పథకాల అమలు కోసం దశాబ్దాలుగా పనిచేస్తున్న కార్మికులకు మాత్రం కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా, రిటైర్‌మెంట్ సదుపాయం లాంటివి కూడా అమలు కావడంలేదు. అరకొర వేతనంపై ఆధారపడి జీవించే ఈ కార్మికులు ప్రభుత్వాలు మారినప్పుడల్లా అభద్రతతో జీవించాల్సి వస్తుంది. అధికార పార్టీ నాయకులు చేసే వేధింపులు పిల్లికి చెలగాటం ఎలుకకు ప్రాణ సంకటంగా మారుతున్నాయి.



వి. రాంభూపాల్

మున్సిపాలిటీ, పంచాయితీలలో సుమారు 80 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో అత్యధికులు దళితులు. ఈ కార్మికులు చేస్తున్న పని శాశ్వతమైనా, వీరి ఉపాధి మాత్రం కాంట్రాక్టు పద్ధతిలో సాగుతుంది. రిటైర్‌మెంట్ అయినా మున్సిపల్, పంచాయితీ కార్మికుల స్థానంలో శాశ్వత ఉద్యోగులను నియమించని పాలక పార్టీలన్నీ దళిత అభివృద్ధి గురించి నిత్యం మాట్లాడుతుంటాయి. నా దళితులు అన్న మాజీ ముఖ్యమంత్రి, దళిత పెద్దకొడుకునని చెప్పుకున్న ప్రస్తుత ముఖ్యమంత్రి ఈ రంగంలోని కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ కూడా చేయడంలేదు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో ఫీల్డ్ అసిస్టెంట్లు, గోపాల మిత్ర, ప్రకృతి వ్యవసాయ శాఖ, ఆర్టీసి, విద్యుత్ లాంటి అనేక రంగాల్లో వేలాది మంది కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేదు. ఈ కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి ముందుకు రాని పాలక పార్టీలు, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే గతంలో పని చేస్తున్న వారిని తొలగించి తమ అనుచరులను నియమించుకోవడం మన రాష్ట్రంలో గత పది సంవత్సరాల్లో పెద్ద ఎత్తున పెరిగింది. ఇలా తొలగించడం తమ హక్కు లాగా స్థానిక నేతలు భావిస్తున్నారు. చిరుద్యోగులను బెదరించడం, బలవంతాన రాజీనామాలు చేయించడం లాంటి సంఘటనలతో కొందరు కార్మికులు బలవన్మరణాలకు సిద్ధం అవుతున్న పరిస్థితి రావడం కొత్త ప్రభుత్వానికి శుభపరిణామం కాదు. రాష్ట్రంలో రెండు ప్రాంతీయ పార్టీల మధ్య తీవ్రమైన పోటీ కుటుంబాల వరకు రాజకీయ విభజనకు దారితీసింది. తమకు ఓటు వేయని వారంతా తమ శత్రువులే అని గతంలో వైసిపి, ప్రస్తుతం టిడిపి భావించే ధోరణి పెరిగింది. వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే టిడిపి పాలన కాలంలో నియమితులయ్యారనే సాకుతో అనేక జిల్లాల్లో అసంఘటిత రంగ కార్మికులను తొలగించి తమ అనుచరులను నియమించుకుంది. నేడు అదే విధానాన్ని టిడిపి కొనసాగిస్తుంది. జూన్ 4న ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే అనంతపురం, పల్నాడు జిల్లాలో స్థానిక తెలుగుదేశం నాయకులు వందలాది మధ్యాహ్న భోజన ఏజెన్సీ కేంద్రాల్లోకి వెళ్ళి వంట సామాగ్రిని తమ స్వాధీనం చేసుకున్నారు. ఈ ధోరణి క్రమంగా అనేక జిల్లాలకు విస్తరించింది. మరికొన్ని జిల్లాల్లో అంగన్వాడీ కేంద్రాలపై టిడిపి జెండాలు ఎగురవేశారు. అంగన్వాడీలను, ఆశా లాంటి రంగాల్లో పనిచేస్తున్న కార్మికులను తొలగించడానికి సాంకేతికంగా కష్టం కావడంతో అనేక జిల్లాల్లో భయపెట్టి బలవంతపు రాజీనామాలు చేయిస్తున్నారు. తాము అధికారంలోకి వచ్చాము కాబట్టి మీరు ఖాళీ చేయాల్సిందే అంటూ స్థానిక నాయకులు బెదిరిస్తుంటే అటు ఎంఎల్‌ఏలు, ఇటు అధికారులు తమకు ఈ విషయాలు ఏమీ తెలియనట్లు వుంటున్నారు. తాడిపత్రి మున్సిపాలిటీలో కాంట్రాక్టు కార్మికుల్లో కొందరిని తొలగించడమే కాక, సంఘాలు, హక్కులు అంటే ఇక్కడ కుదరదని సంఘ నాయకులను ఇంటికి పిలిపించుకుని మున్సిపల్ చైర్మెన్ బెదిరించాడు. రాష్ట్రంలో దాదాపు అన్ని జిల్లాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించారు. కొత్తవారిని నియమించకపోవడంతో కూలీలకు ఉపాధి పనులు తగ్గిపోయాయి. డ్వాక్రా సంఘాల తీర్మానం పేరుతో వేలాది ఆర్పీలను తొలగిస్తున్నారు. గతంలో ఆ పార్టీ చేసింది కాబట్టి ఇప్పుడు మేము చేస్తామని చెప్పడం ఎలా సమర్థనీయం. గతంలో కార్మికుల అక్రమ తొలగింపులు, అమలుకు నోచుకోని హామీలు, ఉద్యమాల నిర్బంధం ద్వారా అణచివేత లాంటి తీవ్రమైన తప్పులు చేసినందునే వైసిపి కి కార్మికులు, ప్రజలు పెద్ద శిక్షే వేశారని టిడిపి గుర్తించాలి. గతంలో ఉద్యమించిన కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ముఖ్యంగా అంగన్‌వాడీ, ఆశా, మున్సిపల్ కార్మికులు చేసిన సమ్మెలకు మద్దతు ఇచ్చిన టిడిపి నాయకులు నేడు ఆ చిరుద్యోగులను తొలగించడం ఏం విధానం?

> గత ప్రభుత్వంలో నియమితులయ్యారన్న సాకుతో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, డ్వాక్రా సంఘాల లీడర్లు, మధ్యాహ్న భోజన ఏజెన్సీలు, అంగన్‌వాడీ కార్మికులు, ఆశా కార్యకర్తలు, మంచినీటి పథకం కార్మికులు, మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు...ఇలా అనేక రంగాల చిరుద్యోగులను తొలగించడం తీవ్ర అభ్యంతరకరం. రోజువారీ వేతనం మీద ఆధారపడి అస్తు బిస్తుగా బతుకుతున్న చిరుద్యోగులు ఈ మాత్రం ఉపాధి కూడా పోతే జీవించడమే కష్టమవుతుంది. ఇలాంటి చర్యలను ప్రజలు హర్షించరు. గతంలో ఆ పార్టీ చేసింది కదా అని సమర్థించుకోవడం విజ్ఞత కాదు. ఆ పార్టీ వదిలిన చెప్పుల్లో కాళ్ళు పెట్టి కొత్త గమ్యానికి చేరలేరని కొత్త పాలకులు గుర్తించాలి.



1991 తర్వాత దేశంలో 1995 నుండి రాష్ట్రంలో ప్రైవేటీకరణ విధానాలు వేగంగా అమలయ్యాయి. దీనివల్ల ప్రభుత్వ రంగంలో ఉపాధి అవకాశాలు భారీగా తగ్గిపోయాయి. శాశ్వత పనిలో కాంట్రాక్టు విధానం ఉండరాదని దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును పాలక పార్టీలు తుంగలో తొక్కాయి. అన్ని శాఖల్లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానాన్ని పాలక పార్టీలన్నీ అమలు చేశాయి. ప్రజల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని స్కీములు అమలు చేస్తున్నాయి. ఈ స్కీముల ప్రారంభ రోజుల్లో వీటిల్లో పనిచేసే కార్మికులను స్థానిక పెత్తందార్ల సిఫారసులతో ఎంఎల్‌ఏలు, ఎంపీలు నియమించేవారు. క్రమంగా ఈ కార్మికులు సంఘటితమై కొంతమేరకు వేతనాలను, కొన్ని హక్కులను సాధించుకున్నారు. ప్రభుత్వాలు కూడా ఓట్ల కోసమైనా వీరి కోర్కెల్లో కొన్నింటినైనా అంగీకరించాల్సి వచ్చింది. ఈ ఉద్యోగ నియామకాలకు, తొలగింపులకు కొన్ని మార్గదర్శకాలను రూపొందించాల్సి వచ్చింది. ఇష్టానుసారంగా తొలగించడం సాధ్యం కాదు కాబట్టి రాజీనామా చేయమని ఈ చిరుద్యోగులను కొన్ని ప్రాంతాల్లో టిడిపి నాయకులు బెదిరిస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో ఈ కార్మికులపై అబద్ధాలు, నిందలను గ్రామ ప్రజల పేరుతో తమ పార్టీ వారితో పై అధికారులకు అర్జీలు పెట్టిస్తున్నారు. ఈ అర్జీల విచారణ పేరుతో తొలగిస్తున్నారు. ఇలా తొలగించడం రాజకీయ ఆధిపత్యాన్ని, పెత్తందారీ మనస్తత్వాన్ని సంతృప్తి పరుస్తుందేమో కానీ, కార్మికుల జీవితాలను అధోగతికి చేరుస్తుందని పాలక పార్టీల నేతలు గుర్తించాలి.

రాష్ట్రంలో జరుగుతున్న ఐఎఎస్, ఐపిఎస్‌ల బదిలీలు, నియమకాలపై గత కొన్ని రోజులుగా పెద్ద చర్చ జరుగుతున్నది. చట్టాలను అమలు చేయాల్సిన ఉన్నతాధికారులను ఫలానా వారు ఫలానా పార్టీ అనేంత స్థాయిలో మాట్లాడుకోవడం, పత్రికల్లో, సోషల్ మీడియాల్లో రాసుకోవడం మన రాష్ట్రంలో దిగజారుతున్న పాలనా పద్ధతులకు నిదర్శనం. చట్టబద్ధంగా వ్యవహరించాల్సిన ఉన్నతాధికారులు సహితం మంచి పోస్టింగ్, ట్రాన్స్‌ఫర్ల కోసం అధికార పార్టీ నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. ఇలా లబ్ధి పొందిన వారు రాజకీయ ఒత్తిళ్లకు, పైరవీలకు సులభంగా లొంగిపోతున్నారు. ఈ అపవిత్ర బంధం అధికారుల వెన్నెముకను విరిచేసింది. అధికార పార్టీ నేతల మెప్పు కోసం ఎంతటి చట్టవిరుద్ధమైన పనులనైనా చేయడం, న్యాయం కోసం వచ్చిన బాధితులనే బెదరించడం, ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు చేయాల్సిన న్యాయాన్ని పాలక పార్టీల నాయకుల ఇళ్ల దగ్గర చేసుకొమ్మని సలహాలు ఇచ్చే పరిస్థితికి దిగజార్చారు. చట్టవిరుద్ధంగా వ్యవహరించిన కొందరు ఐఎఎస్ అధికారులు ఇటీవలే జైళ్లకు వెళ్లిన సంఘటనలు కూడా మన రాష్ట్రంలో చూశాము.

సరళీకరణ విధానాలు అమలులోకి వచ్చిన తర్వాత ఈ అపవిత్ర బంధం మరింతగా బలపడింది. ప్రభుత్వ భూములు ప్రకృతి సహజ వనరులు ముఖ్యంగా ఇసుక, మట్టి, కొండలు, గనులు ఇలా ప్రతి దాంట్లో నీకు ఇంత, నాకు అంత (క్విడ్ ప్రో కో) అని రాజకీయ నాయకులు, అధికారులు పంపకాలు వేసుకునే ధోరణి పెరిగింది. ఇలాంటి అధికారులు ఏ పార్టీ అధికారంలో వుంటే ఆ పార్టీ కొమ్ము కాస్తున్నారు. వీరిని అరికట్టాల్సిందే. అయితే ఈ పని పాలక పార్టీలు చేయలేవు. గొంగళిలో అన్నం తింటూ వెంట్రుకలు ఏరడం సాధ్యం కాదు. ఏ రకమైన రాజకీయ ఒత్తిళ్ళకు తలొగ్గకుండా చట్టబద్ధంగా వ్యవహరించి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన అధికారులు మన రాష్ట్రంలో గతంలో అనేమంది ఉన్నారు. ఎంతో ప్రజాదరణ ఉన్న ముఖ్యమంత్రులు, మంత్రులు సహితం ఇలాంటి అధికారుల దగ్గర జాగ్రత్తగా వ్యవహరించిన సంఘటనలు అనేకం వున్నాయి. ఇప్పటికీ అలాంటి అధికారులు కొందరు ఉన్నారు. వారు అలా ధైర్యంగా నిలపడంలో నాటి ప్రజా ఉద్యమాలు, ప్రజా చైతన్యం కీలక పాత్ర పోషించాయి. ఇలాంటి వికృత పోకడలను ఎదుర్కొనేందుకు అలాంటి చైతన్యయుతమైన పోరాటాలను నిర్మించాలి. అధికార పార్టీ మారింది కాబట్టి చిరుద్యోగులను తొలగిస్తామనే వాదన ఎవరు చేసినా ప్రశ్నించాల్సిందే, ప్రతిఘటించాల్సిందే.

/వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు/

వ్యాఖ్య

అభివృద్ధికి, ఉపాధికి మేలు చేయని బడ్జెట్

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ కార్మికులకు, రైతులకు, ప్రజలకు ఎటువంటి మేలూ చేయలేదు. యాజమాన్య సంఘాల కోర్కెలకు ప్రాధాన్యత ఇచ్చిన బడ్జెట్...కార్మిక, రైతు సంఘాల కోర్కెలను పూర్తిగా విస్మరించింది. కార్మికుల కనీస వేతనాలు, సంక్షేమం, పెన్షన్లు తదితర హక్కులను విస్మరించింది.

చివరికి ప్రధాని మోడీ నిత్యం జపం చేస్తున్న భారతదేశ అభివృద్ధి (వికసిత భారత్)కి కూడా ఇది తోడ్పడదు. నిరుద్యోగం తాండవిస్తున్న దేశంలో సరాసరిగా సంవత్సరానికి 78 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తాయన్న బడ్జెట్ పథకాలు-యజమానులకు ఆర్థిక నిధులను (బడ్జెట్) బదిలీ చేయడానికి తోడ్పడతాయి తప్ప, కొత్త ఉద్యోగాలు సృష్టించవు.

అభివృద్ధి తకరారు


ప్రభుత్వం ఇచ్చే అభివృద్ధి లెక్కలు వాస్తవాలకు అతీతంగా ఉంటాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 7 శాతం జరిగిన అభివృద్ధి, 2023-24లో 8.2 శాతానికి పెరిగిందని లెక్కలు చూపించాయి. కానీ వాస్తవం ఏమిటి? 2022-23లో 7 శాతం ఆర్థికాభివృద్ధి జరిగినది అంటే 2021-22లో రూ.100 స్థూల జాతీయోత్పత్తి విలువ ఉంటే 2022-23లో రూ. 107కు పెరిగింది (7 శాతం). మరలా 2023-24లో 8.2 శాతం పెరిగితే జిడిపి విలువ రూ. 107 మీద మరో 8.77 రూపాయలు పెరిగి రూ. 115.77 అవుతుంది.

చైనాలో జిడిపి విలువ మనకంటె సుమారు ఐదు రెట్లు ఎక్కువ. 2022-23లో భారత అభివృద్ధి 7 శాతం జరిగితే, చైనా అభివృద్ధి 5.2 శాతం మాత్రమే జరిగింది. అభివృద్ధిలో చైనాను దాటి పోతున్నామని మన పాలకులు ప్రగల్భాలు పలుకుతున్నారు. కానీ వాస్తవం ఏమిటి? భారత జిడిపి విలువ రూ. 100 ఉంటే 7 శాతం పెరిగితే రూ. 107 ఉన్నది. చైనా జిడిపి విలువ మనకంటె 5 రెట్లు ఎక్కువ. 500 మీద 5.2 శాతం పెరిగితే రూ. 526 అవుతుంది. రెండో సంవత్సరం మరో 5.2 శాతం పెరిగితే 553.35 అవుతుంది. ఈ లెక్కన 100 సంవత్సరాలైనా సరే చైనాను దాటుకు పోయే సమస్య లేదు.



పి.అజయకుమార్

చైనా స్థాయి అభివృద్ధి లేకుండా అక్కడి స్థాయిలో ఉద్యోగాలు రావడం సాధ్యం కాదు. ఆ దేశంలో ప్రభుత్వ రంగానిదే పైచేయి. ప్రభుత్వం విపరీతంగా పెట్టుబడులు పెడుతుంది. ఇది ప్రైవేట్ రంగానికి కూడా ఉత్ప్రేరకంగా పని చేస్తుంది. మన దేశ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల దగ్గర మార్చి 31, 2023 నాటికి రూ. 12 లక్షల 81 వేల కోట్లు నగదు నిల్వలు ఉన్నాయి. వీటిని ఉపయోగించి ప్రభుత్వ రంగ సంస్థలను విస్తరిస్తే చాలా పెద్ద స్థాయిలో ఉద్యోగాలు వాస్తవ రూపంలో వస్తాయి. ప్రైవేట్ రంగ సంస్థల అభివృద్ధికి కూడా ఇది దారితీస్తుంది. దీన్ని పట్టించుకోకుండా ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా ప్రైవేట్ రంగ సంస్థలకు అమ్మడం మోడీ ప్రభుత్వ ధ్యేయం. నేరుగా అమ్మడం లేదా లీజు కింద అప్పజెప్తోంది. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను విరమించుకోవాలని కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నప్పటికీ మోడీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.





మోడీ ప్రభుత్వం ప్రతీ బడ్జెట్‌లోనూ ప్రైవేటీకరణకు పెద్ద పీట వేస్తున్నది. ఈ బడ్జెట్‌లో కూడా కొత్తగా అనేక ప్రైవేటీకరణ సంస్కరణలకు తెర లేపింది. పరిశోధన-అభివృద్ధి రంగంలోకి ప్రైవేట్ పెట్టుబడులను ఆహ్వానించింది. 100 నగరాల్లో లేదా వాటి దగ్గర్లో పూర్తి మౌలిక సౌకర్యాలతో పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వ-ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని ప్రకటించింది. పారిశ్రామిక కార్మికులకు అద్దెకు ఇచ్చే డార్మిటరీల నిర్మాణం కూడా ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంలో జరుగుతుంది.

ఓడల నిర్మాణం, మరమ్మతుల్లోకి ప్రైవేట్ పెట్టుబడులను ప్రకటించింది. అంతర్జాతీయ మార్కెట్లలో చేతివృత్తులు, చిన్న మధ్యతరహా పరిశ్రమలు ఉత్పత్తుల అమ్మకానికి ప్రభుత్వ - ప్రైవేట్ భాగస్వామ్యంలో వాణిజ్య ఉత్పత్తుల ఎగుమతి కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. మౌలిక సౌకర్యాల కల్పనలో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహిస్తారు. గ్రామ, పట్టణ భూ సంబంధిత, లేబరు సంబంధిత చర్యల్లో తరువాతి తరం సంస్కరణలను అమలు చేస్తారు. ప్రత్యేకంగా కార్మిక సంస్కరణల్లో భాగంగా పారిశ్రామిక, వాణిజ్యవేత్తలకు సులువైన మార్గాలను ప్రవేశపెడతారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల కోసం నిబంధనలు, నియంత్రణలను సరళీకృతం చేస్తారు.

ఉపాధి రహస్యం

5 సంవత్సరాల్లో 4 కోట్ల మందికి పైగా నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు 'ప్రధానమంత్రి ప్యాకేజీ'ని బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. సంఘటిత రంగంలో కొత్తగా ఉద్యోగాల్లో చేరే వారికి మొదటి నెల జీతంలో రూ. 15 వేలను 3 వాయిదాల్లో ప్రభుత్వం చెల్లిస్తుంది. మాన్యుఫాక్చరింగ్ రంగంలో కొత్తగా చేరే ఉద్యోగులకు 4 సంవత్సరాల వరకు యజమానులు, ఉద్యోగుల ఇపిఎఫ్ వాటాలను ప్రభుత్వం చెల్లిస్తుంది.

మూడో స్కీం ప్రకారం అదనంగా ఉద్యోగంలో చేరే ప్రతి ఉద్యోగి పి.ఎఫ్ కు యజమాని చెల్లించాల్సిన వాటాను 2 సంవత్సరాల వరకు ప్రభుత్వం చెల్లిస్తుంది. భారతదేశ అత్యుత్తమ కంపెనీల్లో నైపుణ్యాలను సంపాదించుకునేందుకు (ఇంటర్న్‌షిప్) ఒక సంవత్సరం పాటు చేరే వారికి నెలకు రూ. 5 వేలను ప్రభుత్వం అలవెన్సుగా చెల్లిస్తుంది. మిగతా అలవెన్సును కంపెనీలు తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సియస్‌ఆర్) నిధుల నుండి చెల్లించాలి. ఇతర ఖర్చులకు ఒకసారికి ప్రభుత్వం రూ.6 వేలు ఇస్తుంది.

ఈ నాలుగు పథకాల కింద కేంద్ర ప్రభుత్వం 5 సంవత్సరాల్లో రూ. 2 లక్షల కోట్లు ఖర్చు పెడుతుంది. ఈ పథకం మసిపూసి మారేడు కాయ చేసే పథకం. ప్రభుత్వం నిజంగా రాబోయే కాలంలో అంత ఖర్చు పెడుతుందా లేదా అనేది తరువాత సంగతి. ఇపుడైతే గాలిలో 4 కోట్ల 10 లక్షల ఉద్యోగాలు 5 సంవత్సరాల్లో కల్పించింది. యజమానులు తమ అవసరాలను బట్టి కొత్తగా ఉద్యోగులను పెట్టుకుంటారు గాని ప్రభుత్వం ఇచ్చే తన పి.ఎఫ్ వాటాను చూసి ఉద్యోగంలో పెట్టుకోరు.

పథకంతో సంబంధం లేకుండా తమ అవసరాల మేరకు ఉద్యోగాల్లో పెట్టుకునే వారిని కూడా చూపించి పథకంలో వచ్చే ప్రజల డబ్బులు (బడ్జెట్ నిధులు) యాజమాన్యాలు తమ బొక్కసాల్లోకి చేర్చుకుంటాయి. మొదటి నెల జీతంలో ప్రభుత్వం ఉద్యోగులకిచ్చే రూ. 15 వేలు మేర యజమానులు తాము ఇచ్చే జీతాన్ని తగ్గిస్తారు. ఉద్యోగికి ప్రభుత్వం కట్టే పి.ఎఫ్ మేర కూడా జీతానికి కోత వేస్తారు. తాను చెల్లించాల్సిన ఇంటర్న్‌షిప్ అలవెన్సు నుండి ఉద్యోగికి ప్రభుత్వం ఇచ్చే రూ. 6 వేలను కూడా తగ్గిస్తారు. వాస్తవంలో 5 సంవత్సరాల్లో రూ.2 లక్షల కోట్లు ప్రజల డబ్బు యజమానుల చేతుల్లోకి పోతుంది. 4 కోట్ల 10 లక్షల ఉద్యోగాలు కూడా ఒట్టిదే.

యజమానులకు ఫుల్ - కార్మికులకు, ప్రజలకు నిల్

ఒకపుడు తన ఉద్యోగులకు వేతనాలు పెంచినందువలన మార్కెట్‌లో డిమాండ్ పెరిగి అభివృద్ధికి దారి తీసిందని కేంద్ర ప్రభుత్వం చెప్పింది. కార్మిక సంఘాలు కోరుతున్నట్లుగా కనీస వేతనం రూ. 26 వేలకు పెంచితే, అది దేశం బాగా అభివృద్ధి చెందటానికి దారి తీస్తుంది కదా? ఆరోగ్య రంగం మీద గత సంవత్సరపు బడ్జెట్ మీద కేటాయింపులు కేవలం 1.98 శాతం మాత్రమే పెరిగింది. జిడిపి లో ఆరోగ్య రంగం మీద పెట్టే ఖర్చును 2020 నాటికి 2.5 శాతానికి చేరుస్తామని మోడీ గతంలో వాగ్దానం చేశారు. ఇప్పటికీ ఆ వాగ్దానం నెరవేరలేదు. ప్రజారోగ్య సౌకర్యాలు సరిగా లేక ఆరోగ్యం కోసం ప్రజలు అప్పులపాలయ్యే పరిస్థితి ఇప్పుడు కూడా మారదు.

> సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించటానికి ఉపయోగపడే మానవాభివృద్ధి రంగాలకు కేటాయింపుల్లో ఏ మార్పూ లేదు. సర్వశిక్షా అభియాన్, ఐసిడిఎస్, జాతీయ జీవనోపాధుల పథకం, రైతుల పెట్టుబడి సాయాలకు కేటాయింపుల్లో ఎటువంటి పెరుగుదల లేదు. మధ్యాహ్న భోజన పథకానికి, గ్రామీణ ఉపాధికి, జాతీయ ఆరోగ్యానికి 2022-23 కంటె కేటాయింపులు తగ్గాయి. ఆయుష్మాన్ భారత్‌కు గత బడ్జెట్ కంటె ఇపుడు తగ్గింది. ప్రధానమంత్రి పట్టణ గృహ నిర్మాణ పథకానికి కేటాయింపులు 2022-23 స్థాయిలో ఉండగా, గ్రామీణ గృహ నిర్మాణానికి గత బడ్జెట్ స్థాయిలోనే కేటాయింపులున్నాయి. పేదలకు, కింది స్థాయి మధ్యతరగతికి ఉపయోగపడే ఈ పథకాల పట్ల మోడీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. ఈ పథకాల్లో పని చేసే ఉద్యోగుల వేతనాల్లో కూడా పెంపులేదు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించటానికి ఉపయోగపడే మానవాభివృద్ధి రంగాలకు కేటాయింపుల్లో ఏ మార్పూ లేదు. సర్వశిక్షా అభియాన్, ఐసిడిఎస్, జాతీయ జీవనోపాధుల పథకం, రైతుల పెట్టుబడి సాయాలకు కేటాయింపుల్లో ఎటువంటి పెరుగుదల లేదు. మధ్యాహ్న భోజన పథకానికి, గ్రామీణ ఉపాధికి, జాతీయ ఆరోగ్యానికి 2022-23 కంటె కేటాయింపులు తగ్గాయి. ఆయుష్మాన్ భారత్‌కు గత బడ్జెట్ కంటె ఇపుడు తగ్గింది. ప్రధానమంత్రి పట్టణ గృహ నిర్మాణ పథకానికి కేటాయింపులు 2022-23 స్థాయిలో ఉండగా, గ్రామీణ గృహ నిర్మాణానికి గత బడ్జెట్ స్థాయిలోనే కేటాయింపులున్నాయి. పేదలకు, కింది స్థాయి మధ్యతరగతికి ఉపయోగపడే ఈ పథకాల పట్ల మోడీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. ఈ పథకాల్లో పని చేసే ఉద్యోగుల వేతనాల్లో కూడా పెంపులేదు.

అన్ని రకాల పెన్షనర్లలో అతి పేద స్థాయి పెన్షనర్లుగా ఉన్నది ఇపిఎస్ పెన్షనర్లు. వీరి కనీస పెన్షన్ పెంచాలన్న కోర్కెను బడ్జెట్ విస్మరించింది. నష్టదాయకమైన ప్రభుత్వ ఉద్యోగుల కంట్రిబ్యూటరీ పెన్షన్ పథకాన్ని సమీక్షిస్తున్నామని బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు తప్ప ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరిస్తామని చెప్పలేదు. సంపన్నులకు రూ. 29 వేల కోట్ల పన్ను రాయితీలు ఇచ్చారు. సామాన్య ప్రజల పరోక్ష పన్నుల్లో కేవలం రూ. 8 వేల కోట్లు తగ్గించారు. మరో రూ. 30 వేల కోట్ల పన్నుల భారం వేస్తామన్నారు. ఇది సహజంగా సామాన్య ప్రజలపైనే పడుతుంది. ఇది సంపన్నుల, పెట్టుబడిదారుల బడ్జెట్. కార్మికుల, ప్రజల ఉపాధికి, అభివృద్ధికి ఉపయోగపడని బడ్జెట్.

/ వ్యాసకర్త సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు /

49,342 ఎంఎస్ఎంఇలు మూత

- **3,17,641 మంది ఉద్యోగులపై ప్రభావం**

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో 49,342 ఎంఎస్ఎంఇలు మూతపడ్డాయని, 3,17,641 మంది ఉద్యోగాలు కోల్పోయారని కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలశాఖ మంత్రి జతిన్ రాం మాంఝీ తెలిపారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో మంత్రి చెప్పారు. 2024 జులై 22 నాటికి 49,342 ఎంఎస్ఎంఇలు మూతపడ్డాయని, 3,17,641 మంది ఉద్యోగాలు కోల్పోయారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 996 ఎంఎస్ఎంఇ మూతపడగా, 6,049 మంది ఉద్యోగాలు కోల్పోయారని తెలిపారు.



పర్యాటక, సాంస్కృతికశాఖలో 3,520 పోస్టులు ఖాళీ

పర్యాటక, సాంస్కృతికశాఖలో 3,520 పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తెలిపారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. మంత్రిత్వశాఖలో గ్రూప్-ఎ 263 పోస్టులు, గ్రూప్-బి 577 పోస్టులు, గ్రూప్-సి 2,680 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

హైకోర్టుల్లో 357 జడ్జి పోస్టులు ఖాళీ

దేశంలోని హైకోర్టుల్లో న్యాయమూర్తి పోస్టులు 357 ఖాళీగా ఉన్నాయని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ రాజ్యసభ ప్రశ్నోత్తరాల్లో తెలిపారు. దేశవ్యాప్తంగా హైకోర్టుల్లో 1,114 న్యాయమూర్తి పోస్టులు మంజూరు కాగా, అందులో ప్రస్తుతం 757 న్యాయమూర్తులు పని చేస్తున్నారు. 357 న్యాయమూర్తి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో 37 మంది న్యాయమూర్తులకు గానూ, 29 మంది ఉన్నారు. ఎనిమిది ఖాళీగా ఉన్నాయి.

రాష్ట్రంలో 11,774 పోక్సో కేసులు నమోదు

ఆంధ్రప్రదేశ్‌లో 11,774 పోక్సో కేసులు నమోదయ్యాయని కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ తెలిపారు. 2019 నుంచి 2024 మే 31 వరకు రాష్ట్రంలో 11,774 పోక్సో కేసులు నమోదయ్యాయని, 16 పోక్సో కోర్టులు ఏర్పాటు చేశారని, 4,899 పోక్సో కేసులు పరిష్కరించారని తెలిపారు. దేశవ్యాప్తంగా 32 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 2,99,759 పోక్సో కేసులు నమోదు కాగా, 410 పోక్సో కోర్టులను ఏర్పాటు చేసి, 1,62,497 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు.

సోమశిల, సిద్ధేశ్వరం వద్ద బ్రిడ్జి కమ్ బ్యారేజికి ప్రతిపాదన లేదు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించిన సమాచారం ప్రకారం సోమశిల, సిద్ధేశ్వరం వద్ద బ్రిడ్జి కమ్ బ్యారేజీ నిర్మాణ ప్రతిపాదన లేదని కేంద్ర జలశక్తిశాఖ సహాయ మంత్రి భూషన్ చౌదరి తెలిపారు. ఈ మేరకు లోక్‌సభలో టిడిపి ఎంపి బైరెడ్డి శబరి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలోనే బ్యారేజీలు, నీటి పారుదల ప్రాజెక్టుల నిర్వహణ, అమలు ఉంటుందని తెలిపారు.

9,73,837 ఇళ్ల నిర్మాణం పూర్తి

ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-అర్బన్ (పిఎంఎవై-యు) కింద 9,73,837 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని కేంద్ర హౌసింగ్, పట్టణ వ్యవహారాలశాఖ సహాయ మంత్రి టోఖాన్ సాహు తెలిపారు. లోక్‌సభలో టిడిపి ఎంపి తెన్నేటి కృష్ణప్రసాద్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు. 2024 జులై 15 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో 21,37,028 ఇళ్లు మంజూరు కాగా, అందులో 19,90,937 ఇళ్లు నిర్మాణం ప్రారంభం కాగా, 9,73,837 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని తెలిపారు.

అర్బన్ మీ సేవ కేంద్రాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- **ఎపి మీ సేవ కాంట్రాక్టు ఎంప్లాయీస్ అసోసియేషన్**

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా గత 16 ఏళ్లుగా 170 అర్బన్ మీ సేవ కేంద్రాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను కొనసాగించాలని ఎపి మీ సేవ కాంట్రాక్టు ఎంప్లాయీస్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు రాష్ట్ర మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేష్, ఐటి, టెక్నికల్ విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరవ్ గౌర్, గ్రామ, వార్డు సచివాలయాల కమిషనరు ఎస్ సురేష్‌కుమార్‌ను అసోసియేషన్ నాయకులు కలిసి వినతిపత్రాలు అందజేశారు. సమస్యలను పరిష్కరిస్తామని అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సిహెచ్ నాగేశ్వరరావుకు ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్ హామీ ఇచ్చారు. మీసేవ ఉద్యోగులను తిరిగి సర్వీసుల్లోకి తీసుకుని పట్టణ ప్రాంతాల్లో మీ సేవ కేంద్రాలను తిరిగి ప్రారంభించాలని శాసనమండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు కోరారు. ప్రత్యేక ప్రస్తావన ద్వారా ఆయన ఈ అంశాన్ని మండలిలో ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు.

రాష్ట్రంలో 73.46 శాతం ఇళ్లకు కుళాయి

- **కేంద్ర మంత్రి సిఆర్ పాటిల్**

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో జల్‌జీవన్ మిషన్ (జెజెఎం) కింద 73.46 శాతం వరకూ గృహాలకు కుళాయి నీటి వసతి లభించిందని కేంద్ర జలశక్తిశాఖ మంత్రి సిఆర్ పాటిల్ తెలిపారు. లోక్‌సభలో టిడిపి ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు. 2019 ఆగస్టు వరకు ఆంధ్రప్రదేశ్‌లో 32.21 శాతం ఇళ్లకు కుళాయి నీరు సదుపాయం ఉండగా, గత ఐదేళ్లలో 41.25 శాతం ఇళ్లకు కుళాయి నీరు అందిందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కేంద్రం నుంచి ఇచ్చే నిధులు, సాంకేతిక సహకారంతో 100 శాతం పూర్తవుతుందని అన్నారు. లోక్‌సభలో టిడిపి ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు లేవనెత్తిన ప్రశ్న చాలా సీరియస్ అంశం అని, దీనిపై అనేక ఫిర్యాదులు కూడా వచ్చాయని కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ అన్నారు. నీటి లభ్యత, సరఫరా వ్యవహారాలను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించి చర్యలు తీసుకుంటుందన్నారు. ఆయన లేవనెత్తిన అంశాన్ని ప్రత్యేకంగా చూడాలని అన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో నీటి లభ్యత ఎంత ఉంది, ఎక్కడి నుంచి తీసుకోవాలో నిర్ణయం చేయొచ్చని మంత్రి పేర్కొన్నారు.

లేబర్ ఎంపిలపై సస్పెన్షన్ వేటు

లండన్ : ఇద్దరు పిల్లల ప్రయోజన పరిమితి రద్దు చేయడానికి అనుకూలంగా ఓటు వేసిన లేబర్ పార్టీ ఎంపిలపై బ్రిటన్ అధ్యక్షుడు కీర్ స్టార్మర్ సస్పెన్షన్ వేటు వేశారు. స్టార్మర్ నిర్ణయాన్ని యూనియన్ నేతలు ఖండించారు. అవమానకరమైన, పూర్తిగా ఖండించదగిన చర్యగా అభివర్ణించారు. ఫైర్, ఎడ్యుకేషన్, సివిల్ సర్వీస్, బేకరీస్, మెయిల్ యూనియన్ నేతలు స్టార్మర్ నిర్ణయం పూర్తిగా తప్పుడు చర్యగా పేర్కొన్నారు. ఎంపిల సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని పిలుపునిచ్చారు. ఎంపిలు షాడో మాజీ ఛాన్సలర్ జాన్ మెక్‌డోనెల్, షాడో మాజీ వాణిజ్య మంత్రి రెబెక్కా లాంగ్ బెయిలీ, అప్సానా బేగం, రిచర్డ్ బర్గాన్, ఇయాన్ బైర్న్, జరా సుల్తానా, ఇమ్రాన్ హుస్సేన్ ఎస్ఎన్‌పి సవరణకు మద్దతు ఇచ్చినందుకు లేబర్ పార్టీ ఆరు నెలలపాటు సస్పెండ్ చేసింది. బ్రిటన్‌లో 4.3 మిలియన్ల ప్రజలను ప్రభావితం చేస్తున్న పిల్లల పేదరికానికి వ్యతిరేకంగా తన వైఖరిని స్పష్టం చేసినందుకు తాను సంతోషిస్తున్నానని కావెంట్రీ సౌత్ ఎంపి జరా సుల్తానా పేర్కొన్నారు. ఇద్దరు పిల్లల ప్రయోజన పరిమితి అనేది ఓస్బోర్న్ యుగం నాటి క్రూరమైన విధానాల్లో ఒకటని ఎంపి జాన్ మెక్‌డోనాల్ పేర్కొన్నారు. ఈ పరిమితి రద్దుకు లేబర్ పార్టీకి చెందిన 11 అనుబంధ యూనియన్ల మద్దతు ఉందని మరో ఎంపి అప్సానా బేగం తెలిపారు. ఇద్దరు పిల్లల ప్రయోజన పరిమితిని 2017లో కన్జర్వేటివ్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. పొదుపు చర్యల్లో భాగంగా 2017 ఏప్రిల్ తర్వాత పుట్టిన పిల్లలందరికీ ఈ పథకం వర్తిస్తుంది. ఈ పరిమితి మూడవ బిడ్డ సంక్షేమం కోసం క్లెయిమ్ చేయకుండా తల్లిదండ్రులను నిరోధిస్తుంది.

జిఓ 107, 108ను రద్దు చేయాలి

• పిడిఎఫ్ ఎమ్మెల్సీల డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గత ప్రభుత్వం విడుదల చేసిన 107, 108 జిఓలను రద్దు చేయాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో వైద్య కళాశాలలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం 17 కొత్త వైద్య కళాశాలల నిర్మాణం చేపట్టి ఐదు కళాశాలను గత విద్యాసంవత్సరంలో ప్రారంభించిందన్నారు. ఎన్నడూ లేని విధంగా ఫీజుల విధానం నిర్ణయించారని తెలిపారు. కన్వీనర్ కోటాలో రూ.15 వేలు, బి-కేటగిరి (సెల్ఫ్ ఫైనాన్స్) రూ.12 లక్షలు, సి-కేటగిరి (ఎన్ఆర్ఐ) రూ.36 లక్షలు వసూలు చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఈ విధానం ఎన్నడూ లేదని తెలిపారు. ప్రభుత్వ కళాశాలల్లో ఈ ఫీజుల వ్యాపారం జిఓను రద్దు చేయాలని గతంలో కూడా డిమాండ్ చేశామని చెప్పారు. టిడిపి, జనసేన కూడా ఈ జిఓలను వ్యతిరేకించాయని, అధికారంలోకి వస్తే రద్దు చేస్తామని హామీ ఇచ్చాయని తెలిపారు. కావున ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. పిఎం ఫసల్ బీమా యోజనను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించాల్సిన ప్రీమియం చెల్లించకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తెలిపారు. ఈల్డ్ బేసిడ్గా, క్లయిమెట్ బేసిడ్గా అనేది ఇన్సూరెన్స్ నిబంధనలు రూపొందించాలన్నారు. ఈ అంశంపై రైతు సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు.

హత్యకు గురైన వారి పేర్లు ఇవ్వండి : చదలవాడ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి అసెంబ్లీకి వచ్చి ప్లెకార్డుతో హత్యలు గురవుతున్న 36 మంది పేర్లను హోంమంత్రికి చెప్పాలని నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు అన్నారు. గురువారం ఆయన మీడియా పాయింట్లో మాట్లాడుతూ.. వ్యక్తిగత కక్షలతో జరిగిన హత్యలను రాజకీయాలకు అపాదించడం సరికాదని, పల్నాడు సంఘటనలో జరిగిన నిజాలేంటో ప్రజలందరికీ తెలుసన్నారు.

కార్పొరేట్లకు రాయితీలు... సామాన్యులకు భారాలు

• ప్రజావ్యతిరేక బడ్జెట్పై నిరసనలు • అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

ప్రజావ్యతిరేక కేంద్ర బడ్జెట్పై రాష్ట్రంలోని పలు జిల్లాల్లో నిరసనలు వెల్లువెత్తాయి. పోలవరం నిర్వాసితుల పునరావాసం, విశాఖ స్టీల్ప్లాంట్కు అవసరమైన వర్కింగ్ క్యాపిటల్ను విస్మరించడం పట్ల సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో గురువారం ఆందోళనలు చేపట్టారు. బడా కార్పొరేట్లకు రాయితీలు.. సామాన్యులకు భారాలుగా బడ్జెట్ ఉందని పలువురు విమర్శించారు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రకు నిధులు కేటాయించకపోవడం, ప్రత్యేక హోదా, విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీ గురించి ప్రస్తావించకపోవడం దారుణమన్నారు. నిరుద్యోగ నిర్మూలనకోసం మంటూ అట్టహాసంగా ప్రకటించిన నూతన పథకాలు సైతం కార్పొరేట్ల ఖజానాలను నింపే వరుసలూ మార్చివేశారని విమర్శించారు. గరీబ్, మహిళా, యువ, అన్నదాత.. అని మాటలు చెబుతూనే, వారికిచ్చే సబ్సిడీల్లో భారీగా కోతలు పెట్టారన్నారు.

పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం, ఏలూరులోని పాత బస్టాండ్ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అల్లూరిగోదావరి జిల్లా రాజ మహేంద్రవరం నగరం శ్యామల సెంటర్లో, విశాఖ, అనకాపల్లి లోని పలు ప్రాంతాల్లో నిరసనలు తెలిపారు. స్టీల్ప్లాంట్కు అవసరమైన వర్కింగ్ క్యాపిటల్ను బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం, విశాఖ రైల్వే జోన్, ఉత్తరాంధ్ర నిధుల గురించి బడ్జెట్లో ప్రస్తావించకపోవడం దారుణమని పలువురు నాయకులు విమర్శించారు. విజయనగరం ఆర్టిసి కాంప్లెక్స్ వద్ద నిరసన, గజపతినగరంలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. బొబ్బిలి, ఎస్.కోట, కొత్తవలస, రామభద్రపురం మండల కేంద్రాల్లో నిరసనలు తెలిపారు. నెల్లూరు ఆర్టిసి బస్టాండ్ సమీపంలో ఆందోళన చేపట్టారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో రాస్తారోకో నిర్వహించారు.



విశాఖ జిల్లా పెందుర్తి రైతుబజార్ వద్ద నిరసన తెలుపుతున్న ప్రజలు, సిపిఎం నాయకులు



కార్మికుల సంక్షేమం ప్రస్తావన లేదు : నర్సింగరావు

కేంద్ర బడ్జెట్లో అంకెల గారడీ తప్ప కార్మికుల సంక్షేమం కోసం తీసుకునే చర్యలు కనరావడం లేదని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. విశాఖ ఉక్కును ఆదుకునేందుకు ప్రకటించడంగాని, పరిశ్రమ అభివృద్ధికి నిధుల కేటాయింపుగాని చేయలేదని అన్నారు. రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి బాధ్యత తమదేనని కేంద్ర ప్రభుత్వం చెప్పినప్పటికీ నిధుల కేటాయింపు ఆ మేరకు జరగలేదని విమర్శించారు.

పోలవరం ప్రాజెక్టు పనులు ప్రారంభమైనప్పటి నుంచి నేటి బడ్జెట్ వరకు నిర్వాసితుల సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఉందన్నారు. కొత్త పరిశ్రమల నిర్మాణం, వాటికి కేటాయించాల్సిన నిధుల కేటాయింపు తగిన విధంగా లేదన్నారు. గత ప్రభుత్వంలానే ఈ ప్రభుత్వంలోనూ చిరుద్యోగుల పట్ల రాజకీయ నాయకుల వేధింపులు మొదలుపెట్టారని, ముఖ్యంగా అంగన్వాడీ, ఆశాలు, డ్వాక్రా సిసిలు వంటి వారిని తొలగించి వారి స్థానంలో కొత్తవారిని తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్రాయ్ మాట్లాడుతూ.. పశ్చిమగోదావరి జిల్లా తణుకు, చాగల్లు షుగర్ ఫ్యాక్టరీలతోపాటు గణపవరంలోని సిపిఎఫ్ పరిశ్రమ, వేండ్రలోని డెల్టా పేపర్ మూతపడటంతో వేలాదిమంది కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. మూతపడిన పరిశ్రమలను తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్వి.గోపాలన్, నేత బి.వాసుదేవరావు పాల్గొన్నారు.



ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద స్థిరంగా ఉన్న వరదనీటి ప్రవాహం

క్రమంగా పెరుగుతున్న గోదావరి

• భయం గుప్పెట్లో విలీన మండలాల ప్రజలు

ప్రజాశక్తి- యంత్రాంగం

గోదావరి ఉధృతి తగ్గినట్లే తగ్గి మళ్లీ క్రమంగా పెరుగు తోంది. ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహ రించడంతో కొందరు తిరిగి తమ ఇళ్లకు చేరుకున్నారు. గురువారం ఉదయం గోదావరి క్రమంగా పెరుగుతుండడంతో మళ్లీ సురక్షిత ప్రాంతాలకు చేరుకున్నారు. ఎగువ ప్రాంతా ల్లో కురుస్తున్న వర్షాలకు గురువారం తెల్లవారుజాము నుంచి వరద పెరుగుతోంది. ప్రస్తుతం భద్రాచలం నీటి మట్టం 48.60 అడుగులుగా నమోదైంది. దీంతో అక్కడ మళ్లీ రెండో ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద నీటి మట్టం నిలకడగా ఉంది. ప్రస్తుతం 14.75 అడుగుల వద్ద స్థిరంగా ఉంది. ఇక్కడ మొదటి ప్రమాద హెచ్చరిక అమల్లో ఉంది. మరో అడుగు మేర నీటి మట్టం పెరిగితే రెండో ప్రమాదం హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉంది. కాటన్ బ్యారేజీ నుంచి 175 గేట్లను పైకి లేపి 12,27,273 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. వ్యవసాయ అవసరాల నిమిత్తం తూర్పు, పశ్చిమ, మధ్య డెల్టా కాల్వలకు 4,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించినప్పటికీ లంకల్లో ముంపు మాత్రం ఇంకా తగ్గలేదు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం, మామిడికుదురు, అయినవిల్లి మండలాల్లోని కాజ్వేలపై నీరు ఇంకా ప్రవహిస్తోంది. పి.గన్నవరం మండలంలో గంటి పెదపూడి లంక, ఆలమూరు మండలంలో బడుగువాని లంక, తోకలంక అయినవిల్లి మండలంలో పల్లపులంక, అయినవిల్లిలంక, శానిపల్లిలంక, పొట్టిలంకల్లో మోకాల్లోతు వరద నీరు నిలిచే ఉంది. రామచంద్రపురం మండలం కోటిపల్లి రేవు పూర్తిగా నీట మునిగింది. కోటిపల్లిలంకకు రాకపోకలు స్తంభించాయి. కపిలేశ్వరపురం మండలంలోని నారాయణలంక, కేదార్లంక, తాతపూడి, కోరుమిల్లి, అద్దంకివారి లంకల్లోకి వరదనీరు పంటపొలాల్లోకి చేరింది. రాజమహేంద్ర వరంలో నిర్వాసితుల పునరావాస కేంద్రాలు కొనసాగుతున్నాయి. కోనసీమ జిల్లా వ్యాప్తంగా సుమారు 680 ఎకరాల్లో ఉద్యాన, కూరగాయల పంటలకు నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక అంచనా వేస్తున్నారు. గోదావరి వరద ఉధృతి తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరుగుతుండడంతో అల్లూరి జిల్లాలోని విలీన మండలాలైన విఆర్.పురం, కూనవరం, ఎటపాక, చింతూరు వాసులు భయాందోళనకు గురవుతున్నారు. ముంపు తగ్గడంతో విఆర్.పురం మండలంలోని పలు గ్రామాల వాసులు కొందరు పడవలపై తమ ఇళ్లకు చేరుకున్నారు. మరలా గోదావరికి వరద పెరుగుతుండడంతో సురక్షిత ప్రాంతాలకు చేరుకున్నారు. ముంపు తగ్గిన ప్రాంతాల్లో అధికారులు పారిశుధ్య పనులు చేపట్టారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు, ఎంపిపి కారం లక్ష్మి తదితరులతో కూడిన బృందం విఆర్.పురం మండలంలోని అడవి వెంకన్నగూడెం, రామవరం గ్రామాల్లో పర్యటించింది. నిత్యావసర సరుకులను నాయకులు పంపిణీ చేశారు. ఏలూరు జిల్లాలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ముంపు వీడకపోవడంతో పలు గ్రామాల మధ్య రాకపోకలు ప్రారంభం కాలేదు. ఇప్పటికీ 19 గ్రామాల మధ్య రాకపోకలు సాగడం లేదు. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం కనకాయలంక, పెదలంక, లక్ష్మీపాలెం తదితర గ్రామాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. దీంతో అక్కడి ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు.

శ్రీశైలానికి వరద ఉధృతి

• 855 అడుగులకు చేరిన నీటిమట్టం

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలం జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వరద ఉధృతి కొనసాగుతోంది. గురువారం సాయంత్రం 6 గంటల సమయానికి ఎగువ జూరాల నుంచి 2,52,605 క్యూసెక్కులు, సుంకేసుల ద్వారా 2095 క్యూసెక్కులు మొత్తం కలిపి 2,54,700 క్యూసెక్కుల నీరు శ్రీశైలం డ్యామ్కు చేరుతోంది. దీంతో జలాశయం నీటిమట్టం 855.20 అడుగులకు చేరింది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు. అదే సమయానికి నీటి నిలువ సామర్థ్యం 92.4860 టిఎంసిలుగా నమోదు కాగా పూర్తిస్థాయి సామర్థ్యం 2015.807 టిఎంసిలు. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్కు 143 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కుడిగట్టు జల విద్యుత్తు కేంద్రంలో విద్యుత్తు ఉత్పత్తిని నిలిపివేశారు. తెలంగాణ పరిధిలోని ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్తు కేంద్రంలో గడిచిన 24 గంటలలో 17,469 క్యూసెక్కుల నీటితో 8.501 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి చేసి, దిగువ సాగర్కు నీటిని విడుదల చేస్తున్నారు.



శ్రీశైలం జలాశయం

టిడిఆర్ బాండ్లలో అవినీతిపై ఎసిబి విచారణ

• మంత్రి పి నారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా టిడిఆర్ బాండ్ల జారీలో భారీ అవినీతి, అవకతవకలు జరిగాయని, తెరవెనుక అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎవరున్నా చర్యలు తప్పవని మున్సిపల్శాఖ మంత్రి పొంగూరు నారాయణ శాసనసభలో స్పష్టం చేశారు. సిఎం చంద్రబాబుతో చర్చించి విచారణ కమిటీలు వేయడంతోపాటు ఎసిబితో కూడా విచారణ చేయిస్తామన్నారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో టిడిఆర్ బాండ్ల జారీ చేసిన పట్టణాల్లో తణుకు, విశాఖపట్నం, గుంటూరు, తిరుపతిలో భారీగా అక్రమాలు జరిగాయన్నారు. గురువారం శాసనసభలో 'బదిలీ చేయదగిన అభివృద్ధి హక్కులు' (టిడిఆర్ బాండ్లు) అవినీతిపై ఎమ్మెల్యేలు అరిమిల్లి రాధాకృష్ణ, మద్దులూరి మాలకొండయ్య (ఎంఎం కొండయ్య) మాట్లాడుతూ.. బాండ్ల అక్రమాలపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకున్నదనే విషయంపై మంత్రి స్పష్టతనివ్వాలని ప్రశ్నించారు. ఈ విషయంపై మంత్రి సమాధానమిస్తూ.. 2019-24 వరకు రాష్ట్ర వ్యాప్తంగా పలు పట్టణాల్లో 3,301 టిడిఆర్ బాండ్లు జారీ చేశారన్నారు. ఇప్పటికే తణుకులో శాఖాపరమైన విచారణ పూర్తయ్యిందన్నారు. తణుకులో ఎసిబి విచారణ జరుగుతోందని, నివేదిక రాగానే చర్యలు తీసుకుంటామని అన్నారు.

తణుకులో చదరపు గజం విలువ రూ.4,500 ఉంటే స్థలం కోల్పోయిన ప్రాంతంలో ధర కాకుండా దానికి 1.4 కిలోమీటర్ల దూరంలో ఉండే మరొక ఇంటి నెంబరు వేసి చదరపు గజం రూ.22 వేలు ధరతో బాండ్లు జారీ చేసినట్లు మంత్రి సభకు తెలిపారు. తణుకులో 29 బాండ్ల జారీ ద్వారా 27.96 ఎకరాలు రూ.63.24 కోట్లు ఇవ్వాల్సి ఉండగా, రూ.754.67 కోట్లకు బాండ్లను జారీ చేశారన్నారు. ఒక్క తణుకులోనే రూ.691.43 కోట్లు స్కామ్ జరిగినట్లు తాజా పరమైన నివేదిక ఇచ్చినట్లు మంత్రి వివరించారు.



సోమనాథ్ ఛటర్జీకి నివాళులర్పిస్తున్న ఓంబిర్లా

లోక్‌సభ మాజీ స్పీకరు సోమనాథ్ ఛటర్జీకి నివాళి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నాలుగో రోజు గురువారం బడ్జెట్‌పై చర్చ కొనసాగింది. సమావేశాల ప్రారంభానికి ముందు లోక్‌సభ మాజీ స్పీకర్ సోమనాథ్ ఛటర్జీ జయంతి సందర్భంగా నేతలు నివాళులర్పించారు. లోక్‌సభ స్పీకరు ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్‌సింగ్, ఇతర నేతలు పార్లమెంట్‌లోని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమావేశాలు ప్రారంభం కాగానే ప్రతిపక్ష 'ఇండియా' ఫోరం నేతలు ఆందోళన చేపట్టారు. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25 బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఇండియా ఫోరం ఎంపిలు నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఉభయ సభల్లో గందరగోళం నెలకొంది. సభ్యుల గందరగోళం మధ్యే సమావేశాలు కొనసాగాయి.

కేజ్రీవాల్ కస్టడీ పొడిగింపు

- కవిత, సిసోడియాలకు కూడా..



న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్, అవినీతి కేసుల్లో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని ఢిల్లీలోని కోర్టు గురువారం పొడిగించింది. ఇడి అరెస్టు చేసిన మనీలాండరింగ్ కేసులో ఈ నెల 31 వరకూ, సిబిఐ అరెస్టు చేసిన అవినీతి కేసులో ఆగస్టు 8 వరకూ కస్టడీని ప్రత్యేక జడ్జి కావేరి బవేజా పొడిగించారు. ఈ స్కామ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసుల్లో ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి, ఆప్ నాయకులు మనీష్ సిసోడియా, బిఆర్ఎస్ నేత కె.కవితలకు జ్యుడీషియల్ కస్టడీని ఈ నెల 31 వరకూ జడ్జి పొడిగించారు. వీరిద్దరినీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు ముందు ప్రవేశపెట్టారు. ఇడి నమోదు చేసిన కేసులో ఇంతకుముందు సుప్రీంకోర్టు కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. సిబిఐ తనను అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ, మధ్యంతర బెయిల్ కోసం కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్లపై ఢిల్లీ హైకోర్టు విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. దీంతో కేజ్రీవాల్ ఇంకా తీహార్ జైలులోనే కస్టడీలో ఉన్నారు.

ఖనిజ హక్కులపై రాయల్టీ పన్ను విధించవచ్చు

- రాష్ట్రాలకు భారీ ఊరట
- చారిత్రక తీర్పు ఇచ్చిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : మైనింగ్, ఖనిజ కార్యకలాపాలపై రాయల్టీ పన్ను విధించే హక్కు రాష్ట్రాలకు ఉన్నదని సుప్రీంకోర్టు గురువారం చారిత్రక తీర్పు వెలువరించింది. ప్రధాన న్యాయమూర్తి వైవి చంద్రచూడ్ నేతృత్వంలోని తొమ్మిదిమంది సభ్యుల విస్తృత ధర్మాసనంలో కేవలం జస్టిస్ బివి నాగరత్న మాత్రమే ఈ తీర్పుతో విభేదించారు. రాయల్టీ అనేది పన్ను వంటిది కాదని, రాయల్టీని విధించే అధికారం రాష్ట్రాలకు ఉన్నదని ధర్మాసనం స్పష్టం చేసింది. తద్వారా 1989లో ఇచ్చిన తీర్పును రద్దు చేసింది. అది సరైన తీర్పు కాదని వ్యాఖ్యానించింది. ఖనిజ సంపద అధికంగా ఉన్న ఒడిషా, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాలకు సుప్రీంకోర్టు తీర్పు గొప్ప విజయంగా చెప్పవచ్చు. 'రాయల్టీ అనేది పన్ను స్వభావం కాదు. రాయల్టీని పన్నుగా పరిగణిస్తూ ఇండియా సిమెంట్స్ కేసులో గతంలో ఈ న్యాయస్థానం వ్యక్తం చేసిన అభిప్రాయం సరైంది కాదని మేము అభిప్రాయపడుతున్నాము. ప్రభుత్వానికి చేసే చెల్లింపులన్నింటినీ కేవలం పన్నులుగా పరిగణించకూడదు. ఎందుకంటే బకాయిల్లో దానిని రికవరీ చేయవచ్చునని చట్టం చెబుతోంది' అని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. ఖనిజాలు, క్వారీలతో కూడిన భూమికి పన్ను విధించడానికి రాష్ట్రాల శాసనసభలకే అధికారం ఉన్నదని చెప్పారు. 'ఖనిజ హక్కులపై పన్ను విధించే అధికారం రాష్ట్ర శాసనసభలకే ఉంటుంది. పార్లమెంటుకు ఆ హక్కు ఉండదు. ఈ వ్యవహారంలో తలదూర్చే అధికారం కేంద్రానికి లేదు' అని మెజారిటీ న్యాయమూర్తులు రూలింగ్ ఇచ్చారు.

విచారణ సందర్భంగా కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ ఖనిజాలు ఉన్న భూములపై రాష్ట్రాలు పన్నులు విధించలేవని, ఆ హక్కు కేంద్రానికే ఉంటుందని తెలిపారు. రాష్ట్రాలు ఎవరికి వారు వేర్వేరుగా లెవీ విధిస్తే ప్రతికూల ప్రభావం పడుతుందని వాదించారు. తొమ్మిదిమంది సభ్యులున్న ధర్మాసనం ఎదుట పెండింగులో ఉన్న కేసుల్లో ఇదే అతి పురాతనమైనది. విచారణ పూర్తవడంతో మార్చి 14న న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది.

మహారాష్ట్రను ముంచెత్తిన వానలు

- జలదిగ్బంధంలో ముంబయి, పూణే
- ఆరుగురు మృతి
- ఆల్మట్టి నుంచి నీటిని విడుదల చేయండి : కర్ణాటకకు మహారాష్ట్ర సూచన



ముంబాయి రహదారిపై వర్షపు నీటిలో వాహనాలు

ముంబయి : మహారాష్ట్రను భారీ వర్షాలు ముంచెత్తాయి. గురువారం తెల్లవారుజామున ప్రారంభమైన వర్షాలు సాయంత్రం వరకూ ఎడతెరిపి లేకుండా కురిసాయి. వర్షాలకు ముంబయి, పూణే వంటి నగరాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. వర్షాల కారణంగా బుధవారం రాష్ట్రంలో ఆరుగురు మరణించారు. పూణేజిల్లాలో ముగ్గురు విద్యుత్ షాక్‌తో మరణించగా, ముల్షి తెహిసిల్‌లో కొండచరియలు విరిగిపడి ఒకరు మరణించారు. చంద్రాపూర్ జిల్లాలో మరో ఇద్దరు పిడుగులుపడి మరణించారు. వివిధ ప్రాంతాల్లో మరో 12 మంది తీవ్రగాయాల పాలయ్యారు. శుక్రవారం కూడా మహారాష్ట్రలో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. ముంబయికి రెడ్ ఎలర్ట్ జారీ చేసింది. గురువారం థానే జిల్లాలో ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ 138 మిల్లీమీటర్లు, సతారా జిల్లాలో ఉదయం 8:30 గంటల నుంచి సాయంత్రం 6:30 గంటల వరకూ 143.2 మిల్లీమీటర్లు, రాయ్‌గఢ్ జిల్లా మథేరాన్ ప్రాంతంలో 137 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మంబయిలోని అనేక ప్రాంతాల్లో తొమ్మిది గంటల వ్యవధిలోనే 155 మిల్లీమీటర్లకుపైగా వర్షం కురిసింది. ముంబయి, పూణేల్లో అనేక లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. వరదల్లో చిక్కుకున్న సుమారు 70 మందిని అగ్నిమాపక దళాలు రక్షించాయి. రహదారులపై వర్షం నీరు ప్రవహించడంతో రవాణా వ్యవస్థ స్థంభించిపోయింది. అనేక రైలు సర్వీసులను రద్దు చేశారు. మంచినీటి సరఫరా, విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఛత్రపతి శివాజీ మహారాజ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు కూడా జలదిగ్బంధంలో చిక్కుకుంది. అనేక విమాన సర్వీసులను రద్దు చేశారు. బృహన్ ముంబయి కార్పొరేషన్, నవీ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. భారీవర్షాల నేపథ్యంలో సిఎం ఏక్‌నాథ్ షిండే సమీక్ష సమావేశం నిర్వహించారు. అవసరమైతే హెలికాప్టర్లతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు.

నిండుకుండల్లా రిజర్వాయర్లు

భారీ వర్షాలకు రాయ్‌గడ్ జిల్లా మహద్‌లో వంతెన కొట్టుకుపోయింది. మహారాష్ట్రలో నదులు నిండుగా ప్రవహిస్తున్నాయి. రిజర్వాయర్లలో భారీ స్థాయిలో నీరు చేరుతోంది. సంగ్లి, కొల్లాపూర్ జిల్లాలను వరద ముప్పు నుంచి తప్పించేందుకు ఆలమట్టి డ్యామ్ నుంచి దిగువకు నీటిని విడుదల చేయాలని కర్ణాటక ప్రభుత్వానికి మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ విజ్ఞప్తి చేశారు. కృష్ణా నదిపై సతారా జిల్లాలో నిర్మించిన కోయ్నా డ్యామ్ 80 శాతం నిండిపోవడంతో నీటిని విడుదల చేస్తామని, కాబట్టి దిగువ ఉన్న ఆల్మట్టి డ్యామ్ నుంచి నీటిని విడుదల చేయాలని కర్ణాటకను కోరుతున్నట్లు విలేకరులతో అజిత్ పవార్ తెలిపారు. మహారాష్ట్రలోని విహర్, తులసి, తన్సా, మోడక్‌సాగర్ వంటి రిజర్వాయర్లలో కూడా భారీగా నీరు చేరుతోంది.

స్మార్ట్ సిటీ రెండో దశ లేదు : కేంద్ర మంత్రి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో


కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ సిటీస్ మిషన్ (ఎస్‌సిఎం) రెండో విడత ప్రతిపాదన ఏదీ లేదని కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ సహాయ మంత్రి తోఖాన్ సాహు తెలిపారు. గురువారం లోక్‌సభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు. ఫిబ్రవరిలో పార్లమెంటు ఉభయ సభల్లో ప్రవేశపెట్టిన నివేదికలో ఎస్‌సిఎం రెండో ఎడిషన్‌ను పార్లమెంటరీ కమిటీ సిఫార్సు చేసింది. రాష్ట్ర రాజధానుల రద్దీని తగ్గించడానికి ద్వితీయ శ్రేణి నగరాలపై దృష్టి సారించి మిషన్‌ను రెండో దశకు విస్తరించాలని గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల స్టాండింగ్ కమిటీ నివేదిక పేర్కొంది. ఈ నగరాలు రాజధాని, పర్యాటక నగరాలకు 50-100 కిలోమీటర్ల లోపు ఉండాలని కమిటీ తెలిపింది. అయితే గురువారం లోక్‌సభలో మంత్రి ఇచ్చిన సమాధానంపై వ్యాఖ్యానించడానికి ఎంఒహెచ్‌యుఎ అధికారులు అందుబాటులో లేరు.

కాగా, మిగిలిన ప్రాజెక్టులు పూర్తయ్యేలా చూడటానికి కేంద్రం స్మార్ట్ సిటీస్ మిషన్‌ను 2025 మార్చి వరకు పొడిగిస్తూ ఈ నెల ప్రారంభంలో ఉత్తర్వులు జారీ చేసింది. పలు రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక పట్టణ సంస్థల అభ్యర్థన మేరకు గడువు పొడిగించినట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రధాన మౌలిక సదుపాయాలను అందించే స్థిరమైన, సమ్మిళిత నగరాలను ప్రోత్సహించడం, పౌరులకు మంచి జీవన నాణ్యత, శుభ్రమైన, స్థిరమైన వాతావరణం, 'స్మార్ట్' పరిష్కారాలు అందించడం స్మార్ట్ సిటీస్ మిషన్ ప్రకటిత లక్ష్యం. ఈ మొత్తం మిషన్ కోసం ప్రభుత్వం 100 నగరాలకు రూ.48,000 కోట్లు కేటాయించిందని, నగరాలకు రూ.46,585 కోట్లు (97 శాతం) విడుదల చేశామని మంత్రిత్వశాఖ తెలిపింది. లోక్‌సభలో ఎస్‌సిఎం సంబంధిత ప్రశ్నకు సమాధానమిస్తూ, జులై 12 నాటికి రూ.1,64,223 కోట్ల విలువైన మొత్తం 8,016 ప్రాజెక్టులకు టెండర్లు వేయగా, వాటిలో రూ.1,45,083 కోట్ల విలువైన 7,218 ప్రాజెక్టులు (90 శాతం) పూర్తయ్యాయని తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 63, తెలంగాణలో 57 ప్రాజెక్టులు అమలులో ఉన్నాయి. ఈ రాష్ట్రాల తరువాత పంజాబ్ (39), పుదుచ్చేరి (36), తమిళనాడు (27), రాజస్థాన్ (21) ఉన్నాయి. పట్టణ పాలనను మెరుగుపరచడానికి స్మార్ట్ సిటీస్ మిషన్ వినూత్న సాంకేతిక పరిజ్ఞానం, డిజిటల్ పరిష్కారాలను ప్రయత్నించిందని ప్రభుత్వం పేర్కొంది.

రాష్ట్రపతి భవన్‌లో 2 హాల్స్ పేర్లు మార్పు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశ రాజధాని ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రెండు ప్రధానమైన హాల్స్ పేర్లను మార్చుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నిర్ణయం తీసుకున్నారు. దర్బార్ హాల్ పేరును గణతంత్ర మండపంగా, అశోక హాల్ పేరును అశోక మండపంగా మార్పు చేశారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ డిప్యూటీ ప్రెస్ సెక్రటరీ నవిక గుప్తా గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రపతి కార్యాలయం, నివాసం అయిన రాష్ట్రపతి భవన్, దేశానికి చిహ్నమని, ప్రజల అమూల్యమైన వారసత్వమని పేర్కొన్నారు. ఈ భవన్‌ను దేశ ప్రజలకు మరింత చేరువ చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ దిశలో రాష్ట్రపతి భవన్ భారతీయ సాంస్కృతిక విలువలు, తత్వాలను ప్రతిబింబించేలా చేసేందుకే పేర్లు మార్పు చేశామని, అందుకు సంతోషిస్తున్నామని పేర్కొన్నారు. జాతీయ అవార్డుల ప్రదానోత్సవానికి వేదికైన దర్బార్ హాల్ అనే పదం బ్రిటీష్ న్యాయస్థానాలు, సమావేశాలను సూచిస్తుందన్నారు. అందువల్ల 'గణతంత్ర మండపం' పేరుతో సముచిత స్థానం కల్పించామన్నారు. 'అశోక్' అనే పదం 'అన్ని బాధల నుండి విముక్తి' లేదా 'ఏ దుఃఖం లేని' వ్యక్తిని సూచిస్తుందని తెలిపారు. అశోక మండపం భారతీయ మత సంప్రదాయాలు, కళలు, సంస్కృతిలో లోతైన ప్రాముఖ్యత కలిగిన అశోక వృక్షాన్ని కూడా సూచిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



డాక్టర్ కోట్నీస్ విగ్రహం వద్ద ఎంబివికె బృందం

కోట్నీస్ మ్యూజియం సందర్శించిన ఎంబివికె బృందం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మహారాష్ట్ర సోలాపూర్‌లోని డాక్టర్ ద్వారకానాథ్ కోట్నీస్ మ్యూజియంను మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం సాంస్కృతిక బందం గురువారం సందర్శించింది. ఆయన విగ్రహం వద్ద ఏడుగురు సభ్యుల ఎంబివికె బృందం నివాళులర్పించింది. జపాన్ వ్యతిరేక పోరాటంలో పాల్గొంటున్న చైనా సైనికులకు వైద్యం చేసేందుకు అప్పటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ పంపిన వైద్య బృందంలో డాక్టర్ కోట్నీస్ ఒకరు. ఆయన చేసిన సేవలపై వివిధ చిత్రపటాలతో ఉన్న ఆయన స్వగృహాన్ని మ్యూజియంగా అభివృద్ధి చేశారు. ఆ మ్యూజియాన్ని, చైనా ప్రభుత్వం సహకారంతో నడుపుతున్న ఇంగ్లీష్ నుంచి చైనా భాషని నేర్పే స్కూలును బృందం సభ్యులు సందర్శించారు. ఎంబి విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ చైర్మన్ పి మధు, విజ్ఞాన కేంద్రం మేనేజ్మెంట్ కమిటీ కార్యదర్శి పి మురళీకృష్ణ, సభ్యులు యువి రామరాజు, కె.స్వరూపరాణి, పి విజయ, టి క్రాంతికిరణ్, జి నారాయణరావు ఈ బృందంలో ఉన్నారు.

బీహార్‌కి గ్రాంట్... ఏపికి అప్పు

- ఎన్‌డిఎ కూటమి నేతృత్వంలో ఎపిలో హింస : విజయసాయిరెడ్డి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర బడ్జెట్‌లో బీహార్‌కి రూ.26 వేల కోట్లు గ్రాంట్ ఇస్తే, ఆంధ్రప్రదేశ్‌కు రూ.15 వేల కోట్లు అప్పు ఇచ్చారని వైసిపి పార్లమెంటరీ నేత విజయసాయి రెడ్డి విమర్శించారు. గురువారం రాజ్యసభలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ఎన్‌డిఎ హయాంలో హింసకు కేరాఫ్ అడ్రస్‌గా రాష్ట్రం మారిందని అన్నారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి వర్గాలను లక్ష్యంగా చేసుకుని హత్యలు, హత్యాచారాలకు పాల్పడుతున్నారని, పెద్ద ఎత్తున ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారని చెప్పారు. ఏపి ప్రభుత్వం ప్రజాస్వామ్యానికే చేటుగా వ్యవహరిస్తుందని, ఒక గ్రూపు మీడియా ఎల్లో జర్నలిజం నడిపిస్తోందని, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బలోపేతం చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టానికి కట్టుబడ్డామన్న కేంద్ర ప్రభుత్వం, ప్రత్యేక హోదాను విస్మరించిందన్నారు. పార్లమెంట్‌లో వాగ్దానం చేసిన కేంద్రం ప్రత్యేక హోదాను ఇచ్చి తీరాల్సిందేనని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించారన్నది అబద్ధమని అన్నారు. పోలవరం ప్రాజెక్టు సవరించిన వ్యయం రూ.55 వేల కోట్లు అవసరమని, దీనిపై ఎలాంటి హామీ ఇవ్వలేదని చెప్పారు. పోలవరం ప్రాజెక్టును కట్టాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని, రాష్ట్ర ప్రభుత్వానికి ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. బిజెపికి చంద్రబాబుకు మధ్య క్విడ్ ప్రోకో ఉందని, 2014-19 మధ్య చంద్రబాబు భయంకరమైన అవినీతికి పాల్పడ్డారని అన్నారు.

పార్లమెంటును అవమానపరచటమే

నెతన్యాహు పర్యటనపై త్లాయిబ్ రషీదా విమర్శ




నెతన్యాహు ప్రసంగిస్తున్న సమయంలో 'యుద్ధ నేరస్తుడు' అని ప్లకార్డు చూపుతున్న రషీదా త్లాయిబ్

వాషింగ్టన్: అమెరికన్ కాంగ్రెస్‌లో ఏకైక పాలస్తీనియన్-అమెరికన్ డెమొక్రటిక్ ప్రతినిధి రషీదా త్లాయిబ్ యుద్ధ నేరస్తుడైన వ్యక్తిని ఎర్ర తివాచీ పరచి దేశంలోకి ఆహ్వానించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఆమె బుధవారం ఈ మేరకు ఒక ప్రకటన చేస్తూ, ఈ విషయంలో తమ సొంత పార్టీపైన, అధ్యక్ష భవనంపైన, రిపబ్లికన్లపైన ఆమె విమర్శనాస్త్రాలు సంధించారు. " పాపాల భైరవుడు నెతన్యాహును పార్లమెంటునుద్దేశించి ప్రసంగించేందుకు ఆహ్వానించడమంటే పార్లమెంటును అవమానపరచడమే. ఇందుకు డెమొక్రాటిక్, రిపబ్లికన్ పార్టీకి చెందిన నాయకులు సిగ్గుతో తలవంచుకోవాలి. జాతి ప్రక్షాళన అంటే పాలస్తీనీయన్లను అంతమొందించడమే పనిగా పెట్టుకున్న వ్యక్తిని గౌరవించడమంటే అతడు పాల్పడిన నేరాలను సంబరం చేసుకోవడమే. నెతన్యాహు సాదాసీదా నేరస్తుడు కాదు, అతి పెద్ద యుత్ధ క్రిమినల్. 39వేల మంది పాలస్తీనీయులను ఈ పది మాసాల్లో ఆయన అత్యంత కిరాతకంగా చంపాడు. ఈ ఊచకోతకు గురైనవారిలో 15వేల మందికి పైగా అభం శుభం తెలియని చిన్నారులే. అటువంటి వ్యక్తి ఉండాల్సింది జైలులో. అతణి అరెస్టు చేసి, అతను పాల్పడిన నేరాలపై అంతర్జాతీయ క్రిమినల్ కోర్టులో ప్రాసిక్యూట్ చేయాలి "అని ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థిత్వం నుంచి బైడెన్ తప్పుకుని, ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌ను తన వారసురాలిగా ప్రకటించిన నేపథ్యంలో ఆమె పదునైన పదాలతో ఈ ప్రకటన చేశారు. గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న ఊచకోతను వెంటనే ఆపాలని, శాశ్వత కాల్పుల విరమణ జరిగేలా చూడాలని డెమొక్రటిక్ అభ్యర్థిత్వ రేసులో ముందున్న కమలా హారిస్‌కు రషీదా సూచించారు.

డిలిమిటేషన్, జమిలి ఎన్నికలు, నీట్‌కు వ్యతిరేకంగా కర్ణాటక తీర్మానాలు

బెంగళూరు : డిలిమిటేషన్, జమిలి ఎన్నికలు, నీట్‌కు వ్యతిరేకంగా కర్ణాటక అసెంబ్లీ గురువారం మూడు వేర్వేరు తీర్మానాలను ఆమోదించింది. 2026 లేదా ఆ తరువాత జరిగే జనాభా లెక్కల ఆధారంగా లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల విభజనను కేంద్రప్రభుత్వం నిర్వహించకూడదని మొదటి తీర్మానంలో డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన సీట్లను పెంచే విషయంలో ఒక రాష్ట్రంలో లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్యను నిర్ణయించడానికి 1971 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవాలని కూడా ఈ తీర్మానంలో కోరారు. రెండో తీర్మానంలో 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' ప్రతిపాదనను వ్యతిరేకించారు. ఇలాంటి ప్రతిపాదన భారతదేశ ప్రజాస్వామ్య, సమాఖ్య వ్యవస్థకు ముప్పు కలిగిస్తుందని కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేర్కొంది. నేషనల్ ఎంట్రన్స్ కమ్ ఎలిజిబిలిటీ టెస్టు (నీట్)ను వ్యతిరేకిస్తూ మూడో తీర్మానం ఆమోదించారు. ఈ తీర్మానం ప్రవేశపెడుతూ రాష్ట్ర వైద్య విద్యాశాఖ మంత్రి శరణ్ ప్రకాష్ మాట్లాడుతూ నీట్ పరీక్షా విధానం గ్రామీణ ప్రాంతాల పేద పిల్లల వైద్య విద్యా అవకాశాలను తీవ్రంగా ప్రభావితం చేస్తోందని విమర్శించారు. ఎస్‌టిలు, ఇతర సాంప్రదాయ అటవీ నివాసులు (అటవీ హక్కు చట్టం) 2006పై కూడా అసెంబ్లీ నాలుగో తీర్మానాన్ని ఆమోదించింది. భూమి, ఇతర వనరులపై ఎస్‌టిలు, సాంప్రదాయ అటవీ నివాసుల హక్కులను పరిరక్షించే విధంగా చట్టంలో తగిన సవరణలు చేయాలని కేంద్రాన్ని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే డిమాండ్ చేశారు. ఈ తీర్మానాలను ప్రతిపక్ష బిజెపి వ్యతిరేకించింది. బిజెపి సభ్యుల నిరసనల మధ్యే తీర్మానాలను ఆమోదించినట్లు స్పీకర్ యుటి ఖాదర్ ప్రకటించారు.

ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు పోటీ నుండి వైదొలిగా : బైడెన్



అధ్యక్ష అభ్యర్థిగా బైడెన్‌ను సొంత పార్టీలోనే పలువురు వ్యతిరేకించిన సంగతి తెలిసిందే.

వాషింగ్టన్ : ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకే తాను అధ్యక్ష రేసు నుండి వైదొలిగినట్లు అమెరికా అధ్యక్షుడు బైడెన్ ప్రకటించారు. బుధవారం రాత్రి వైట్‌హౌస్‌లోని ఓవల్ కార్యాలయం నుండి టెలివిజన్‌లో ప్రసంగించారు. తాను సాధించిన విజయాల గురించి మాట్లాడారు. తన మూలాల గురించి మాట్లాడారు. అమెరికా ప్రజలను ప్రశంసించారు. అమెరికా ప్రజాస్వామ్య భవిష్యత్తు అమెరికన్ల చేతుల్లోనే ఉందని అన్నారు. తన పార్టీని ఏకం చేయాల్సిన అవసరం ఉందని ఇటీవల గుర్తించినట్లు తెలిపారు. కొత్త తరాలకు మార్గ నిర్దేశం చేయాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించడంలో ఏదీ అడ్డంకి కాదని, వ్యక్తిగత ఆశయం కూడా అదేనని అన్నారు. కమలా హారిస్ అనుభవజ్ఞురాలు, సమర్థురాలని అన్నారు. అద్భుతమైన తన భాగస్వామి దేశానికి అధ్యక్షురాలు కాగల సామర్థ్యం కలిగి ఉన్నారని అన్నారు. ఇటీవల ట్రంప్‌తో చర్చలో పేలవమైన ప్రదర్శన, డెమొక్రాట్ల నుండే వ్యతిరేకత నవంబర్ ఎన్నికల్లో బైడెన్ విజయావకాశాలపై సందిగ్ధత నెలకొంది.

పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్

2026 మార్చి నాటికి పోలవరం తొలి దశ పనులు పూర్తి

- కాంట్రాక్టర్ల మార్పు, భూసేకరణ, పునరావాసం, పరిహారం ఆలస్యం వల్లే జాప్యం
- కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

2026 మార్చి నాటికి పోలవరం తొలి దశ (41.5 మీటర్ల ఎత్తు) పనులు పూర్తవుతాయని కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ తెలిపారు. లోక్‌సభలో టిడిపి ఎంపిలు లావు శ్రీకృష్ణ దేవరాయలు, జిఎం హరీష్ బాలయోగి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సిఆర్ పాటిల్ సమాధానం ఇచ్చారు. ప్రాజెక్టు పనుల పరిశీలన, ఆలస్యానికి కారణాలు తెలుసుకోవడానికి 2021 ఆగస్టులో పోలవరం ప్రాజెక్టు అథారిటీ ఐఐటి హైదరాబాద్ నుంచి సహకారం తీసుకున్నామని, 2021 నవంబర్‌లో ఐఐటి హైదరాబాద్ రిపోర్టు సమర్పించిందని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యానికి ప్రధాన కారణాలుగా కాంట్రాక్టర్ల మార్పు, భూసేకరణ, పునరావాసం, పరిహారం ఆలస్యం కావడం, కోవిడ్ 19 మహమ్మారి, దాని సంబంధిత పరిస్థితులు గుర్తించామని కేంద్ర మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఇఎల్ 41.15 మీటర్ల ఎత్తుతో మొదటి దశ పోలవరం ప్రాజెక్టు 2026 మార్చి నాటికి పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు (పిఐపి) జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించినట్లు గుర్తు చేశారు. 2014 ఏప్రిల్ 1 నుంచి ప్రాజెక్టుకు అయ్యే ఖర్చు కేవలం ఇరిగేషన్ కాంపొనెంట్ కింద వంద శాతం కేంద్రమే భరించేందుకు 2016లో కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ఆమోదించిందని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణం నిర్వహణ మాత్రం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమే చూసుకుంటుందని తెలిపిందని వివరించారు.

గత మూడేళ్లలో రూ.8,044.31 కోట్లు కేంద్రం నుంచి ఇచ్చినట్లు కేంద్ర మంత్రి సిఆర్ పాటిల్ తెలిపారు. మూడేళ్ల పనుల పురోగతి వివరాలను కూడా సమాధానంలో పొందుపరిచారు. 2021-22 నుంచి మూడేళ్ళలో ప్రాజెక్టు ప్రధాన పనుల్లో 21 శాతం మట్టి పనులు, కాంక్రీటు పనులు కేవలం 5.3 శాతం జరిగాయని స్పష్టం చేశారు. కుడి కాలువకు లైనింగ్ పనులు 1.72 శాతం, స్ట్రక్చర్స్ 0.39 శాతం జరిగాయన్నారు. ఎడమ కాలువకు మట్టి పనులు 0.30 శాతం, లైనింగ్ 1.18 శాతం, స్ట్రక్చర్స్ 3.33 శాతం జరిగాయన్నారు. భూసేకరణ 0.22 శాతం, సహాయ పునరావాస కార్యక్రమం కేవలం 8 శాతం జరిగిందని కేంద్ర మంత్రి వెల్లడించారు.

హెడ్‌వర్క్ పనులు : 2021-22లో ఎర్త్‌వర్క్ 10.20 శాతం, కాంక్రీటు 4.70 శాతం, 2022-23లో ఎర్త్ వర్క్ 2.42 శాతం, కాంక్రీటు 0.14 శాతం, 2023-24లో ఎర్త్‌వర్క్ 7.82 శాతం, కాంక్రీటు 0.56 శాతం జరిగాయని తెలిపారు.

కుడి ప్రధాన కాలువ పనులు : 2021-22లో లైనింగ్ 4.70 శాతం, నిర్మాణాలు 0.39 శాతం, 2022-23లో లైనింగ్ 0.88 శాతం, 2023-24లో లైనింగ్ పనులు ఏం జరగలేదు. అలాగే 2022-23, 2023-24లలో నిర్మాణాలు పనులు జరగలేదు. ఈ మూడేళ్లు ఎర్త్ వర్క్ పనులు జరగలేదని తెలిపారు.

ఎడమ ప్రధాన కాలువ పనులు : 2021-22లో ఎర్త్ వర్క్ 0.11 శాతం, లైనింగ్ 1.12 శాతం, నిర్మాణాలు 0.22 శాతం, 2022-23లో ఎర్త్ వర్క్ 0.13 శాతం, లైనింగ్ పనులు ఏం జరగలేదు. నిర్మాణాలు 2 శాతం, 2023-24లో ఎర్త్ వర్క్ 0.06 శాతం, లైనింగ్ 0.06 శాతం, నిర్మాణాలు 1.11 శాతం జరిగాయని తెలిపారు.

భూసేకరణ : 2021-22లో 0.22 శాతం, 2022-23లో ఏం జరగలేదు. 2023-24లో 0.004 శాతం జరిగాయని తెలిపారు.

పరిహారం, పునరావాసం : 2021-22లో 3.47 శాతం, 2022-23లో 3.50 శాతం, 2023-24లో 1.06 శాతం జరిగాయని తెలిపారు. అయితే ఆయన పోలవరం రెండో దశ 45.72 ఎత్తు గురించి ఎక్కడా మాట్లాడలేదు.

విజయవాడ ఎయిర్‌పోర్టు పనులు 2025 జూన్ నాటికి పూర్తి

- లోక్‌సభలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విజయవాడ ఎయిర్‌పోర్టు పనులు 2025 జూన్ నాటికి పూర్తవుతాయని పౌర విమానయానశాఖ మంత్రి కె రామ్మోహన్‌నాయుడు తెలిపారు. లోక్‌సభలో జనసేన ఎంపి వల్లభనేని బాలశౌరి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు. విజయవాడ విమానాశ్రయం విస్తరణ (కొత్త ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ భవన నిర్మాణం) పనులు 2020 జూన్‌లో ఆమోదం పొందిందని, మొత్తం రూ.611.80 కోట్ల అంచనా వ్యయంతో పనులు మొదలు పెట్టామని తెలిపారు. ఇప్పటి వరకు రూ.279.93 కోట్లు ఖర్చుయిందని, పనులు 48.5 శాతం పూర్తయ్యాయని పేర్కొన్నారు. పర్యావరణ అనుమతులు రావడం ఆలస్యమైందని, అందువల్ల ప్రాజెక్టు జాప్యం జరిగిందని తెలిపారు. కరోనా, తుపానులు, భారీ వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు, సహా రాష్ట్రంలో నెలకొన్న ఇతర కారణాల రీత్యా పనులు ఆలస్యం అయ్యాయని పేర్కొన్నారు. నిర్మాణాలకు అవసరమైన ఇసుక లభించకపోవడం కూడా ఆలస్యానికి కారణమని చెప్పారు. విజయవాడ విమానాశ్రయం పనులు ప్రాధాన్యత కింద చేపడుతున్నామని, 2025 జూన్ నాటికి అన్ని పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని స్పష్టం చేశారు.

సర్వీసులు పెంచడంలో జోక్యం చేసుకోలేం

గతంలో విజయవాడ నుంచి ముంబాయికి రెండు సర్వీసులు ఉండేవని, వాటిని పునరుద్ధరించాలని కేంద్ర మంత్రిని సభ్యుడు బాలశౌరి కోరారు. విజయవాడ నుంచి ఢిల్లీ, కోల్‌కతా, ముంబాయికి విమానాలు నడపాలని, ఢిల్లీ నుంచి విశాఖపట్నం, తిరుపతికి విమాన సర్వీసులు పెంచాలని బాలశౌరి కోరారు. అలాగే విజయవాడ నుంచి కొలంబో, థాయిలాండ్, సింగపూర్‌కు ప్రయాణికుల నుంచి డిమాండ్ పెరుగుతున్న విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విమాన సర్వీసులు పెంచే విషయంలో మంత్రిత్వశాఖ జోక్యం చేసుకునే అధికారం లేదని రామ్మోహన్‌నాయుడు అన్నారు. డిమాండ్, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా విమానయాన సంస్థలు నిర్ణయం తీసుకుంటాయని, మంత్రిత్వశాఖ కేవలం మౌలిక సదుపాయాలు మాత్రమే కల్పించగలుగుతుందని వెల్లడించారు. సభ్యుల నుంచి వస్తున్న విజ్ఞాపనలను సానుకూలంగా స్వీకరించి, వాటిని సంబంధిత సంస్థలకు పరిశీలించాలని పంపుతున్నట్లు కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు.

ఐదేళ్ల చీకటి పాలన

(మొదటి పేజీ తరువాయి)

విమర్శించారు. చాలా మంది వైసిపి నేతలతో కుమ్మక్కై నిబంధనలు ఉల్లంఘించారు. అధికార పార్టీ నేతలతో విభేదిస్తే పోస్టింగ్‌లు ఇవ్వకుండా విఆర్‌లో వుంచి వేధించేవారన్నారు. పోలీసు వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. హోం మంత్రి అనిత, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజుపై ఎస్‌సిఎస్‌టి అట్రాసిటీ కేసులను నమోదు చేశారన్నారు. రఘురామకృష్ణరాజును లాకప్‌లో చిత్రహింసలు పెట్టిన వీడియోలు చూసి నాటి సీఎం పైశాచికానందం పొందారన్నారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు సభలో కేసులు ఉన్న సభ్యులు ఓసారి లేవాలని పవన్‌కల్యాణ్, లోకేశ్ సహా 80శాతం మంది తమ స్థానాల్లో లేచి నిలుచున్నారు.

భూసేకరణకు సన్నాహాలు

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి ఆదేశాలు ఇచ్చారు. పెనుమాక, ఉండవల్లి గ్రామాలను మంగళగిరి, తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో కలిపేశారు.

కోర్టును ఆశ్రయించిన జెఎసి

పూలింగు పరిధిలో ఉన్న గ్రామాల్లో భూములను రైతులకు ఇచ్చేయడం వల్ల అమరావతి మాస్టర్‌ప్లానుకు ఇబ్బంది కలుగుతుందని, తాము పూలింగుకు ఇచ్చిన భూముల్లో మాస్టర్‌ప్లాను అమలు జరిగేలా చూడాలని జెఎసి తరుపున రైతులు ఇటీవల కోర్టును ఆశ్రయించారు. భూసేకరణ నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ ఇచ్చిన గెజిట్‌ను రద్దు చేయాలని కోరారు. ప్రస్తుతం అది విచారణలో ఉంది. ఈ లోపు మూడు రాజధానుల నిర్ణయంతో భూముల విలువ పడిపోయింది. తాజాగా ప్రభుత్వం మారడంతో ఇప్పటి వరకూ భూములు ఇవ్వని, ముఖ్యంగా సీడ్ యాక్సెస్ రోడ్డు పరిధిలోకి వచ్చే భూములను సిఆర్‌డిఏకు ఇవ్వడానికి ముందుకు వచ్చారు. రైతులు ముందుకొచ్చి పూలింగు కింద భూములు ఇస్తామంటే తీసుకోవాలని సిఆర్‌డిఏ కమిషనర్ అధికారులకు సూచించారు. దీనిలో భాగంగా గతంలో నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ గుంటూరు జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయాలని నిర్ణయించారు. ఆయా గ్రామాల్లో మిగిలిన భూములను సేకరణ ప్రక్రియలో తీసుకుంటామని తెలిపారు. ఈ మేరకు గురువారం పెనుమాక రైతులు రెండున్నర ఎకరాలు ఇచ్చినట్లు సిఆర్‌డిఏ అధికారులు తెలిపారు. అయితే పూలింగుకు సంబంధించి ఎటువంటి నోటిఫికేషనూ ఇచ్చే అవకాశం లేని నేపథ్యంలో సేకరణ ప్రకటన ఇచ్చి అందులో పేర్కొన్న వారు స్వచ్ఛందంగా ముందుకొచ్చి పూలింగుకు ఇస్తే తీసుకోవాలనీ భావిస్తున్నారు.



మీకోసం

కుక్కర్ అడుగుభాగం నల్లగా అయితే రెండు చిన్న బంగాళాదుంప ముక్కల్ని వేసి కాసిన్ని నీళ్లు పోసి వేడి చేయాలి. ఆ నీటితో బాగా రుద్ది కడిగితే నలుపు పోతుంది.

జీవన సౌరభం

ఇంగిత జ్ఞానం లేని మెదడులో ప్రశ్న ఉదయించదు. మౌఢ్యం నిండిన మనసుల్లో ఆలోచన పుట్టదు.

చిన్నూ చింటూ - ఇరుగూ పొరుగూ



నాన్నారండీ నాన్నారండీ
పల్గూ పారా లెందుకండీ
చీపుళ్ళవీ ఎందుకండీ
చేసేదేమిటొ చెప్పండి?

చిన్నూ చింటూ అంతా రండి
చెత్తా గిత్తా, తీసేయండీ
చీపుళ్ళతో తుడవండి
మొక్కలతో సిద్ధం కండి!

నాన్నారండీ నాన్నారండీ
చెప్పిందంతా చేసామండి
మొక్కలతో సిద్ధం అండీ
తర్వాతేమిటో చెప్పండీ?

సపోటా లెనక పక్క
మామిడి జామలా పక్క
కమలా నారింజీ పక్క
పళ్ల మొక్కలూ ఓ పక్క

సంపంగి, బంతీ, చేమంతి
ఆకుకూరలూ, ఆ పక్క
పూలమొక్కలూ, ఓ పక్క
పాదులైతే, పందిర్పక్క

పలుగూ పారలు తీసి
గుంటల్దీసి, గోతుల్దీసి
బోదులెట్టి, పందిర్లేసి
మొక్కల్నాటి, విత్తుల్జల్లి

చేద తీసి, నూత్లో వేసి
నీటిన్దెచ్చి, మొక్కల్కేసి
సేంద్రియ ఎరువులేసి
కలుపు తొలగించగ


ఆకులొచ్చీ, మొగ్గలొచ్చి
కాయలు కాసి, పండ్లొచ్చి
కూరలతో ఆక్కూర్లతో
తోటంతా నిండిపోయింది

పళ్లూ కూరలు కోశారు
పువ్వులు అన్నీ తెంపారు
చిన్నూ చింటూ వాటాలేసి
చుట్టు పక్కలా పంచారు

సొంత లాభం కొంత మాని
పొరుగువారికి పంచి
ఆదర్శంగా నిలిచారు
జేజేలు అందుకున్నారు

ఉన్నంతలో పంచుకుంటే
అదే ఉన్నత జీవనం
స్నేహితులు పెంచుకుంటే
అదే జీవిత సాఫల్యం!

- పాట్నీడి వి.వి. సత్యనారాయణ



గుర్తించండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన బొమ్మలను ఆంగ్లంలో ఏమంటారో పక్కనే ఉన్న అక్షరాల్లో గుర్తుపెట్టండి. ఉదాహరణకు ఒకటి ఇచ్చాం.

నేను గీసిన బొమ్మ



- జాహ్నవి, 9వ తరగతి, అరవింద హైస్కూలు, కుంచనపల్లి, గుంటూరు.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ ఎదుర్కొనే సమస్య మోకాళ్ల నొప్పులు. వృద్ధులు నడవలేని పరిస్థితులు నెలకొంటుండగా నడివయస్సు వారు సైతం ఇబ్బంది పడే పరిస్థితి ఉంది. తరచూ మోకాళ్లు నొప్పులు వస్తే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. అంతేకాని నొప్పులు ఊరకే తగ్గిపోతాయనుకుంటే ఆ నొప్పి మరింత పెద్దదయ్యే ప్రమాదం ఉంటుంది. వాతావరణం మార్పులు, ఉష్ణోగ్రతలో ప్రతి 10 డిగ్రీలు తగ్గిన సమయంలో మోకాలి నొప్పి పెరుగుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు.

మోకాళ్ల నొప్పులా, ఈ జాగ్రత్తలు పాటించండి!





- డాక్టర్ కె.నవీన్ నాగ పవన్, తాడివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పొందూరు మండలం, శ్రీకాకుళం జిల్లా.

చల్లని వాతావరణం కీళ్లపై చాలా ఒత్తిడిని కల్గిస్తుంది. తేమస్థాయిలు, వాతావరణ పీడనం, ఉష్ణోగ్రతలో ఆకస్మిక మార్పులతో వర్షాలు ప్రారంభమైన వెంటనే చాలామందికి కీళ్ళనొప్పులు బాధిస్తాయి. కండరాలు గట్టిపడటం వల్ల ఈ నొప్పులు మరింత ఎక్కువమవుతాయి. ఒకప్పుడు వయస్సు పెరిగే కొద్దీ ఈ నొప్పులు వచ్చేవి. ఆధునిక జీవనశైలిలో మార్పులతో నేడు చిన్న వయస్సు వారు సైతం ఈ సమస్యతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కీళ్ల నొప్పులు ఉన్న వారు లేస్తే కూర్చోలేరు, కూర్చుంటే లేవలేరు. కీళ్ల నొప్పుల సమస్య ఉన్న వారికి వర్షాకాలం మరింత బాధాకరంగానే ఉంటుంది.

యూరిక్ యూసిడ్‌తోనే...

కీళ్ల నొప్పులకు అనేక కారణాలుంటాయి. చెడు ఆహార అలవాట్ల కారణంగా ఈ సమస్య మరింత ఎక్కువ అవుతుంది. శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయి పెరగటం వల్ల కూడా కీళ్ల నొప్పి వచ్చే అవకాశం ఉంటుంది. శరీరంలో దీని పరిమాణం పెరిగితే క్రమంగా అవి స్పటికాలుగా మారి కీళ్ల, కీళ్ల చుట్టూ ఉండే కణజాలాల్లో పేరుకుపోతాయి. బలహీనత వల్ల కూడా నొప్పులు వచ్చే అవకాశం ఉంటుంది. జన్యుపరమైన కారణాలు, వయస్సు పెరిగే కొద్దీ నొప్పులు వస్తాయి. జీవనశైలిలో కొన్ని ఆహార పదార్థాలు చేర్చుకుంటే కీళ్ల నొప్పుల సమస్య నుంచి ఉపశమనం పొందొచ్చు.



అనునిత్యం మోకాళ్ల నొప్పులతో బాధపడేవారు చాలామంది ఉంటారు. విపరీతమైన పొప్పితో ఏ పనిచేయాలన్నా మోకాలు సహకరించకపోవటంతో నరకాన్ని అనుభవిస్తూ ఉంటారు. నడవాలన్నా, మెట్లు ఎక్కాలన్నా, పరిగెత్తాలన్నా మోకాలు నొప్పి ఎక్కువగా ఉన్న వారు తీవ్ర ఇబ్బందులను అనుభవిస్తూ ఉంటారు. నొప్పి భరించలేక ఆస్పత్రుల చుట్టూ తిరిగే వారు అనేకమంది ఉంటారు. ఆర్థరైటిస్ కారణంగా మోకాళ్ల నొప్పులు ఎక్కువగా వస్తాయి.

కారణాలు ఏమంటే...

కీళ్లు బలహీనంగా మారటం వల్ల మోకాలు లోపలి కణజాలం దెబ్బతింటుంది. దీనివల్ల మృదులాస్థి అరిగిపోతుంది. అప్పుడు ఎలాంటి కదలిక జరిగినా తీవ్రమైన నొప్పి, మంట కల్గుతుంది.

- నొప్పి రావటానికి విపరీతంగా బరువు ఉండటం
- సరైన వ్యాయామం శరీరానికి లేకపోవడం
- శరీరానికి కావాల్సిన విటమిన్ డి3 లేకపోవటం
- ఉదయం సూర్యరశ్మి మోకాలిపై పడేలా చూడకపోవటం
- మెట్లక్కడం, ఏటవాలుగా ఉన్న ప్రదేశాల్లో నడవటం

ఇలా చేస్తే మంచిది

- మంచి పోషకాహారం తీసుకోవాలి
- బరువు తగ్గేలా వ్యాయామాలు చేయాలి.
- మోకాలి చుట్టూ ఉండే కండరాలు బలపడేలా ప్రయత్నించాలి.



నొప్పి ఎందుకు వస్తుందంటే...

అసలు వాస్తవం ఏంటంటే..కీళ్లలో ఆర్థరైటిస్ సమస్య అధికంగా ఉన్నవారిలో చల్లగా లేదా వర్షంగా ఉన్నప్పుడు మోకాళ్లలో నొప్పి ఎక్కువగా వస్తుంటుంది. బారో మెట్రిక్ పీడనంలో కూడా భారీ మార్పులు కనిపించాయి. శరీరంలోని కండరాలు, కణజాలంపై ప్రభావం పడి నొప్పికి దారితీస్తాయని గుర్తించారు. ఆర్థరైటిస్ భారిన పడిన వారిలో మోకాలి నొప్పి తీవ్రంగా ఉంటుందని డాక్టర్లు ధృవీకరిస్తున్నారు. తక్కువ ఉష్ణోగ్రతలు ఉన్న సమయంలో కీళ్లలో సైనోవియల్ ద్రవణాన్ని చిక్కగా చేస్తాయని అందుకే నొప్పిగా అనిపిస్తాయని స్పష్టం చేశారు.

మోకాళ్లలో ఉంటే సైనోవియల్ ఫ్లూయిడ్ 10 డబ్లు 40 వరకు అవసరం ఉంటుంది.. జాయింట్ల మధ్య కీళ్లు అటు ఇటు కదిలేటప్పుడు సున్నితంగా ఉండేందుకు ఈ ద్రావణం సాయ పడుతుంది. ఒకవేళ ఈ ద్రావణం కానీ చిక్కబడితే మాత్రం జాయింట్ కీళ్లలో బిగుతుగా పట్టేసినట్టు అనిపిస్తుంటుంది..

మోకాలి నొప్పిని అశ్రద్ధ చేయొద్దు

మోకాలి నొప్పిగా అనిపించినప్పుడు.. కొంచెం కూడా అశ్రద్ధ చేయొద్దు.. వాతావరణం బాగోలేని సమయంలో మోకాలికి గాయమైతే తీవ్రమైన నొప్పి ఉంటుంది. ఆరోగ్యంగా ఉన్న వారిలో మోకాలినొప్పి ఎందుకు వస్తుందో గుర్తించాల్సిన అవసరం ఉంది. ఆర్థరైటిస్ సమస్య కారణంగా చాలామందిలో మోకాలి నొప్పిలకు దారితీస్తుంది. అది ఎందుకు ఏ కారణం వల్ల వస్తుందో ముందుగా నిర్ధారించుకునే ప్రయత్నం చేయాలి.

వాతావరణం తేమగా ఉన్నప్పుడు ...

- కీళ్లు దెబ్బతినకుండా ఉండేందుకు వీలుగా మందపాటి దుస్తులను ధరించాలి
- శరీరాన్ని వెచ్చగా ఉంచుకునేందుకు ప్రయత్నించండి
- స్నానం వేడినీళ్లతో చేయాలి.
- స్టీమ్ బాత్ లు కూడా మంచి ఉమశమనం కలిగిస్తాయి..

కీళ్ళపై ఒత్తిడితోనే నొప్పులు

కదలకుండా కూర్చోవడం వల్ల కండరాలు, కీళ్లు బిగుసుకుపోతాయి. దీనివల్ల ఇది నొప్పికి దారితీస్తుంది. బరువు పెరిగితే కూడా కీళ్ళు, మోకీళ్ల మీద ఎక్కువగా భారం పడటంతో నొప్పులు ఎక్కువవుతాయి. అందుకోసమే అధిక బరువు తగ్గించుకునేందుకు ప్రయత్నించాలి. ఒకవేళ మామూలు బరువు గనక ఉన్నట్లైతే పెరగకుండా జాగ్రత్తపడాలి. కీళ్ల నొప్పులు ఉన్నచోట గోరు వెచ్చని నీటితో మర్దనా చేసుకోవాలి. అవసరమైతే హీటింగ్ ప్యాడ్స్ వాడుకోవచ్చు. గోరువెచ్చని నీటిని స్నానం చేస్తే మంచి ఉపశమనం లభిస్తుంది. సాధరణంగా శరీరంలో నీటి శాతం తగ్గితే కీళ్ల కదలికలు సరిగ్గా సాగవు. అందుకోసమే రోజంతా అప్పుడప్పుడు నీరు తాగడం చాలా మంచింది.



ఐదు రింగులతో సుందరంగా ముస్తాబైన ఈఫిల్ టవర్



ఒలింపిక్స్ సందర్భంగా ఈఫిల్ టవర్‌పై సైనిక విమానాల విన్యాసం

పతకాల సాధనలో


చరిత్ర తిరగరాయాల్సిందే..!

షూటింగ్, ఆర్చరీ, హాకీపై భారీ ఆశలు
నీరజ్ మళ్లీ పతకం కొట్టేనా..?

పారిస్: భారత్ 2020 టోక్యో ఒలింపిక్స్‌లో రికార్డుస్థాయిలో 7 పతకాలు సాధించింది. అలాగే 2008లో అభినవ్ బింద్రా తర్వాత 13ఏళ్లకు మరో స్వర్ణాన్ని అందుకుంది. నీరజ్ చోప్రా జావెలిన్ త్రో విభాగంలో భారత్‌కు టోక్యోలో బంగారు పతకాన్ని సంపాదించిపెట్టాడు. ఇక భారత పురుషుల హాకీ జట్టు కాంస్య పతకం సాధించి 41ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించింది. ఈ రెండు విభాగాల్లోనూ ఈసారి పతకాలు దక్కడం ఖాయంగా కనబడుతున్నాయి. ఈసారి షూటింగ్, ఆర్చరీ, హాకీలో భారత్‌కు పతకాలు దక్కడం ఖాయంగా కనబడుతోంది. టోక్యో ఒలింపిక్స్ షెడ్యూల్ ప్రకారం 2020లో జరగాల్సి ఉండగా.. కరోనాతో 2021లో జరిగాయి. కరోనా దృష్ట్యా ప్రారంభోత్సవ వేడుకలతోపాటు క్రీడలను కూడా కొద్దిమంది ప్రేక్షకుల మధ్య మాత్రమే నిర్వహించారు.

అమెరికాకు దీటుగా చైనా..

అమెరికాకు గత ఒలింపిక్స్‌లో కమ్యూనిస్టు చైనా నుంచి గట్టి పోటీ ఎదురైంది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో అమెరికా-చైనా మధ్య అంతరం ఒక్క బంగారు పతకం మాత్రమే. ఆ ఒలింపిక్స్‌లో అమెరికా 39స్వర్ణాలు సాధించగా.. చైనా 38 బంగారు పతకాలతో రెండోస్థానంలో నిలిచింది. 2016 రియో ఒలింపిక్స్‌లో 26స్వర్ణాలు సాధించిన చైనా.. టోక్యో ఒలింపిక్స్‌లో జూలు విదిలించి అదనంగా మరో 12 స్వర్ణాలు కైవసం చేసుకొంది. రియో ఒలింపిక్స్‌లో 46 స్వర్ణ పతకాలను సాధించిన అమెరికా.. టోక్యో ఒలింపిక్స్‌లో 7 స్వర్ణ పతకాలను కోల్పోయింది.



రొమేనియా లాంగ్ జంపర్‌పై నిషేధం

ఒలింపిక్స్ తొలి రోజే ఒక అథ్లెట్ డోప్ పరీక్షలో పట్టుబడింది. రొమేనియాకు చెందిన లాంగ్ జంపర్ ఫ్లోరెంటినా లస్కో డోప్ టెస్టులో ఫెయిల్ అయింది. దాంతో, గురువారం ప్రపంచ డ్రగ్స్ నిరోధక సంస్థ అధికారులు ఆమెపై నిషేధం విధించారు. ఫ్లోరెంటినా నిషేధిత డైయురెటిక్ అనే మందు తీసుకున్నట్టు గుర్తించారు. 2023 ఏప్రిల్‌లో డైయురెటిక్‌ను వాడా నిషేధిత డ్రగ్స్ జాబితాలో చేర్చింది. ఒలింపిక్స్ విలేజ్‌లోని వాడా అధికారులు ఫ్లొరెంటీనాకు డోపింగ్ టెస్టు చేశారు. ఆమె నుంచి సేకరించిన శాంపిల్ 'ఏ', శాంపిల్ 'బి'లను పరీక్షించగా రెండూ డైయురెటిక్ డ్రగ్‌కు పాజిటివ్ వచ్చాయి. దాంతో, మాదకద్రవ్యాల నిరోధక చట్టం ఉల్లంఘనకు పాల్పడిన ఫ్లొరెంటనాపై వాడా కఠిన చర్యలు తీసుకుంది. విశ్వ క్రీడల్లో పాల్గొనకుండా ఆమెపై వేటు పడింది. ఫ్లొరెంటిన లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్ పోటీలకు ఎంపికైంది.

నాకౌట్‌కు భారత ఆర్చరీ జట్లు



పారిస్ ఒలింపిక్స్‌లో భారత పురుషుల, మహిళల ఆర్చరీ జట్లు నాకౌట్‌కు చేరాయి. గురువారం జరిగిన క్వాలిఫికేషన్ రౌండ్‌లో ధీరజ్, తరుణ్‌దీప్, ప్రవీణ్‌లతో కూడిన పురుషుల జట్టు 2013పాయింట్లతో 3వ స్థానంలో, దీపిక, అంకిత, భజన్ కౌర్‌లతో కూడిన మహిళల జట్టు 1983పాయింట్లతో నాల్గోస్థానంలో నిలిచాయి. పురుషుల జట్టు కొరియా, ఫ్రాన్స్‌లకంటే వెనుకబడగా.. 29న జరిగే క్వార్టర్స్‌ల టర్కీ, కొలంబియాలతో తలపడనుంది. సెమీస్‌లో ఫ్రాన్స్‌తో తలపడే అవకాశముంది. ఇక మహిళల జట్టు 28న ఫ్రాన్స్, నెదర్లాండ్స్‌తో క్వార్టర్స్‌లో తలపడనుంది. గెలిస్తే సెమీస్‌లో కొరియాతో తలపడనుంది.



కొరియా ఆర్చర్ ప్రపంచ రికార్డు

ఒలింపిక్స్ తొలిరోజే ప్రపంచ రికార్డు బద్ధలైంది. ఆర్చరీ ర్యాంకింగ్స్ రౌండ్‌లో దక్షిణ కొరియా యువకెరటం లిమ్ సిహైయన్(21) చరిత్ర సృష్టించింది. మహిళల వ్యక్తిగత ఆర్చరీ విభాగంలో గురువారం జరిగిన పోటీల్లో లిమ్ 694 పాయింట్లు సాధించింది. దాంతో, 2019లో దక్షిణ కొరియాకే చెందిన కాంగ్ చీయంగ్(692 పాయింట్లు) నెలకొల్పిన రికార్డును ఈ టీనేజర్ బద్ధలు కొట్టేసింది. వరల్డ్ నంబర్ 2 అయిన లిమ్ సిహైయన్ ఈ సీజన్‌లో సూపర్ ఫామ్‌లో ఉంది. హుండాయ్ ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్ 2లో రెండు బంగారు పతకాలు సాధించింది.

ధీరజ్‌కు 4వ స్థానం

ఆర్చరీ పురుషుల వ్యక్తిగత విభాగంలో ధీరజ్ బొమ్మదేవర సత్తా చాటాడు. వ్యక్తిగత విభాగంలో 681పాయింట్లు సాధించి 4వ స్థానంలో నిలిచాడు. మరో ఆర్చర్ తరుణ్ దీప్ రాయ్ ఓవరాల్‌గా 764పాయింట్లతో 14వ స్థానంలో నిలిచాడు. ప్రవీణ్ జాదవ్(658పాయింట్లుక్కి 39వ స్థానంలో నిలిచి నిరాశపరిచాడు.

బాక్సింగ్‌లో ఎదురులేని క్యూబా..

11కోట్ల జనాభా కలిగిన క్యూబా.. ఒలింపిక్స్‌లో తన సత్తా చాటుతోంది. భారత్‌లాంటి అనేక పెద్ద దేశాలకన్నా పతకాల పట్టికలో అది మెరుగైన స్థానంలో ఉంటోంది. పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనే క్యూబా ఆటగాళ్ల బృందం ఇప్పటికే పారిస్ చేరుకుంది. బాక్సింగ్ విభాగంలో ఫేవరేట్‌గా బరిలోకి దిగుతున్న క్యూబా.. ఈసారి 20 పతకాలే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. టోక్యో ఒలింపిక్స్‌లో 70మంది క్యూబన్ అథ్లెట్ల బృందం పాల్గొని 7స్వర్ణాలతో సహా మొత్తం 15పతకాలు సాధించి టాప్-15లో చోటు సంపాదించుకుంది. ఈ ఒలింపిక్స్‌లో 61మంది అథ్లెట్లతో వెళ్లిన క్యూబా.. టాప్-10లో చోటు సంపాదించడమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది.

గెలుపే లక్ష్యంగా హర్మన్‌ప్రీత్ సేన

నేడు బంగ్లాతో ఢీ ● మ. 2.00గం.లకు

ధంబుల్లా(శ్రీలంక): ఆసియా కప్ మహిళల క్రికెట్ చివరి దశకు చేరుకుంది. హ్యాట్రిక్ విజయాలతో సెమీస్‌కు చేరిన హర్మన్‌ప్రీత్ సేన శుక్రవారం బంగ్లాదేశ్‌తో తొలి తలపడనుంది. డిఫెండింగ్ చాంపియన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఏడుసార్లు ఆసియా కప్ గెలుపొందింది. టీమిండియా తొలి మ్యాచ్‌లోనే పాకిస్తాన్‌ను చిత్తుచేసింది. ఆ తర్వాత యుఎఇ, నేపాల్ జట్లపైనా ఘన విజయం సాధించి గ్రూప్-ఎలో అగ్రస్థానంలో నిలిచింది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో భారత్ పటిష్టంగా ఉంది. ఓపెనర్లు షఫాలీ వర్మ, స్మృతి మంధానాలు విధ్వంసక బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లను బెంబేలెత్తిస్తున్నారు. మిడిలార్డర్‌లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, జెమీమా రోడ్రిగ్స్, రీచా ఘోష్‌లు ధనాధన్ ఆడుతున్నారు. ఇక బౌలింగ్ విభాగంలోనూ పేసర్ రేణుకా సింగ్, అరుంధతీ రెడ్డి, యువ ఆల్‌రౌండర్ పూజా వస్త్రాకర్‌లు పవర్ ప్లేలోనే వికెట్లు తీసి బ్రేకిస్తున్నారు. ఆతిథ్య శ్రీలంకతో పాకిస్తాన్ జట్టు రెండో సెమీస్‌లో తలపడనుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68